



www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI






సోమవారం | 17-6-2024 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 65 సంచిక (Issue) : 62 | శ్రీ క్రోధి నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మరుతువు, జ్యేష్ఠమాసం, శుక్లపక్షం; తిథి: ఏకాదశి పూర్తి; నక్షత్రం: చిత్ర మ. 1.59 తదుపరి స్వాతి; వర్జ్యం: రా. 7.55-9.39; దుర్ముహూర్తం: మ. 12.42-1.34, మ. 3.18-4.10; అమృతఘడియలు: ఉ. 6.44-8.30; రాహుకాలం: ఉ. 7.30-9.00; సూర్యోదయం: 5.44; సూర్యాస్తమయం: 6.47 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru




## ప్రపంచకప్‌లో నేటి మ్యాచ్‌లు

బంగ్లాదేశ్ x నేపాల్ (ఉ.5. గం.)
శ్రీలంక x నెదర్లాండ్స్ (ఉ.6. గం.)
న్యూజిలాండ్ x పీఎన్‌జీ (రా.8. గం.)

## గంభీర్ డిమాండ్‌కు ఓకే

### టీమిండియా కొత్త కోచ్‌గా ఖరారు!



న్యూఢిల్లీ: భారత క్రికెట్ జట్టు కోచ్‌గా గౌతం గంభీర్ పేరు దాదాపు ఖరారైనట్టే. ఈ నెల చివర్లో టీ20 వరల్డ్‌కప్ ముగిశాక బీసీసీఐ అతడి పేరును అధికారికంగా ప్రకటించనుందని సమాచారం. అయితే అంతకన్నా ముందు బోర్డు ముందు గంభీర్ ఓ డిమాండ్‌ను పెట్టాడట. కోచ్‌గా తాను బాధ్యతలు తీసుకోవాలంటే సహాయక సిబ్బందిని కూడా తానే ఎంపిక చేసుకుంటానని స్పష్టం చేసినట్టు బోర్డు వర్గాలు పేర్కొన్నాయి. ఇందుకు బీసీసీఐ కూడా సమ్మతించడంతోనే గంభీర్ కోచ్‌గా ఉండేందుకు అంగీకరించాడు.

## లవ్లీనాకు రజతం

న్యూఢిల్లీ: భారత స్టార్ బాక్సర్ లవ్లీనా బోర్గోహైన్ చెక్ రిపబ్లిక్ దేశంలో జరిగిన గ్రాండ్ ప్రీ టోర్నీలో పతకం సాధించింది. ఆదివారం జరిగిన 75 కిలోల విభాగం ఫైనల్లో లవ్లీనా 2-3తో లీ కియాన్ (చైనా) చేతిలో ఓడి రజతంతో సరిపెట్టుకుంది.

## జాతీయ ఫెన్సింగ్‌లో 3 పతకాలు



జగ్గప్పదొర

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): జాతీయ ఫెన్సింగ్ పోటీల్లో తెలుగు క్రీడాకారులు సత్తా చాటారు. కటక్‌లో జరిగిన ఈ పోటీల్లో కాకినాడకు చెందిన శ్రీనాగం ప్రద్యుమ్న జగ్గప్పదొర అండర్-10 సబ్రే విభాగంలో కాంస్యం అందుకున్నాడు. హైదరాబాద్‌కు చెందిన సిద్ధార్థ్, రియాన్షు అండర్-10 కేటగిరీ ఫాయిల్‌లో సంయుక్తంగా కాంస్య పతకాలు సాధించారు.

## సుమిత్.. రన్నరప్

పెరూగియా (ఇటలీ): వరుసగా రెండో ఏటీపీ చాలెంజర్ టైటిల్ నెగ్గాలన్న భారత టెన్నిస్ స్టార్ సుమిత్ నగల్ ఆశలకు బ్రేక్ పడింది. పెరూగియా చాలెంజర్ ఈవెంట్‌లో సుమిత్‌కు ఫైనల్లో చుక్కెదురైంది. ఆదివారం జరిగిన తుదిపోరులో ఆరోసీడ్ సుమిత్ 1-6, 2-6తో టాప్‌సీడ్ లూసియానో డార్డెరి (ఇటలీ) చేతిలో ఓటమిపాలై రన్నరప్‌తో సరిపెట్టుకున్నాడు. సుమిత్ గతవారం జర్మనీ టోర్నీలో విజేతగా నిలిచిన సంగతి తెలిసిందే.

## భజన్‌కు స్వర్ణం

### ఒలింపిక్ బెర్త్ ఖరారు

'పారిస్'కు అంకిత కూడా అర్హత



అంటాల్యా: ఫైనల్ ఒలింపిక్ క్వాలిఫయర్స్‌లో భారత ఆర్చర్లు భజన్ కౌర్, అంకితా భక్త్ సత్తా చాటారు. మహిళల వ్యక్తిగత రికర్వ్ విభాగంలో భజన్ స్వర్ణ పతకం గెలవడంతో పాటు పారిస్ ఒలింపిక్స్‌కు బెర్త్ ఖాయం చేసుకుంది. ఆదివారం జరిగిన ఫైనల్లో భజన్ 6-2తో టాప్‌సీడ్ మొబినా ఫలా (ఇరాన్)ను చిత్తు చేసి విజేతగా నిలిచింది. ఇక, ఇదే విభాగం క్వార్టర్స్‌లో అంకిత 4-6తో మొబినా చేతిలో ఓడింది. అయితే, క్వార్టర్స్ చేరడంతో అంకితకు కూడా పారిస్ విశ్వక్రీడలకు టికెట్ దక్కింది. ఇక, భారత స్టార్ ఆర్చర్ దీపిక కుమారి తొలి రౌండ్‌లోనే ఓడి నిరాశపర్చింది.

## ఆదుకున్న స్టొయినిస్

### ఆసీస్ విజయం.. పోరాడిన స్కాట్లాండ్

గ్రాస్ ఐలెట్ (సెయింట్ లూసియా): మార్కస్ స్టొయినిస్ (29 బంతుల్లో 9 ఫోర్లు, 2 సిక్సర్లతో 59) మరోసారి ఆపద్బాంధవ పాత్ర పోషించాడు. దీంతో గ్రూప్ 'బి'లో చివరి ఓవర్ వరకు ఆసక్తికరంగా సాగిన టీ20 వరల్డ్‌కప్ మ్యాచ్‌లో ఆస్ట్రేలియా 5 వికెట్ల తేడాతో గట్టెక్కింది. ఈ ఓటమితో స్కాట్లాండ్ నిష్క్రమించింది. ముందుగా స్కాట్లాండ్ 20 ఓవర్లలో 5 వికెట్లకు 180 పరుగులు చేసింది. మెక్‌ములెన్ (60), బెరింగ్టన్ (42 నాటౌట్), మున్సే (35) ధాటిగా ఆడారు. మ్యాక్స్‌వెల్ 2 వికెట్లు తీశాడు. ఛేదనలో ఆసీస్ 19.4 ఓవర్లలో 5 వికెట్లకు 186 రన్స్ చేసి గెలిచింది. 13 ఓవర్ల వరకు మ్యాచ్ స్కాట్లాండ్ ఆధీనంలోనే ఉన్నా ఆ తర్వాత 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' స్టొయినిస్ ధనాధన్ బ్యాటింగ్‌తో ఒత్తిడి తొలిగిపోయింది. హెడ్ (68), డేవిడ్ (24 నాటౌట్) రాణించారు. వాట్, షరీఫ్‌లకు రెండేసి వికెట్లు దక్కాయి.

**పాయింట్ల పట్టిక — గ్రూప్-బి**

| జట్టు | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | రన్‌రేట్ |
|---|---|---|---|---|---|---|
| ఆస్ట్రేలియా | 4 | 4 | 0 | 0 | 8 | 2.791 |
| ఇంగ్లండ్ | 4 | 2 | 1 | 1 | 5 | 3.611 |
| స్కాట్లాండ్ | 4 | 2 | 1 | 1 | 5 | 1.255 |
| నమీబియా | 4 | 1 | 3 | 0 | 2 | -2.585 |
| ఒమన్ | 4 | 0 | 4 | 0 | 0 | -3.062 |

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

# మంధాన శతక గర్జన




6 — మంధానకు ఇది వన్డేల్లో ఆరో సెంచరీ. కాగా, స్వదేశంలో మాత్రం ఇదే మొదటిది.

● శోభనకు 4 వికెట్లు ● భారత్‌దే తొలి వన్డే
● 143 పరుగుల తేడాతో దక్షిణాఫ్రికా చిత్తు

బెంగళూరు: డాషింగ్ ఓపెనర్ స్మృతి మంధాన (127 బంతుల్లో 12 ఫోర్లు, సిక్స్‌తో 117) శతకంతోపాటు స్పిన్నర్లు ఆశా శోభన (8.4-2-21-4), దీప్తి శర్మ (6-0-10-2) తిప్పేయడంతో.. దక్షిణాఫ్రికాతో మల్టీ ఫార్మాట్ సిరీస్‌ను భారత మహిళల జట్టు ఘనంగా ఆరంభించింది. ఆదివారం జరిగిన తొలి వన్డేలో హర్మన్ సేన 143 పరుగుల భారీ తేడాతో గెలిచింది. తొలుత భారత్ 50 ఓవర్లలో 265/8 స్కోరు చేసింది. దీప్తి శర్మ (37), పూజా వస్ర్తాకర్ (31 నాటౌట్) రాణించారు. అయబొంగ 3, మసాబటా క్లాస్ 2 వికెట్లు పడగొట్టారు. ఛేదనలో సౌతాఫ్రికా 37.4 ఓవర్లలో 122 పరుగులకే కుప్పకూలింది. స్పిన్నర్ ఆశా శోభన సంచలన ప్రదర్శనతో అరంగేట్ర మ్యాచ్‌ను చిరస్మరణీయం చేసుకుంది. రేణుక, పూజ, రాధా యాదవ్ తలా వికెట్ తీశారు. స్మృతి మంధాన 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్'గా నిలిచింది.




**ఆదినుంచే తడబాటు:** సఫారీల ఇన్నింగ్స్‌లో కెప్టెన్ లారా వొల్వార్ట్ (4)ను రేణుక మొదటి ఓవర్‌లోనే అవుట్ చేసి షాకిచ్చింది. అనెక్ బాష్ (5), తంజిమ్ బ్రిట్స్ (18) కూడా ఎక్కువసేపు క్రీజులో నిలవలేకపోయారు. అయితే, సునె లుస్ (33), మరిజానె కాప్ (24) నాలుగో వికెట్‌కు 39 పరుగుల భాగస్వామ్యంతో జట్టును ఆదుకొనే ప్రయత్నం చేశారు. కానీ, కాప్‌ను శోభన బోల్తా కొట్టించడంతో జట్టు 72/4తో పీకల్లోతు కష్టాల్లో పడింది. ఆ వెంటనే డ్రెక్సన్ (1)ను జెమీమా రనౌట్ చేయగా, క్రీజులో పాతుకుపోయిన లుస్‌ను దీప్తి ఎల్బీ చేయడంతో సౌతాఫ్రికా ఆశలు ఆవిరయ్యాయి. సినాలో జఫ్టా (27 నాటౌట్) ధాటిగా ఆడినా ఫలితం లేకపోయింది. క్లాస్ (1), మ్లబా (0), కకా (0)ను అవుట్ చేసిన శోభన.. సౌతాఫ్రికా ఇన్నింగ్స్‌కు తెరదించింది.

**టాప్ విలవిల:** టాపార్డర్ బ్యాటర్లు విఫలమైనా.. స్మృతి మంధాన పోరాటంతో భారత్ సవాల్ విసరగలిగే స్కోరు చేసింది. టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకొన్న టీమిండియా ఆరంభంలో తడబడింది. షఫాలీ (7), హేమలత (12) స్వల్ప స్కోర్లకే వెనుదిరిగారు. హర్మన్‌ప్రీత్ (10), జెమీమా (17), రిచా ఘోష్ (3) కూడా పేలవ ప్రదర్శన చేయడంతో 22 ఓవర్లలో భారత్ 99/5 స్కోరుతో ఇబ్బందుల్లో పడింది. ఈ దశలో దీప్తి శర్మ జతగా స్మృతి ఆరో వికెట్‌కు 81 రన్స్ జోడించి జట్టును ఆదుకొంది. దీప్తిని కకా అవుట్ చేసినా.. ఆ తర్వాత మంధానకు పూజ చక్కని సహకారం అందించింది. వీరిద్దరూ ఏడో వికెట్‌కు వేగంగా 58 రన్స్ జతచేశారు. సెంచరీ పూర్తి చేసుకొన్న మంధానాను మసాబటా పెవిలియన్ చేర్చినా.. పూజ జట్టు స్కోరును 260 మార్క్ దాటించింది.

**సంక్షిప్త స్కోర్లు**

**భారత్:** 50 ఓవర్లలో 265/8 (మంధాన 117, దీప్తి 37; కకా 3/47, క్లాస్ 2/51).
**సౌతాఫ్రికా:** 37.4 ఓవర్లలో 122 ఆలౌట్ (లుస్ 33, కాప్ 24; ఆశా శోభన 4/21, దీప్తి 2/10).

## సూపర్-8కు ఇంగ్లండ్




నార్త్‌సౌండ్ (ఆంటీగ్వా): డిఫెండింగ్ చాంపియన్ ఇంగ్లండ్ శనివారం నాడు పడిన టెన్షన్ అంతా..ఇంతా కాదు. బహుశా ఈసారి టీ20 వరల్డ్ కప్‌లో ఆ జట్టు ఎదుర్కొన్న ఉత్కంఠ మరే టీమ్ కూడా ఎదుర్కొని ఉండదు. కారణం..నమీబియాతో ఆ జట్టు ఆఖరి లీగ్ మ్యాచ్‌కు వరుణుడు తీవ్రంగా ఆటంకం కలిగించడమే. మ్యాచ్ రద్దయితే ఇంగ్లండ్ గ్రూపు దశ నుంచే ఇంటిముఖం పట్టాల్సి వచ్చేది. ఈ నేపథ్యంలో శనివారం అర్ధరాత్రి ఆగి ఆగి పడిన వర్షంతో మూడు గంటలపాటు బట్లర్ సేన తీవ్ర ఉద్విగ్నతకు లోనైంది. ఎట్టకేలకు 11 ఓవర్లతో ఆట మొదలుకాగా..ఇంగ్లండ్ ఇన్నింగ్స్ సందర్భంగా వరుణుడు మరోసారి పలకరించాడు. దాంతో చివరగా ఒక్కో ఇన్నింగ్స్‌ను 10 ఓవర్లకు కుదించారు. ఇంగ్లండ్ తొలుత 122/5 స్కోరు సాధించింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' హ్యారీ బ్రూక్ (47 నాటౌట్) ధనాధన్ బ్యాటింగ్ చేశాడు. అనంతరం డక్‌వర్త్ లూయిస్ నిబంధన ప్రకారం నమీబియా లక్ష్యాన్ని 10 ఓవర్లలో 126గా నిర్ధారించారు. కానీ ఆ జట్టు నిర్ణీత ఓవర్లలో 84/3 స్కోరుకే పరిమితమైంది. దాంతో 41 రన్స్‌తో నెగ్గినా ఇంగ్లండ్‌కు టెన్షన్ తప్పలేదు. ఇదే గ్రూప్ 'డి'లో ఆస్ట్రేలియా-స్కాట్లాండ్ ఆఖరి మ్యాచ్‌పై ఇంగ్లండ్ సూపర్-8 అవకాశాలు ఆధారపడి ఉండడమే అందుకు కారణం. ఆ పోరులో ఆసీస్ గెలిస్తేనే ఇంగ్లండ్ ముందంజ వేసేది. దాంతో ఆ మ్యాచ్ ఫలితం కోసం ఇంగ్లండ్ ఎదురు చూడాల్సి వచ్చింది. చివరకు ఆసీస్ నెగ్గడంతో..ఇంగ్లండ్ సూపర్-8కి క్వాలిఫై అయ్యింది.

**క్రికెట్‌కు వీజ్ గుడ్‌బై:** నమీబియా ఆల్‌రౌండర్, 39 ఏళ్ల డేవిడ్ వీజ్ అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికాడు. ఇక్కడ ఇంగ్లండ్‌తో జరిగిన మ్యాచ్ అనంతరం అతడు రిటైర్మెంట్ నిర్ణయం ప్రకటించాడు.

**సంక్షిప్త స్కోర్లు**

**ఇంగ్లండ్:** 10 ఓవర్లలో 122/5 (బ్రూక్ 47 నాటౌట్, బెయిర్‌స్టో 31, ట్రంపెల్‌మన్ 2/31).
**నమీబియా:** 10 ఓవర్లలో 84/3 (వాన్ లింగెన్ 33, వీజ్ 27).

## పాక్ గట్టెక్కింది

### ఐర్లాండ్‌పై విజయం

లాడర్‌హిల్: టీ20 వరల్డ్‌కప్‌ను పాకిస్థాన్ జట్టు విజయంతో ముగించింది. ఆదివారం ఐర్లాండ్‌తో జరిగిన తమ చివరి గ్రూప్ 'ఎ' మ్యాచ్‌లో కాస్త తడబడినా చివరకు 3 వికెట్ల తేడాతో నెగ్గి పాక్ ఊపిరిపీల్చుకుంది. కెప్టెన్ బాబర్ ఆజమ్ (32 నాటౌట్) కీలక ఇన్నింగ్స్‌తో ఆకట్టుకున్నాడు. పాక్ ఇప్పటికే సూపర్-8కు చేరకుండా గ్రూప్ దశలోనే నిష్క్రమించిన విషయం తెలిసిందే. ముందుగా ఐర్లాండ్ 20 ఓవర్లలో 9 వికెట్లకు 106 పరుగులు చేసింది. డెలానీ (31), లిటిల్ (22 నాటౌట్), అడెయిర్ (15) మాత్రమే రాణించారు. పాక్ పేసర్ల ధాటికి 32/6 స్కోరుతో కష్టాల్లో పడిన జట్టును డెలానీ ఆదుకున్నాడు. చివర్లో లిటిల్ పోరాటంతో స్కోరు వంద పరుగులు దాటింది. ఇమాద్ వసీమ్, షహీన్‌లకు మూడేసి, ఆమిర్‌కు రెండు వికెట్లు దక్కాయి. స్వల్ప ఛేదనలో పాక్ 18.5 ఓవర్లలో 7 వికెట్లకు 111 పరుగులు చేసి గెలిచింది. బాబర్ కీలక ఇన్నింగ్స్‌తో అజేయంగా నిలిచాడు. ఐర్లాండ్ బౌలర్ల పదునైన బంతులకు ఓ దశలో పాక్ 57/5 స్కోరుతో ఓటమి తప్పదా అనిపించింది. కానీ బాబర్‌కు జతగా అబ్బాస్ అఫ్రిది (17) నిలవడంతో ఏడో వికెట్‌కు 33 రన్స్ వచ్చాయి. ఇక చివరి రెండు ఓవర్లలో 12 రన్స్ అవసరమైన వేళ కాస్త ఉత్కంఠ నెలకొంది. అయితే 19వ ఓవర్‌లో రెండు సిక్సర్లతో షహీన్ (13 నాటౌట్) మ్యాచ్‌ను ముగించాడు.

**పాయింట్ల పట్టిక — గ్రూప్-ఎ**

| జట్టు | మ్యా | గె | ఓ | ఫ.తే | పా | రన్‌రేట్ |
|---|---|---|---|---|---|---|
| భారత్ | 4 | 3 | 0 | 1 | 7 | 1.137 |
| అమెరికా | 4 | 2 | 1 | 1 | 5 | 0.127 |
| పాకిస్థాన్ | 4 | 2 | 2 | 0 | 4 | 0.294 |
| కెనడా | 4 | 1 | 2 | 1 | 3 | -0.493 |
| ఐర్లాండ్ | 4 | 0 | 3 | 1 | 1 | -1.293 |

ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు

## వౌట్ లేట్ గోల్

### పోలెండ్‌పై నెదర్లాండ్స్ గెలుపు




హాంబర్గ్ (జర్మనీ): ఫార్వర్డ్ వౌట్ వెహోర్స్ట్ చివరి నిమిషంలో చేసిన గోల్‌తో యూరో చాంపియన్‌షిప్‌లో నెదర్లాండ్స్ శుభారంభం అందుకుంది. గ్రూప్ 'డి'లో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో నెదర్లాండ్స్ 2-1తో పోలెండ్‌ను ఓడించింది. సబ్‌స్టిట్యూట్‌గా వచ్చిన వౌట్ 83వ నిమిషంలో..నాథన్ అకే నుంచి అందుకున్న పాస్‌ను గోల్‌పోస్టులోకి కొట్టడంతో డచ్ అభిమానులు సంబరాల్లో మునిగారు. అంతకుముందు.. గాయంతో స్టార్ ఆటగాడు రాబర్ట్ లెవాన్‌డొస్కీ లేకుండా బరిలో దిగిన పోలెండ్ 16వ నిమిషంలో ఆడమ్ బుస్కా చేసిన గోల్‌తో ఆధిక్యం ప్రదర్శించింది. అయితే 29వ నిమిషంలో గ్యాప్కో కొట్టిన గోల్‌తో నెదర్లాండ్స్ సమం చేసింది. గ్రూప్ 'బి'లో జరిగిన మ్యాచ్‌లో ఇటలీ 2-1తో అల్బేనియాపై విజయం సాధించింది. గ్రూప్ 'సి'లో స్లోవేనియా, డెన్మార్క్ జట్ల మధ్య జరిగిన మ్యాచ్ 1-1తో డ్రాగా ముగిసింది.

---

# బిజినెస్

## అనుబంధ కంపెనీలనూ సొమ్ము చేసుకుంటాం

### ఎస్‌బీఐ చైర్మన్ దినేశ్ ఖారా

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థలైన ఎస్‌బీఐ జనరల్ ఇన్సూరెన్స్, ఎస్‌బీఐ పేమెంట్స్‌ను సమయం వచ్చినప్పుడు సొమ్ము చేసుకుంటామని మాతృసంస్థ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్‌బీఐ) ప్రకటించింది. ఆ సంస్థ చైర్మన్ దినేశ్ ఖారా ఈ విషయం చెప్పారు. ఈలోగా ఈ రెండు కంపెనీల వ్యాపారాన్ని మరింత విస్తరిస్తామన్నారు. ఈ లక్ష్య సాధన పూర్తయ్యాక క్యాపిటల్ మార్కెట్ ద్వారానే ఈ రెండు కంపెనీల ఈక్విటీలో ఎస్‌బీఐకి ఉన్న వాటాలో కొంత వాటా విక్రయించి సొమ్ము చేసుకుంటామని ఖారా చెప్పారు. అయితే ఇది ఈ ఆర్థిక సంవత్సరం మాత్రం జరగదన్నారు. కాగా ప్రస్తుతం కంపెనీల నుంచీ రుణాలకు గిరాకీ పెరుగుతోందని ఖారా తెలిపారు. వర్కింగ్ క్యాపిటల్ రుణాలతో పాటు, ఉత్పత్తి విస్తరణ కోసమూ ప్రస్తుతం కంపెనీలు రుణాల కోసం తమను సంప్రదిస్తున్నట్టు చెప్పారు. ఈ రెండు రుణాల మొత్తమే రూ.5 లక్షల కోట్ల వరకు ఉంటుందన్నారు.

## 23,200 దిగువన బేరిష్

(జూన్ 18-21 తేదీల మధ్య వారానికి)

### అనలిస్ట్ వ్యూ



డా. భువనగిరి అమర్‌నాథ్ శాస్త్రి

నిఫ్టీ గత వారం 23,491-21,277 పాయింట్ల మధ్యన కదలాడి 176 పాయింట్ల లాభంతో 23,466 వద్ద ముగిసింది. ఈ వారాంతంలో 23,200 కన్నా దిగువన ముగిస్తే స్వల్పకాలానికి బేరిష్ అవుతుంది.

20, 50, 100, 200 రోజుల చలన సగటు స్థాయిలు 23,402, 23,308, 22,950, 22,730 వద్ద ఉన్నాయి. ఇవి నిరోధ, మద్దతు స్థాయిలుగా నిలుస్తాయి. 50 డీఎంఏ 200 డీఎంఏ కన్నా పైన ఉండడం దీర్ఘకాలిక బుల్లిష్ ట్రెండ్ సంకేతం.

బ్రేకౌట్ స్థాయి :23,700 బ్రేక్‌డౌన్ స్థాయి: 23,200
నిరోధ స్థాయిలు : 23,665, 23,765, 23,865 (23,565 పైన బుల్లిష్)
మద్దతు స్థాయిలు : 23,265, 23,165, 23,065 (23,365 దిగువన బేరిష్)

## నేడు మార్కెట్లకు సెలవు

బక్రీద్ సందర్భంగా సోమవారం స్టాక్ ఎక్ఛేంజీలు బీఎస్ఈ, ఎన్ఎస్ఈలకు సెలవు ప్రకటించారు. కమోడిటీ, ఫారెక్స్ మార్కెట్లు కూడా పనిచేయవు. మంగళవారం మార్కెట్లు యథావిధిగా పనిచేస్తాయి.



## 'స్టార్టప్స్'లోనూ కొలువుల కోతలు



### ఇప్పటి వరకు 10,000 మంది ఔట్.. గుట్టుచప్పుడు కాకుండా వేటు

న్యూఢిల్లీ: స్టార్టప్ కంపెనీల్లోనూ కొలువుల కోత కొనసాగుతోంది. ఈ ఏడాది జనవరి నుంచి ఇప్పటి వరకు వివిధ స్టార్టప్ కంపెనీలు 10,000 మందిని ఇంటికి పంపించాయి. ఇందులో దాదాపు సగం ఉద్యోగాల కోతలు గుట్టుచప్పుడు కాకుండా చేశాయి. దీంతో మంచి జీతాల ఆశతో ఈ కంపెనీల్లో చేరిన ఉద్యోగులు లబోదిబోమంటున్నారు. ఉన్న ఉద్యోగులు కూడా ఎప్పుడు ఏ దుర్వార్త వినాల్సి వస్తుందో? అని బిక్కుబిక్కుమంటున్నారు. పరిస్థితులు మెరుగుపడకపోతే డిసెంబరు నాటికి స్టార్టప్ కంపెనీలు మరో ఐదారు వేల మందిని ఇంటికి పంపించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

#### ఖర్చులు తగ్గించుకునేందుకే

గత ఏడాది కాలంగా స్టార్టప్ కంపెనీలు నిధుల కొరత ఎదుర్కొంటున్నాయి. గతంలోలా వెంచర్ క్యాపిటల్ (వీసీ) కంపెనీలు, ప్రైవేటు ఈక్విటీ (పీఈ) సంస్థలు స్టార్టప్స్‌లో ఎడాపెడా పెట్టుబడులు పెట్టడం లేదు. మంచి వ్యాపార ఐడియాతో క్లిక్ అవుతుందనే నమ్మకం ఉన్న స్టార్టప్స్‌కు మాత్రమే వీసీలు, పీఈ సంస్థలు నిధులు సమకూరుస్తున్నాయి. ఇప్పటికే నిధులు సమకూర్చిన స్టార్టప్స్ నుంచి ఎంతో కొంత లాభం ఆశిస్తున్నాయి. లాభాలు లేకపోతే ఖర్చులు తగ్గించుకోమని ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో స్టార్టప్ కంపెనీలు మంచి మంచి జీతాలు ఉన్న ఉద్యోగులను తొలగించి, వారికంటే 15-20 శాతం తక్కువ జీతాలకు కొత్తవారిని నియమించేందుకు మొగ్గు చూపుతున్నాయి.

#### గత ఏడాదితో పోలిస్తే తక్కువే

గత ఏడాదితో పోలిస్తే స్టార్టప్ కంపెనీల్లో ఉద్యోగుల తీసివేతలు ఈ సంవత్సరం కొద్దిగా తగ్గాయి. గత ఏడాది ప్రథమార్థంలో 21,000 మందిని, రెండో అర్థభాగంలో 15,000 మందిని స్టార్టప్ కంపెనీలు ఇంటికి పంపించాయి. దీంతో పోలిస్తే ఈ ఏడాది ప్రథమార్థంలో స్టార్టప్ కంపెనీలు 10,000 మందిని మాత్రమే ఇంటికి పంపించాయి. నిధుల లభ్యత పెరుగుతున్నందున ఈ ఏడాది రెండో అర్థభాగంలో తీసివేతలు పెద్దగా ఉండకపోవచ్చని భావిస్తున్నారు. ఉద్యోగులను తీసివేస్తున్న స్టార్టప్స్‌లో ఓలా ఎలక్ట్రిక్, ఫ్లిప్‌కార్ట్ వంటి స్టార్టప్స్ కూడా ఉండడం విశేషం.

## కొత్తగా 81 లక్షల ఎంఎఫ్ ఖాతాలు

న్యూఢిల్లీ: మ్యూచువల్ ఫండ్స్ (ఎంఎఫ్) పథకాలపై మదుపరుల అవగాహన పెరుగుతోంది. దీంతో ఈ ఆర్థిక సంవత్సరం తొలి రెండు నెలల్లో 81 లక్షల మంది మదుపరులు కొత్తగా ఎంఎఫ్ ఖాతాలు ప్రారంభించారు. బ్యాంక్ ఫిక్స్‌డ్ డిపాజిట్ల కంటే ఎంఎఫ్ రుణ పథకాలపై అధిక రాబడులు లభించడం, ఎంఎఫ్‌ల మార్కెటింగ్, సెలబ్రిటీలతో ప్రచారం, విస్తృత డిస్ట్రిబ్యూషన్ నెట్‌వర్క్ ఇందుకు ప్రధాన కారణమని స్టాక్ ట్రేడింగ్ ప్లాట్‌ఫామ్ సీఓఓ డీ త్రివేష్ చెప్పారు. ప్రస్తుత బుల్‌రన్‌తో ముందు ముందూ ఎంఎఫ్ పథకాల్లో మదుపరుల పెట్టుబడులు కొనసాగుతాయని మార్కెట్ వర్గాల అంచనా.

## టెక్ న్యూస్

ఫైనాన్షియల్ టెక్నాలజీ సంస్థ పేటీఎంకు చెందిన మూవీస్, ఈవెంట్స్ వ్యాపారాన్ని చేజిక్కించుకునేందుకు ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ ప్లాట్‌ఫామ్ జొమాటో సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు పేటీఎంతో చర్చలు జరుపుతున్నట్టు స్టాక్ మార్కెట్లకు పంపిన ఒక ప్రకటనలో వెల్లడించింది. అయితే ప్రస్తుతానికి చర్చలు మాత్రమే సాగిస్తున్నామని, బోర్డు దృష్టికి ఇంకా ఈ అంశాన్ని తీసుకువెళ్లాల్సి ఉందని పేర్కొంది.

**ఫారం గేటు అమ్మకం ధరలు** (నెక్ 100 గుడ్లు)

| 17వ తేదీ | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 490 | విజయవాడ | 480 |
| వరంగల్ | 492 | గోదావరి | 475 |
| చిత్తూరు | 573 | విశాఖపట్నం | 500 |
| | | డజను గుడ్లు రూ. 72 | |

**ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 139 | విజయవాడ | 145 |
| వరంగల్ | 139 | గుంటూరు | 145 |
| కరీంనగర్ | 139 | ఒంగోలు | 145 |
| మహబూబ్‌నగర్ | 139 | చిత్తూరు | 152 |
| కర్నూలు | 139 | నెల్లూరు | 152 |
| విశాఖపట్నం | 136 | అనంతపురం | 145 |
| గోదావరి | 145 | | |

## ఆర్థిక సంస్కరణలు కొనసాగాల్సిందే

### అట్టడుగు శ్లాబు వారిని కరుణించాలి: సీఐఐ




న్యూఢిల్లీ: ధరల పోటు నేపథ్యంలో వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ఆదాయ పన్ను (ఐటీ) చెల్లింపు పరిధిలోని అట్టడుగు శ్లాబులో ఉన్న వారిని ఆదుకోవాలని భారత పరిశ్రమల సమాఖ్య (సీఐఐ) ప్రభుత్వాన్ని కోరింది. ఇందుకోసం వారి కోసం ప్రత్యేక పన్ను రాయితీలు ప్రకటించాలని కొత్తగా సీఐఐ జాతీయ అధ్యక్ష బాధ్యతలు స్వీకరించిన ఐటీసీ చైర్మన్ సంజీవ్ పురి కోరారు. భూ సంస్కరణలు, కార్మిక సంస్కరణలు, విద్యుత్, వ్యవసాయ సంస్కరణలపై ఏకాభిప్రాయ సాధన కోసం కేంద్ర-రాష్ట్రాల మధ్య ఒక ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేయాలని ఆయన సూచించారు. సంకీర్ణ ప్రభుత్వం సంస్కరణల కొనసాగింపునకు అడ్డంకి అవుతుందని తాము భావించడం లేదని పురి స్పష్టం చేశారు. ప్రభుత్వ పెట్టుబడులు, ద్రవ్య లోటు కట్టడి, సామాజిక మౌలిక సదుపాయాలపై పెట్టుబడులకు సంబంధించిన రోడ్ మ్యాప్, హరిత పరిశ్రమల ప్రోత్సాహం కోసం ప్రత్యేక నిధి ఏర్పాటు, గ్రామీణ అభివృద్ధికి మరిన్ని పెట్టుబడులకు వచ్చే కేంద్ర బడ్జెట్‌లో ప్రాధాన్యత ఇవ్వాలని సీఐఐ కోరింది. వరుణుడు కరుణిస్తే ఈ ఆర్థిక సంవత్సరం చివరికి రిటైల్ ద్రవ్యోల్బణం 4.5 శాతం వద్ద స్థిరపడే అవకాశం ఉందని అంచనా వేసింది. ఆదాయ పన్ను చట్టాన్ని ముఖ్యంగా టీడీఎస్ వసూలు విధానాన్ని మరింత సంస్కరించాల్సిన అవసరం ఉందని పురి స్పష్టం చేశారు.

### 20న పారిశ్రామిక సంఘాలతో నిర్మల భేటీ!

వచ్చే కేంద్ర బడ్జెట్ రూపకల్పన ఊపందుకుంది. ఇందుకోసం కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ నెల 20న పారిశ్రామిక, వాణిజ్య సంఘాలతో సమావేశమవుతారని సమాచారం. అంతకు ముందే రెవెన్యూ కార్యదర్శి సంజయ్ మల్హోత్రా పారిశ్రామిక, వాణిజ్య మండళ్ల ఉన్నతాధికారులతో సమావేశమవుతారు. నిర్మలా సీతారామన్ కేంద్ర బడ్జెట్‌ను వచ్చే నెల రెండో అర్థభాగంలో పార్లమెంట్‌కు సమర్పించే అవకాశం ఉందని భావిస్తున్నారు.

## అందుబాటు ధరల ఇళ్లకు తగ్గిన గిరాకీ

### ప్రాప్‌ఈక్విటీ

న్యూఢిల్లీ: దేశంలో రూ.60 లక్షల వరకు ధర ఉండే అందుబాటు ధరల ఇళ్లకు గిరాకీ తగ్గుతోంది. ఈ ఏడాది జనవరి-మార్చిలో హైదరాబాద్‌తో సహా దేశంలోని ఎనిమిది ప్రధాన నగరాల్లో ఈ కేటగిరిలోకి వచ్చే ఇళ్ల అమ్మకాలు 61,121 యూనిట్లు మించలేదు. గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే ఇది నాలుగు శాతం తక్కువని రియల్ ఎస్టేట్ కన్సల్టెన్సీ సంస్థ ప్రాప్‌టైగర్ తెలిపింది. లగ్జరీ అపార్ట్‌మెంట్లకు గిరాకీ పెరగడం, అందుబాటు ధరల గృహాల సరఫరా మందగించడం ఇందుకు ప్రధాన కారణం. ప్రస్తుతం బిల్డర్లు ఎక్కువగా అధిక లాభాలు ఉండే లగ్జరీ అపార్ట్‌మెంట్ల నిర్మాణంపైనే ఆసక్తి చూపిస్తున్నారు. దీంతో గత ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో హైదరాబాద్‌లో 3,674 అందుబాటు ధరల గృహాలు అమ్ముడుపోగా ఈ ఏడాది జనవరి-మార్చి త్రైమాసికంలో 3,360 గృహాలు మాత్రమే అమ్ముడుపోయాయని ప్రాప్‌టైగర్ తెలిపింది.

## తదుపరి నిరోధం 23,600

### టెక్ వ్యూ



వి. సుందర్ రాజా

నిఫ్టీ గత వారం 23,300 వద్ద అప్రమత్త మైనర్ అప్‌ట్రెండ్‌లో ప్రారంభమయింది. తదుపరి సెషన్లలో గరిష్ఠ స్థాయిల్లో అమ్మకాల ఒత్తిడి, ఇంట్రాడే కరెక్షన్లు ఎదుర్కొంటూనే వారాంతానికి 175 పాయింట్ల లాభంతో జీవితకాల గరిష్ఠ స్థాయిలో, మానసిక అవధి 23,500 సమీపంలో నిలకడగా ముగిసింది. జూన్ 4వ తేదీన ఏర్పడిన మహాపతనం అనంతరం గత రెండు వారాల కాలంలో నిఫ్టీ కనిష్ఠ స్థాయిల నుంచి 2,000 పాయింట్ల వరకు లాభపడింది. ఇక మిడ్‌క్యాప్-100 సూచీ 2,000 పాయింట్లు, స్మాల్ క్యాప్‌సూచీ 830 పాయింట్ల మేరకు లాభపడ్డాయి.

జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో నిలిచి ఉన్న మార్కెట్ గత వారం నిలకడ ధోరణిని బట్టి పాజిటివ్ ధోరణిలోనే ప్రారంభం కావచ్చు. ఇప్పుడు జీవితకాల గరిష్ఠ స్థాయిల్లో నిలదొక్కుకుంటుందో, లేదో వేచి చూడాలి.

**బుల్లిష్ స్థాయిలు:** నిఫ్టీకి తదుపరి మానసిక అవధి 23,600. కొత్త శిఖరాలకు ప్రయాణించాలంటే ఈ స్థాయి కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆపైన మానసిక అవధులు 23,800, 24,000.

**బేరిష్ స్థాయిలు:** కరెక్షన్‌లో పడినట్టయితే దిగువన మద్దతు స్థాయి 23,400. ఇక్కడ విఫలమైతే మైనర్ బలహీనతకు ఆస్కారం ఉంది. ప్రధాన మద్దతు స్థాయిలు 23,200, 23,000. కాని సాధారణ పరిస్థితుల్లో తక్షణ ముప్పు ఏమీ లేదు.

**బ్యాంక్ నిఫ్టీ:** ఈ సూచీ గత వారం పరిమిత పరిధిలోనే కదలాడి 200 పాయింట్ల లాభంతో ముగిసింది. రెండు వారాల పాటు మానసిక అవధి 50,000 వద్ద పరీక్ష ఎదుర్కొన్న అనంతరం నిలకడగా క్లోజైంది. మరింత అప్‌ట్రెండ్ కోసం ప్రధాన నిరోధం 50,700 కన్నా పైన నిలదొక్కుకోవాలి. ఆ పైన మరో నిరోధం 51,200. బలహీనత ప్రదర్శించి 50,000 వద్ద నిలదొక్కుకోలేకపోతే అప్రమత్తతను సూచిస్తుంది.

**పాటర్న్:** మార్కెట్ గత వారం కన్సాలిడేషన్ అనంతరం గతంలో ఏర్పడిన గరిష్ఠ స్థాయి, టాప్ 23,350 వద్ద బ్రేకౌట్ సాధించింది. ఇది పాజిటివ్ ట్రెండ్ సంకేతం. రియాక్షన్‌లో పడితే భద్రత కోసం 23,400 వద్ద "అడ్డంగా ఏర్పడిన సపోర్ట్ ట్రెండ్‌లైన్" వద్ద నిలదొక్కుకోవాలి.

**టైమ్:** ఈ సూచీ ప్రకారం గురువారం తదుపరి మైనర్ రివర్సల్ ఉంది.

**మంగళవారం స్థాయిలు**
నిరోధం : 23,600, 23,655
మద్దతు : 23,470, 23,400
www.sundartrends.in

## బ్యాటరీల ఉత్పత్తిలోకి మహీంద్రా

### 2030 నాటికి విద్యుత్ కార్ల విభాగం లిస్టింగ్

న్యూఢిల్లీ: భవిష్యత్తులో విద్యుత్ వాహనాలకు ఏర్పడనున్న డిమాండ్‌ను తట్టుకునేందుకు దేశీయంగా బ్యాటరీ సెల్ ఉత్పత్తిలో ప్రపంచ భాగస్వామ్యాల కోసం మహీంద్రా గ్రూప్ అన్వేషిస్తోంది. మహీంద్రా ఎలక్ట్రిక్ ఆటోమొబైల్ లిమిటెడ్‌ను (మియల్) 2030 నాటికి లిస్టింగ్ చేసే అవకాశం ఉన్నదని మహీంద్రా గ్రూప్ ఎండీ, సీఈఓ అనీష్ షా చెప్పారు. విద్యుత్ వాహనాల విభాగం ఇంకా జోరందుకోవాల్సిన అవసరం ఉన్నదని, అందుకే తాము అంత వ్యవధి పెట్టుకున్నామని ఆయన తెలిపారు. దేశంలో సెల్ తయారీ తీరుతెన్నులను నిశితంగా పరిశీలిస్తున్నామని, ఆ విభాగంలోకి తాము ప్రవేశించినట్టయితే ప్రపంచ టెక్నాలజీ భాగస్వాములు, పీఈ భాగస్వాముల కోసం అన్వేషిస్తామని ఆయన అన్నారు. విద్యుత్ కార్ల ధరలు అధికంగా ఉండడమే ఆ విభాగం మందకొడిగా సాగడానికి కారణమని ఆయన చెప్పారు. వచ్చే మూడేళ్ల కాలానికి మహీంద్రా గ్రూప్ వివిధ విభాగాల్లో రూ.37 వేల కోట్ల పెట్టుబడి ప్రణాళిక ప్రకటించగా అందులో అధిక భాగం ఆటో విభాగానికే కేటాయించింది.

www.andhrajyothy.com

# ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHI

సోమవారం | 17-6-2024

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru | విజయవాడ సిటీ**

## నీట్‌లో రెండుచోట్ల అవకతవకలు



మొదటిసారి ఒప్పుకొన్న కేంద్ర మంత్రి ప్రధాన్

ప్రభుత్వం తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టీకరణ


ఎన్‌టీఏ అధికారుల తప్పున్నట్టు తేలితే కఠిన శిక్ష తప్పదని హెచ్చరిక

ఎన్‌టీఏ చాలా మెరుగుపడాల్సి ఉందని అభిప్రాయం.. 'నీట్'పై మోదీ మౌనం మంచిది కాదు 8


'సుప్రీం' కమిటీతో దర్యాప్తు జరిపించాలి.. ప్రవేశాలపై రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి: సిబల్



1



2



3

## గుట్టువీడిన..

1) రుషికొండలో జనం సొమ్ముతో జగన్ కట్టిన ప్యాలెస్

2) ప్యాలెస్‌లో ఏర్పాటు చేసుకున్న మసాజ్ టేబుల్, పక్కనే బాత్‌రూమ్స్

3) లంకంత బాత్‌రూమ్, విలాసవంతమైన బాత్ టబ్.. గోల్డ్ కలర్ ట్యాప్

# రాజకోట రహస్యం!

చేయి వేస్తే మాసిపోయేంత వర్ణఛాయలో ఇటాలియన్ మార్బుల్ గోడలు.. ఇంటర్నేషనల్ బ్రాండ్స్‌తో బాత్రూమ్ ఫిటింగ్స్.. ఒళ్లు పట్టించుకోవడానికి మసాజ్ (స్పా) రూమ్.. సమావేశ మందిరం సైజులో పడక గదులు.. 300 మంది గుంపుగా వచ్చినా ఒకరికి ఒకరు తగలకుండా ఉండేంత విశాలమైన కారిడార్లు.. 200 మందితో సమావేశం నిర్వహించడానికి అవసరమైన గదులు.. ముఖ్యమైన ఫైళ్లు భద్రపరచడానికి లాకర్లు..

ప్రభుత్వ నిధులతో వ్యక్తిగత వినియోగానికి ఘనుడు జగన్ కట్టుకున్న విలాసవంతమైన భవనంలో ఆదివారం కనిపించిన దృశ్యాలివి. నిర్మించిన ఏడు బ్లాకుల్లో మూడు జగన్ వ్యక్తిగత వినియోగం కోసం కట్టుకున్నారు. అందులో ఒకటి జగన్ దంపతులకు.. దాని పేరు ప్రెసిడెన్షియల్ సూట్. ఇంకో రెండు.. విల్లా సూట్స్. ఆ రెండూ కుమార్తెల కోసం చెరొకటి నిర్మించారు. మిగిలిన నాలుగింటికి కాసింత దూరంగా, ప్రత్యేకంగా సముద్రానికి అభిముఖంగా వీటిని నిర్మించారు. ప్రత్యేకంగా గేట్లు ఏర్పాటు చేశారు!

9

### రుషికొండపై రూ.500 కోట్లతో జగన్ జల్సా మహల్

### మూడేళ్ల తర్వాత వెలుగులోకి ప్యాలెస్ చిత్రాలు

మీడియాతో కలిసి ప్యాలెస్‌లోకి టీడీపీ నేత గంటా

పర్యాటకుల పేరిట రాజభవనమే కట్టేశారని ధ్వజం

మార్బుల్, ఇంటీరియర్‌కే రూ.కోట్లలో వ్యయం

సద్దాం, గాలి భవనాలను తలదన్నేలా నిర్మాణాలు


నాడు ప్రజా వేదిక చట్ట విరుద్ధమని కూల్చిన జగన్

తన కోసం ఈ భవనాన్ని ఎలా నిర్మించుకున్నారు?

నిర్మాణంపై త్వరలో చంద్రబాబు నిర్ణయం: గంటా

**ప్యాలెస్‌లో 3 బ్లాకులు జగన్ ఫ్యామిలీకే**

భార్యాభర్తలకు ప్రెసిడెన్షియల్ సూట్.. కుమార్తెలకు చెరోటి





ప్యాలెస్‌లోని అత్యంత ఖరీదైన షాండ్లియర్, ఫ్యాను.. కమోడ్ చెంత గోల్డ్ కలర్ ఫాసెట్

**ఔను అది జల్సా ప్యాలెస్సే..**

ఆనాడే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'




13-10-2023న 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం



ధగధగలాడుతున్న ఓ కారిడార్

# మళ్లీ పోలవరం

## 'జీవనాడి'కి జవసత్వాలు.. నేడే సీఎం ప్రాజెక్టు సందర్శన

**పోలవరం విధ్వంసంపై సమీక్ష**

### ఐదేళ్లు జగన్ రివర్స్ బాట

కేంద్రం వద్దన్నా ప్రాజెక్టు కాంట్రాక్టు సంస్థ తొలగింపు

అప్పటికి మిగిలిన పనుల అంచనా 1,771 కోట్లు.. రివర్స్ టెండరింగ్‌లో 1,548 కోట్లకు దక్కించుకున్న 'మేఘా'

ఆ తర్వాత అంచనా వ్యయం పైపైకి


ఈలోపు వరదలకు దెబ్బతిన్న నిర్మాణాలు

డయాఫ్రం వాల్‌కు తీవ్ర నష్టం

కాఫర్ డ్యాంలలో సీపేజీ.. కుంగిన గైడ్‌బండ్

ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని దుస్థితిలో ప్రాజెక్టు.. నేడు బాబు సమీక్ష

రోజంతా ప్రాజెక్టు వద్దే



గత ఐదేళ్లలో ధ్వంసమైన పోలవరం ప్రాజెక్టు తిరిగి గాడిన పడుతుందన్న ఆశలు చిగురిస్తున్నాయి. గతంలో సీఎంగా ఉండగా ప్రతి సోమవారాన్ని పోలవారంగా మార్చి.. పనులను పరుగులు పెట్టించిన చంద్రబాబు.. ఇప్పుడు మళ్లీ బాధ్యతలు చేపట్టి.. రంగంలోకి దిగుతున్నారు. క్షేత్ర స్థాయిలో పర్యటించి విధ్వంసం ఏ మేరకు జరిగిందో.. ఏం చేస్తే త్వరగా పూర్తిచేసి సాగు, తాగునీరు అందించగలమో ప్రాజెక్టు ఇంజనీరింగ్ అధికారులతో చర్చించి ఓ అంచనాకు రానున్నారు.

(అమరావతి/ఏలూరు/ రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర జీవనాడి పోలవరం ప్రాజెక్టు వాస్తవ స్థితిగతులను స్వయంగా అంచనా వేయడానికి.. ఐదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం క్షేత్ర స్థాయిలో పర్యటించనున్నారు. 2019లో ఆయన దిగిపోయేనాటికి హెడ్‌వర్క్స్ పనులు 72 శాతం పూర్తయ్యాయి. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్ (ఈసీఆర్‌ఎఫ్) డ్యాం పూర్తిచేసి.. 48 గేట్లు అమర్చి, స్పిల్‌వే ద్వారా జలాలను బయటకు పంపితే సరిపోతుందనే స్థాయిలో ఉన్న ప్రాజెక్టు.. ఐదేళ్ల తర్వాత తిరిగి చూసుకుంటే ఎప్పటికి పూర్తవుతుందో తెలియని దుస్థితిలో పడిపోయింది. కేవలం రూ.1,548.13 కోట్లతో

మిగతా 7వ పేజీలో...





పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే

## అమరావతి

15 రోజుల్లో అధ్యయనం చేసి కాలపరిమితి నిర్దేశం

తొలి దశలో 48 వేల కోట్ల ఖర్చు.. 3 విడతల్లో కలిపి లక్ష కోట్ల వ్యయం.. రైతులకు కచ్చితంగా న్యాయం చేస్తాం

మంత్రి నారాయణ స్పష్టీకరణ.. బాధ్యతల స్వీకారం

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాజధాని అమరావతి నిర్మాణ పనులను త్వరలోనే చేపడతామని పురపాలక, పట్టణాభివృద్ధిశాఖ మంత్రి పొంగూరు నారాయణ అన్నారు. పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే రాజధాని నిర్మాణం చేస్తామని స్పష్టం చేశారు. మరో 15 రోజుల్లో అధ్యయనం చేసి ఏయే పనులు

మిగతా 7వ పేజీలో...

## అమరావతిపైనే ఆశలు

నాలుగేళ్ల కార్యాచరణతో ముందుకు 7

న్యాయ సమస్యలు రాకుండా చర్యలు

భూములిచ్చిన రైతులకు అప్పుడే భరోసా

ప్రభుత్వానికి అందిన మేధావుల సలహాలు

## స్పీకర్‌గా అయ్యన్న



టీడీపీ సీనియర్ ఎమ్మెల్యేను ఖరారు చేసిన బాబు

**డిప్యూటీ స్పీకర్‌గా జనసేన ఎమ్మెల్యే**

రేసులో పంతం నానాజీ.. లోకం మాధవి

**చీఫ్ విప్‌గా ధూళిపాళ్ల నరేంద్ర!** 7

## టీడీపీ సారథిగా పల్లా

రాష్ట్ర అధ్యక్షుడిగా శ్రీనివాసరావు.. చంద్రబాబు ప్రకటన 7

## పిన్నెల్లి సోదరులపై రౌడీషీట్



వైసీపీ మాజీ ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డిపై 14 కేసులు

సోదరుడు వెంకట్రామిరెడ్డిపై 9 కేసులు నమోదు

ఇద్దరిపైనా హత్యాయత్నం కేసులు: డీఎస్పీ 7

## జగన్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోండి



క్యాంపు ఆఫీసు ముసుగులో ప్రజాధనం దోపిడీ 10

ప్రభుత్వానికి రూ.కోట్ల సామగ్రి అప్పగించకుండా ఇంట్లో అక్రమంగా వాడుకుంటున్నారు

గుంటూరులో బ్రాహ్మణ వేదిక నేత ఫిర్యాదు

మాజీ స్పీకర్ కోడెలపై నిందలు వేశారు

ఇప్పుడు జగన్‌కు నిబంధనలు పట్టవా?

మంత్రులు అనగాని, సంధ్యారాణి ఫైర్

**ఖరీదెంతో చెబితే వైసీపీవారు చెల్లిస్తారట!**

## సత్యనారాయణ ఎస్కేప్



గప్‌చుప్‌గా మళ్లీ మాతృశాఖ రైల్వేస్‌కు

జగన్ హయాంలో ఆర్థిక శాఖలో విధులు

అన్ని అవకతవకల్లోనూ భాగస్వామి 10

జగన్ అస్మదీయులకే బిల్లుల చెల్లింపు

అడ్డగోలు అప్పుల ఆలోచనలూ ఆయనవే

ఆస్తులు, సచివాలయం తాకట్టు వెనుక హస్తం

## కరికాల వలవన్ రాజీనామా 10

రిటైర్మెంట్ తర్వాత సర్వీస్‌లో ఉన్నవారందరి రాజీనామాకు జీఏడీ ఆదేశం

పేషీలో శ్రీలక్ష్మి హల్‌చల్.. ఫైల్‌తో మంత్రి వద్దకు.. సంతకానికి నారాయణ నో 7



నటాలీడౌ

## 52 ఏళ్ల మహిళ.. 12 రోజుల్లో వెయ్యి కి.మీ. పరుగు

8 థాయ్, మలేషియా మీదుగా సింగపూర్‌కు

అల్ట్రామారథాన్ రన్నర్ నటాలీడౌ ఘనత ఇదీ

**భారత్-లంక మధ్య వారధి!**

సాధ్యాసాధ్యాల అధ్యయనం తుది దశకు

శ్రీలంక అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె వెల్లడి

ఈ వారంలో ఆ దేశానికి వెళ్లనున్న జైశంకర్?

8

### ట్రాన్స్‌జెండర్లకు 1% రిజర్వేషన్లు ఇవ్వండి

బెంగాల్ సర్కారుకు కలకత్తా హైకోర్టు ఆదేశం



చెరువులా మారిన విజయవాడ బందరు రోడ్డు

## బెజవాడలో భారీ వాన

గంటపాటు దంచికొట్టిన వర్షం.. నగరం అతలాకుతలం 4


నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు.. చెరువుల్లా మారిన రహదారులు

# వివిధ

**సాహిత్య వేదిక**

బొమ్మలు: అక్బర్

## నీటి కాంతి



1

అంతా సీతాకోక చిలుకలకు దారం వేలాడిందని అనుకున్నవేళ నా సంభాషణ వాటితోనే మొదలైంది. ఎండాకాలపు రాత్రి సమయంలో కోట్లాది నక్షత్రాల వెలుగులో అనేక తూటాలు నిశ్శబ్దంగా లేత శరీరాలను తాకి వుంటాయి. పాలిండ్లను గాయం చేసి వుంటాయి. అందరూ సంఖ్యను లెక్కిస్తున్నారు. నేను గత, వర్తమాన, భవిష్యత్తును అంచనా వేస్తున్నాను. నా లెక్క దారానికి వేలాడే సీతాకోక చిలుకలు కోసం. మరణ సంఖ్యలు వరి విత్తనాలు మాత్రమే.

2

మరణం ఎవరిదైనా కన్నీళ్ళు సహజం. ఇది ఆనంద విషాదాల కావ్య రచన కాదు. అనేక సీతాకోక చిలుకల యుద్ధారావం. కన్నీటి ప్రవాహం మీదుగా సముద్రం, నది, వెన్నెల, ఆయుధం నడిచి వస్తాయి. మరణం సహజం. మెదడులో సవ్వడి చేసే ప్రవాహగానం శాశ్వతం. ఎక్కడో తెగిన మంచు బిందువు చివర రాలిన అశ్రుకణం. దశాబ్దాల క్రితం బుగ్గలపై జారిన చారికను ముద్దాడుతావా. కత్తితో మరింత గాయం చేయగలవా. మృత్యువు తర్వాత మిగిలిన నిశ్శబ్దాన్ని రాజ్యం సెలబ్రేట్ చేసుకుంటుంది.

3

ఎగురుతూ వెళుతున్న సీతాకోక చిలుక తల్లి ఒడిలో పాలు తాపాన్ని పొందుతున్న పసిపాప దగ్గర ఆగింది. మౌన తంత్రుల చివరాఖరి ఆకుపై వాలింది. ఆ పసిపాప కనులను, ఆకలి పొట్టచేసే శబ్దం చివరాఖరి దృశ్యమని సీతాకోక చిలుకకు తెలియదు. తూటా శబ్దానికి చివరి ఆకు నేలపై రాలింది. పసిపాప, ఆకు పచ్చని చెట్టు, సీతాకోక చిలుక నిర్జీవ దేహాలు. మరో విధ్వంస గేయానికి రాజ్య గ్యారంటీ.

4

అరణ్య రుతువులో మట్టి నుండి బయట పడిన అస్థిపంజరాలు. అడవిని పోలిన ఆదివాసీ. అతని పాదాల కింద దాగిన రజనులో ప్రపంచపు వెలుగు వుంది.
యుద్ధ రచన అర్థమయిందా?

5

ఈ నడక అనేక మృత్యు నీడల పురాస్మృతి. తెల్లవారు జామున వినబడుతున్న విప్లవగీతం. దేహం కోట్లాది రంధ్రాలమయమైనా గొంతు నుండి పావురం కదిలి మృతదేహాలపై వాలింది. అరణ్యం, మైదానం కలిసే చోట చెల్లా చెదురయిన మనుషులు కనబడతారు. ఎర్రటికాంతి పుంజం నిండా దాహం తీరిన మనుషులు. రక్తగానం ఆగి చల్లటి నీటికాంతి శరీరాన్ని తాకుతుంది. దేశం నాలుగు పుంజీల కుబేరుల జన్మస్థలం మాత్రమేనా? కోట్లాది జీవరాశుల నీడ కదా.

6

ఇంతకీ దారాన్ని కంఠంపై దాచుకున్న సీతాకోక చిలుక అమరత్వం. తనది మాత్రమేనా! ఈ దేశానిది కదా.

(కాంకేర్ అమరవీరుల సంస్మరణలో)

**అరసవిల్లి కృష్ణ**
92472 53884

# విభజన గాయంతో గుల్జార్ అక్షరాలాపన

మార్గరెట్ బూర్కీ వైట్ దేశ విభజన వేళ తీసిన ఫొటోలు ఆ విషాదాన్ని మన కళ్లకు కడతాయి. చెట్టుకొమ్మకు పట్టిన వరస తేనెపట్టుల్లా రైలు బోగీలకు వేలాడుతూ కనిపించే మనుషులు, కావళ్లలో వృద్ధులూ పిల్లల బరువునీ, ముఖంలో శ్రమనీ మోసుకువచ్చేవారు. ఆ ఫొటోలన్నీ టైమ్ మేగజైన్ కోసం మార్గరెట్ ఆనాడు తీశారు. గుల్జార్ అక్షరాలు ఆనాటి దుఃఖంతో ప్రతిధ్వనిస్తూ ఉంటాయి. "1947లో దేశ విభజనను సమీపంగా చూసిన వాణ్ని. అది నన్నెంతో గాయపరిచింది. బాధపెట్టింది. ఆ బాధను, భయాన్ని నాలోనించి తొలగించుకోవడం కోసం ఆ నేపథ్యంతో కథలు రాశాను" అని చెప్పుకున్నారు గుల్జార్. దేశ విభజన రక్తపాత దృశ్యాలూ, కన్నీటి ప్రయాణాలూ, వెండితెర గీతాల జలపాతాల సమ్మేళనమే గుల్జార్ (అసలు పేరు సంపూరణ్ సింగ్ కాల్రా).

విభజన విషాదం, చరిత్ర పంజాబీలదో, బెంగాలీలదో అనుకోవడం వల్ల సానుభూతినీ, సంఘీభావాన్నీ ప్రకటించే బాధ్యతను మిగిలిన దేశం విస్మరించింది. వందేమాతరం ఉద్యమాన్నీ, నినాదాన్నీ మిగిలిన భారతావని సొంతం చేసుకున్నట్టు విభజన విషాదపు లోతులను స్వీకరించలేదు. ఒక గొప్ప సాహిత్య ధోరణితోనే దేశం ఆ అనుభవాలను పలకరించగలిగింది. అదే దేశ విభజన నాటి సాహిత్యం. అమృతా ప్రీతమ్, కుష్వంత్ సింగ్, సాదత్ హసన్ మంటో, భీష్మ సహానీ వంటి వారెందరో నాటి గాథలను అక్షరీకరించారు. గుల్జార్ వారిలో ఒకరే అయినా, ఆయన వ్యక్తీకరణ వేరు.

భారత్-పాకిస్తాన్ విభజన కేవల భౌగోళిక విభజన కాదు. ఒక నాగరికత నిలువుకోత. 'రావి నదికి ఆవల' ('రావి పార్') కథలో గుల్జార్ ఇదే చెప్పారు. దర్శన్‌సింగ్, అతడి భార్య శాహిని, వారి నవజాత కవలల కథ ఇది. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిందని తెలుసు కానీ, అది వీరి లాయల్‌పూర్‌కు ఎప్పుడు వస్తుందో తెలియదంటారు రచయిత. దర్శన్‌సింగ్ తండ్రి చనిపోయాడు. గ్రామంలో మత కల్లోలాలు పెచ్చరిల్లడంతోనే హిందువులు, సిక్కులు అంతా గురుద్వారాలో తలదాచుకున్నారు. అక్కడే శాహిని కవలలకు జన్మనిచ్చింది. అందులో ఒక బిడ్డ బలహీనంగా ఉంది. బతికే ఆశ కనిపించదు కూడా. ఇంటిని వీడిన దర్శన్ అంతవరకు తనకు ధైర్యం చెప్పిన పెదనాన్న కూడా ఓ రాత్రి 'గొడ్డలి మీద పడి' చనిపోవడంతో, అసలు పాక్ భూభాగాన్నే విడిచిపోవాలని నిశ్చయించుకున్నాడు. తల్లి రాలేనని చెప్పేసింది. 'కాందిశీకుల కోసం ప్రత్యేక రైలు' వెళుతుంటే అందులో ఎక్కాలని దర్శన్ నిశ్చయించుకున్నాడు. ఐదురోజుల క్రితం ఇక్కడ నుంచే వెళ్లిన రైలులో ఆవగింజకు కూడా చోటు లేదట. ఇప్పుడూ అంతే. బాలింత శాహిని చూసి కొందరు దయాళువులు చోటిచ్చారు, రైలు కప్పుమీద. కవలలలో ఒక శిశువు ఆ రాపిడికి అడపాదడపా ఏడ్చినా రెండో శిశువులో చలనం ఉండదు. రైలెక్కిన కొన్ని క్షణాలకే దర్శన్‌కి అర్థమైంది, ఆ శిశువు చనిపోయింది. చుట్టూ ఉన్నవారు ఆ విగతజీవిని లాక్కుని అక్కడే పడేయాలని అనుకున్నా, తల్లిప్రాణం ఒప్పుకోదు. అన్న లేకుండా ఆ రెండోవాడు పాలు తాగడు అన్నది ఆమె వాదన. చాలాసార్లు ఆగినా, ఎట్టకేలకు రైలు ఖైరాబాద్ చేరింది. ఇక వచ్చేది గుజ్రన్‌వాలా, ఆపై గంటలోనే హిందుస్తాన్‌లో సురక్షితంగా ప్రవేశిస్తాం అనుకుంటూ ప్రాణాల మీద ఆశ పెంచుకుంటారు. రైలు ఒక వంతెన మీదకు చేరుకుంది. ఎవరో అరిచారు 'రావి నది' అని. అప్పుడే ఎవరో సలహా ఇచ్చారు దర్శన్‌సింగ్‌కి. చనిపోయిన శిశువును ఆ నదిలో పారేస్తే పుణ్యలోకాలు దక్కుతాయి కదా అని. అందుకే దర్శన్ తన భార్య చేతిలో నుంచి పొత్తిళ్లలోని ఆ శిశువును తన చేతుల్లోకి తీసుకుని ఆ నిశిరాత్రి నదిలోకి విసిరేశాడు. ఆ నీళ్లలో ఓ పసి ఆక్రందన. రైలు కప్పు మీద శాహిని మృత శిశువును గుండెలకు హత్తుకుని రోదిస్తున్నది. రైలు వంతెన దాటుతున్నందుకు జనం కొడుతున్న కేరింతలలో ఆ గొంతులు వినిపించలేదు.

విభజనతో వదులుకోవలసిన వచ్చినది ఉమ్మడి వారసత్వమే. మతంతో ప్రమేయం లేకుండా ఎందరో నమ్మిన సత్యమిదే. ఈ పరిణామం వెనుక నేపథ్యం, దారి తీసిన పరిస్థితులు గుల్జార్ గొప్పగా గమనించారు. ఒక కవితలో అంటారు:

"అది ఇప్పటికీ నా జన్మభూమే.
కానీ నా దేశం ఎప్పటికీ కాదు
అక్కడికి వెళ్లాలంటే రెండు ప్రభుత్వాలవీ
అనేక కార్యాలయాల చుట్టూ నేను ప్రదక్షిణలు చేయాలి
నా కలలకు రుజువులు చూపించడానికి
ఈ ముఖానికో ముద్ర వేయించుకోవాలి" అని.

నిజానికి 'రావి నది ఆవల' కథలో సజీవంగా నదీగర్భంలోకి చేరిన బిడ్డ, గర్భశోకంతో ఆ తల్లిల నిస్సహాయ రోదనను రైలు ప్రయాణికులు వినలేకపోయారు. అదే రోదన ఈ కవితలో ధ్వనింప చేశారు గుల్జార్. మూగరోదనలకు గొంతు నివ్వడమే కదా కవి పని!

గుల్జార్ పుట్టిన గడ్డ ప్రస్తుతం పాకిస్తాన్‌లోనే ఉంది (జీలమ్ జిల్లా, దీనా గ్రామం/ఆగస్ట్ 18, 1934). దేశ విభజనతో వారి కటుంబం చెల్లాచెదురైంది. అక్కడ నుంచి బొంబాయి (నేటి ముంబై) చేరుకున్నారు వారు. అంతకు ముందు వారి కుటుంబం అమృత్‌సర్, ఢిల్లీలలోని శరణార్థి శిబిరాలలో తలదాచుకున్నారు. ఢిల్లీలో ఒక కూరల మార్కెట్ దగ్గర వారు ఉండేవారు. తండ్రి కుమారుడిని చదివించలేకపోయాడు. దీనితో గుల్జార్ ఒక పెట్రోల్ బంకులో పనిచేశారు. ఆ తరువాతే తన భవిష్యత్తును భవ్యంగా తీర్చిన బొంబాయి చేరుకున్నారు. అక్కడే ఆయనకు సాహిత్యవేత్తలతో పరిచయం కలిగింది. కలం పట్టాలన్న తృష్ణ అంకురించింది. సాహిత్య సభలలోనే ఒకసారి నాటి ప్రఖ్యాత చలనచిత్ర గాయకుడు శైలేంద్రతో పరిచయం ఏర్పడింది. బిమల్‌రాయ్ చిత్రాలకు పని చేసే అవకాశం వచ్చింది. గుల్జార్ జీవితంలో గొప్ప లక్షణం, చలనచిత్ర పరిశ్రమకు ఎంత సన్నిహితమైనా ప్రధాన స్రవంతి సాహిత్యరంగానికి దూరం కాలేదు.

గుల్జార్‌కు దేశ విభజన దుఃఖంతో పాటు, వ్యక్తిగత జీవితంలో ఒక ఎడబాటు ఉంది. ఆయన పసితనంలోనే తల్లి కన్నుమూశారు. మారుటితల్లి సరిగా చూసేది కాదు. దీనితో తండ్రి మఖన్‌సింగ్ నడిపే చిన్న దుకాణంలోనే ఎక్కువ సమయం గడుపుతూ ఉండేవారు. పాఠ్య పుస్తకాలంటే నిరాసక్తత. రవీంద్రనాథ్ టాగూర్, శరత్‌చంద్ర సాహిత్యం ఆయనను బాగా ప్రభావితం చేశాయి. మొదట్లో ఉర్దూ, పంజాబీ భాషలలో కవిత్వం రాసేవారు. కవిగానే కాకుండా, వచన రచయితగా ఆయనకు ఖ్యాతి ఉంది. 'రెండు' ఆయన నవల. ఇందులో ఇతివృత్తం దేశ విభజన నాటి విషాదమే.

ప్రపంచ యుద్ధాలు, నియంతృత్వాలు, ఘోర దుర్భిక్షాలు కాలం మీద సుదీర్ఘంగా వాటి నీడను పరిచాయి. 1947 నాటి దేశ విభజన విషాదం జాడ కూడా కాలం మీద ఎంతో సుదీర్ఘంగా ఉంది. గుల్జార్ రచనలలో ఆ నీడ, జాడ గమనిస్తాం. అవన్నీ 'ఫుట్‌ప్రింట్స్ ఆన్ జీరో లైన్: రైటింగ్ ఆన్ ది పార్టిషన్' పేరుతో సంకలనంగా వెలువరించారు. ఒకటి వాస్తవం. ఆ చరిత్ర మిగిల్చిన ఆ విషాదానికి ప్రత్యక్ష సాక్షులు లేదా బాధితులు ఆ జ్ఞాపకాలని తుడిచివేయాలని అనుకున్నా సులభం కాదు. ఆ విషాదం ఇతివృత్తంగా ఉన్న కథలు చదివిన వాళ్లలో మరొకసారి ఆ బాధ మరొకసారి గుర్తుకు రాకూడదని గుల్జార్ ప్రగాఢంగా వాంఛించారు. చరిత్ర చేసిన గాయం సాధ్యపడనివ్వలేదు. ఈ గుంజాటనకి అక్షరరూపమే 'విభజన' కథ.


సంపూరణ్‌సింగ్ అంటే మరెవరో కాదు విభజన సమయంలో విడిపోయిన తమ కుమారుడేనని హర్భజన్‌సింగ్ అనే ఆయన, ఆయన భార్య గట్టి నమ్మకం. గుల్జార్‌కు ఆ మేరకు ఉత్తరాలు కూడా రాశారు. అంతటితో ఆగకుండా ఈ విషయం నిర్ధారించుకునే పనిలో సాయపడేందుకు ఆ దంపతులు కొందరు ప్రముఖులను ఆశ్రయించారు. బాలివుడ్ ప్రముఖులు సాయి పరాంజపే, అమోల్ పాలేకర్, జనతా పార్టీ ప్రముఖుడు మధు దండావతే భార్య వారిలో ఉన్నారు. మొత్తానికి ఆ దంపతులను గుల్జార్ కలుసుకున్నారు. నీవు ఆనాడు తప్పిపోయిన మా అబ్బాయి ఇక్బాల్‌సింగ్‌వేననీ, పేరు మార్చుకున్నావనీ వాదిస్తారు వారు. ఈ కథలోనే విభజన నాటి అంతటి విద్వేషంలోను అక్కడక్కడా విరిసిన మత సామరస్యం గురించి చెబుతారు గుల్జార్. ఆఖరికి, నీవు ఎక్కడున్నా ఫరవాలేదు, మతం మారినా పట్టించుకోను. కానీ నీవు నా కొడుకువే అన్న సంగతి మరచిపోవద్దు అంటుంది ఆ తల్లి. చాలా రోజులకి హర్భజన్ మరణించినట్టు సమాచారం వస్తుంది. మనసులో ఏదో మూల రోదన. ఇలా ముగించారీ కథ (అనువాదం: సి. మృణాళిని).

"కళ్లకు వీసాలతో పనిలేదు/ స్వప్నాలు సరిహద్దులెరుగవు
నేను మూసిన కళ్లతో నిత్యం/ సరిహద్దులు దాటతాను
మెహిదీ హసన్‌ను కలుసుకోవడానికి!"

ఈ కవితలో గుల్జార్ ప్రస్తావించిన మెహిదీ హసన్ రాజస్థాన్ వాసి. గొప్ప గజల్ గాయకుడు. ఆయన 1947లో పాకిస్తాన్ వలస వెళ్లిపోయారు. పాకిస్తాన్ నుంచి గుల్జార్ భారత్‌కు వలస వచ్చారు. ఇదొక వైచిత్రి. తరువాత తాను భారత్‌కు వెళతానంటే పాకిస్తాన్ వీసా నిరాకరించిందని హసన్ వాపోయారు. పైగా ఒకనాడు కరాచీ నగరాన్నీ, బొంబాయి నగరాన్నీ అక్కచెల్లెళ్ల వంటివని పిలిచేవారు. ఎందుకంటే రెండూ సాగరతీరాలే. ఎన్నో పోలికలు వాటి మధ్య. విభజనలో నాయకులు మరచిపోయిన ఉమ్మడి వారసత్వం గురించి ఎందరో వ్యథ చెందేవారు. ఒక కవితలో గుల్జార్ ఆ వ్యథనే ఎంతో గొప్పగా చిత్రించారు. "మీ నగరంలో పడి ఉన్న శవాల మీద గద్దలు ఎగురుతున్నాయి, ఇక్కడ మా నగరంలోని కూడళ్లలోనూ (అంటే ముంబై) అదే దృశ్యం" అన్నారాయన.

విభజన నాటి రక్తపాతాన్నీ, భయాన్నీ నిర్దేశించినది ఒక్కటే! "హిందువులు మరింత హిందువులుగానూ, ముస్లింలు మరింత ముస్లింలగానూ ప్రవర్తించడం" ('పొగ' కథలోని ఒక వాక్యం). ఇదే బొంబాయి నేపథ్యంగా సాగిన కథ 'భయం' (కాఫూఫ్) ఇతివృత్తం. యాసిన్ అనే ముస్లిం యువకుడు లోకల్ ట్రైన్‌లో పొందిన అనుభవం, చేసిన దుర్మార్గం ఇందులో ఇతివృత్తం. అతడికి ప్రతి హిందువూ ఇద్దరుముగ్గురిగా కనిపిస్తారు. ఒక స్టేషన్‌లో మరొక యువకుడు ఎక్కాడు. ఇతడి ముఖానికి మఫ్లర్ ఉంది. 'అతడు హిందువే' అని తీర్మానించుకున్నాడు యాసిన్. అతడితో తనకు ప్రాణహాని ఉందని మరుక్షణంలో నమ్మకానికి వచ్చేశాడు. ఎందుకంటే ఆ అపరిచితుడు జేబులో పెట్టిన చేయి తీయడం లేదు. అంటే ఆయుధంతో సిద్ధమవుతున్నాడు. తనని చంపడానికి ముందే తాను అతడిని చంపాలని నిర్ణయించుకున్నాడు యాసిన్. రైలు భయాందర్ వంతెన మీదకు వచ్చింది. అతడు బోగీ గుమ్మం దగ్గర ఆదమరచి ఉండగా యాసిన్ వెళ్లి బలంగా బయటకు నెట్టేశాడు. మరుక్షణం ఒక ఆక్రందన- 'అల్లా' అంటూ! దీనికి ఇలా అనూహ్యమైన ముగింపు ఇచ్చారు గుల్జార్. "అది అలా జరగాల్సి ఉంది మరి! ఏం చేస్తాం!" అంటాడు యాసిన్ భార్యతో.

ఆరు దశాబ్దాల క్రితం బల్‌రాజ్ సహానీ నటించిన కాబూలీవాలా సినిమాతో గుల్జార్ వెండితెర ప్రయాణం ప్రారంభమైంది. పాటలతో పాటు, పలు చిత్రాలకు ఆయన సంభాషణలు కూడా కూర్చారు. దర్శకత్వం చేపట్టారు. మాచిస్, ఆంధీ, మౌసమ్, ఖుష్బూ, పరిచయ్, కోషిష్, రుడాలి వంటి చిత్రాలకు ఆయన అందించిన గేయాలు ఎంతో ఖ్యాతి గాంచాయి. స్లమ్‌డాగ్ మిలియనీర్‌కు ఆస్కార్ పురస్కారం లభించింది. గుల్జార్‌ను చలనచిత్ర గేయ రచయితగా మాత్రమే పరిగణించలేం. ఆయనకు ఉర్దూ, హిందీ సాహిత్య ప్రపంచాలలో ప్రత్యేక స్థానం ఉంది.




> **దేశ విభజన విషాదం, చరిత్ర పంజాబీలదో, బెంగాలీలదో అనుకోవడం వల్ల సానుభూతినీ, సంఘీభావాన్నీ ప్రకటించే బాధ్యతను మిగిలిన దేశం విస్మరించింది. వందేమాతరం ఉద్యమాన్నీ, నినాదాన్నీ మిగిలిన భారతావని సొంతం చేసుకున్నట్టు విభజన విషాదపు లోతులను స్వీకరించలేదు. ఒక గొప్ప సాహిత్య ధోరణితోనే దేశం ఆ అనుభవాలను పలకరించగలిగింది. అదే దేశ విభజన నాటి సాహిత్యం. అమృతా ప్రీతమ్, కుష్వంత్ సింగ్, సాదత్ హసన్ మంటో, భీష్మ సహానీ వంటి వారెందరో నాటి గాథలను అక్షరీకరించారు. గుల్జార్ వారిలో ఒకరే అయినా, ఆయన వ్యక్తీకరణ వేరు.**

**గోపరాజు నారాయణరావు**

---

### కవితాసంపుటాలకు ఆహ్వానం

విమలా స్మారక 'విమలాశాంతి సాహిత్య పురస్కారం - 2024' కోసం కవుల నుండి 2022, 2023 సంవత్సరాలలో ప్రచురించబడిన వచన కవితా సంపుటాలను ఆహ్వానిస్తున్నాం. కవులు తమ కవితా సంపుటాలు నాలుగేసి కాపీలను జూలై 15 లోగా చిరునామా: ఉప్పరపాటి వెంకటేశులు, 16-37-1, రాహుల్ నివాస్, ప్రశాంతినగర్, అనంతపురం - 515004కు పంపాలి.

**శాంతి నారాయణ**

### ఆచార్య ఎన్.జి. రంగ సాహిత్యపురస్కారం

ఎన్.జి.రంగ సాహిత్య పురస్కారం-2024 కోసం 2021-2023 మధ్య ప్రచురితమైన రచయిత్రుల నవలలను జులై 20 లోపు నాలుగు ప్రతులను చిరునామా: నాగభైరవ ఆదినారాయణ, 202, శ్రీ వెంకటసాయి రెసిడెన్సీ రామయ్యనగర్, ఒంగోలు - 523002కు పంపాలి. నవలల్లో మొదటి, రెండు స్థానాల్లో నిలిచిన నవలలకు రూ.10వేలు, రూ.5వేలు చొప్పున బహుమతులు ఉంటాయి. మరిన్ని వివరాలకు: 9849799711.

**ఆదినారాయణ**

### 'మాటల చెట్టు' కవితాసంపుటి ఆవిష్కరణ

తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ-తెలంగాణ రచయితల సంఘం జంట నగరాల శాఖ ఆధ్వర్యంలో గడ్డం సులోచన రాసిన 'మాటల చెట్టు' కవితా సంపుటిని జూన్ 22 ఉ.10గం.లకు రవీంద్ర భారతి, హైదరాబాద్‌లో జరుగుతుంది. ఆవిష్కరణ నందిని సిధారెడ్డి, అధ్యక్షత కందుకూరి శ్రీరాములు. సభలో నాళేశ్వరం శంకరం, ఉదారి నారాయణ తదితరులు పాల్గొంటారు.

**తెలంగాణ రచయితల సంఘం (జంటనగరాలు)**

### ఖమ్మం ఈస్థటిక్స్ - రచనల ఆహ్వానం

ఖమ్మం ఈస్థటిక్స్ పేరిట ప్రతి యేటా ఒక ఉత్తమ కవితా సంపుటికి, మూడు ఉత్తమ కథలకు ఇచ్చే పురస్కారాలకు ఇదే ఆహ్వానం. మూడు ఉత్తమ కథలకు ప్రథమ, ద్వితీయ, తృతీయ పురస్కారాలు ఇస్తూ (వీటి బహుమతులు వరుసగా: రూ.25వేలు, 15వేలు, 10వేలు), మరికొన్ని కథలను కూడా సాధారణ ప్రచురణకు ఎంపిక చేసి పుస్తకంగా అచ్చువేస్తాం. ఉత్తమ కవితా సంపుటికి రూ.40 వేల రూపాయల నగదు బహుమతి ఉంటుంది. కవితా సంపుటి 2023 ఏప్రిల్, 2024 మార్చ్ నడుమ ప్రచురితమై ఉండాలి. సంపుటి కనీసం 25 కవితలకు తగ్గకుండా ఉండాలి. పురస్కారం కోసం నాలుగు ప్రతులను పంపాలి. పోటీకి పంపే కథలు కేవలం ఈ పురస్కారం కోసం మాత్రమే రాసినవై ఉండాలి. కథ ప్రింట్ నాలుగు ప్రతులను పోస్టులో పంపి, ఈమెయిల్‌కు యూనికోడ్ సాఫ్ట్ కాపీ కూడా పంపాలి. ఖమ్మంలో నవంబర్‌లో జరిగే వేడుకలో అవార్డుల ప్రదానం ఉంటుంది. కథలు, కవితా సంపుటులు ఆగస్ట్ 31, 2024 లోపు పంపాల్సిన చిరునామా: ఖమ్మం ఈస్థటిక్స్, హార్వెస్ట్ స్కూల్, 5-7-200/11, పాకబండ బజార్, ఖమ్మం - 507002. ఫోన్: 9849114369. ఈమెయిల్: khammamaesthetics@gmail.com

**ఖమ్మం ఈస్థటిక్స్**

# గిరిజన జీవితాల్లోకి తెరిచిన తలుపులు సువర్ణముఖి కథలు

"**ఈ** విప్లవాగ్నులు ఎవటివని అడిగితే
శ్రీకాకుళము వైపు చూడమని చెప్పాలి"

శ్రీకాకుళం అనగానే శ్రీకాకుళంతో ప్రత్యక్ష పరిచయం లేనివాళ్ళకు గుర్తొచ్చేది గిరిజనోద్యమ పోరాటం. ఆ ఉద్యమ స్ఫూర్తితో, గిరిజన జాతుల జీవన సంస్కృతిని అవలోకనం చేసుకొని ఉత్తరాంధ్ర తొలి గిరిజన కథ రాసిన రచయిత భూషణం మాస్టారు. వారికి కొనసాగింపుగా అంతే బలంగా గిరిజన కథ రాసుకొచ్చిన కథకులు సువర్ణముఖి. వీరి నుండి శక్తివంతమైన గిరిజన కథ వెలువడడానికి ప్రధాన కారణం సువర్ణముఖి ఉద్యమకారునిగా గిరిజనులతో మమేకమై జీవించడం. తన సృజనాత్మకతలో ఉద్యమాన్ని లీనం చేసుకొన్న రచయిత. గిరిజన జీవితాలను, ఆరాటాలను, పోరాటాలను, సంస్కృతులను, సాంప్రదాయాలను, ఆచారాలను, మూఢనమ్మకాలను, విశ్వాసాలను, నేస్తరికాన్ని దగ్గరగా చూసిన కథకులు సువర్ణముఖి. ఆయన కథలు రావిశాస్త్రిని సైతం తలపిస్తాయి.

1970 దశకం తరవాత గిరిజన కథ జవసత్వాలను పుంజుకుంది శ్రీకాకుళ ఉద్యమ దన్నుతోనే. పోరాటాన్ని, నిర్బంధాన్ని, పునర్నిర్మాణాన్ని దశలవారిగా ఉత్తరాంధ్ర కథకులు అక్షరీకరిస్తూ వచ్చారు. సువర్ణముఖి తన కథల్లో నిర్బంధాన్ని, ఉద్యమ పునర్నిర్మాణాన్ని క్రోడీకరించుకుని కథలుగా రాసారు. 1989-95 మధ్య కాలంలో తొమ్మిది కథలను 'సువర్ణముఖి కథలు' పేరుతో ప్రచురించారు. రెండు దశాబ్దాల తర్వాత 2017లో 'గోరపిట్ట' పేరుతో మరొక కథల సంపుటి వెలువరించారు. శ్రీకాకుళ పోరాట మలిదశ కాలంలో వెలువడిన కథలుగా వీటిని గుర్తించవచ్చు.

ఉత్తరాంధ్ర గిరిజన కథా సాహిత్యంలో స్వీయానుభవ కథకుల కంటే సహానుభవంతో రాసిన కథకులే ఎక్కువ మంది కనిపిస్తారు. దానికి ప్రధాన కారణం మైదాన ప్రాంత ప్రజలకు చేరువైనట్లుగా గిరిజన ప్రాంత ప్రజలకు విద్య అందలేదు. కొండలకు ఆనుకుని ఉన్న అడవుల్లో నివసించే గిరిజన తెగలలో క్రమపరిణామాల్ని చిత్రించాలంటే వారి జీవితాలతో రచయితలకి చాలా దగ్గర సంబంధం ఉండాలి. అలాంటి సంబంధాన్ని కలిగి, ఉత్తరాంధ్రలో ఉన్న సవర, జాతాబు, గదబ, కొండదొరల జీవితాల్లో వచ్చిన మార్పులను సాంస్కృతిక నేపథ్యం నుంచి చిత్రించినవిగా సువర్ణముఖి కథలు కనిపిస్తాయి.

విజయనగరం జిల్లా అంతటా ప్రవహించే సువర్ణముఖి నది పేరును తన కలం పేరుగా రౌతు బంగారునాయుడు మార్చుకున్నారు. సువర్ణముఖి ఎంచుకున్న కథా వస్తువలు ఎచ్చుతక్కువలు లేకుండా కచ్చితత్వం కలిగి ఉంటాయి. తాను చూసిన గిరిజన తాత్విక జీవితాలను, గత పోరాట జ్ఞాపకాలను మదిన నిలుపుకొని తన కథలు నడిపారు.

> **ఉత్తరాంధ్ర గిరిజన కథా సాహిత్యంలో స్వీయానుభవ కథకుల కంటే సహానుభవంతో రాసిన కథకులే ఎక్కువ మంది కనిపిస్తారు. దానికి ప్రధాన కారణం మైదాన ప్రాంత ప్రజలకు చేరువైనట్లుగా గిరిజన ప్రాంత ప్రజలకు విద్య అందలేదు. కొండలకు ఆనుకుని ఉన్న అడవుల్లో నివసించే గిరిజన తెగలలో క్రమపరిణామాల్ని చిత్రించాలంటే వారి జీవితాలతో రచయితలకి చాలా దగ్గర సంబంధం ఉండాలి.**

1967 అక్టోబర్ 31న వందలాది గిరిజనులు-పిల్లాపాపా, స్త్రీలు, వృద్ధులు అందరి అడుగులు మొండెంఖల్లు గిరిజన సభా ప్రాంగణంవైపు. ఆ సభకు వచ్చిన కొండగొర్రె మంగన్న, ఆరిక మంగన్న అనే ఇద్దరు ఆదివాసీలు అమరులయ్యారు. వారిరువురితోపాటుగా శ్రీకాకుళ పోరాటంలో అసువులు బాసిన అమరవీరుల స్తూపం ప్రారంభోత్సవానికి జాతరగా బయలుదేరిన అశేష జనసంద్రాన్ని దృశ్యీకరించిన కథ



'యాతర'. ఈ కథలో వారు ప్రయోగించిన భాష మరింత ఆకర్షణీయంగా ఉంటుంది. "తూం మీద అడ్డ, అడ్డ మీద తవ్వ, తవ్వ మీద సోల, సోల మీద గిద్ద, గిద్ద మీద సుత్తీ కొడవలి" అని స్తూపం గురించి వచనం చెప్పడంలోనూ ముక్తపదగ్రస్త అలంకారాన్ని ప్రయోగించారు. చివరకు ఆ స్తూపం "పుట్టెడు బియ్యం పట్టిన గూనలాగ మిగిలింది" అనడంలో కూడా ఉపమాలంకారం చూపించారు. స్థానిక భాషను ప్రయోగిస్తూ ఆ అమరవీరు త్యాగాన్ని గురించి ఈ కథలో తెలిపారు.

గిరిజనుల 'కొండగాలి'లోకి పల్లం వాళ్ళ 'కొత్తగాలి' ప్రవేశంతో వాళ్ళ బతుకులు చిన్నాభిన్నంగా మారిపోయాయి. పాలన పేరుతో, వ్యాపారం పేరుతో, చట్టం పేరుతో, కొండల్లోకి, అడవుల్లోకి, గూడెంలోకి ప్రవేశించి అడివిని, కొండని దోచుకున్నారు. ఆ దోపిడికి సాక్షమే 'సావుకర్ను' కథ. శ్రీకాకుళ పోరాటంలో అసువులు బాసిన అమర వీరుల త్యాగ ఫలితాలకు కొండకి విద్యుత్, రోడ్డు, కార్పొరేషన్, బడులు వచ్చాయి. "ఓరే సుబ్బా! మీ యమ్మని కుడిసేత్తోటి సంపీసి, ఎడమ సేత్తోటి పాలిచ్చి తాగమంటే తాగుతావురానువ్వూ..? అలగే చేసినార్రా. సంపీసి సావుకర్ను ఇచ్చినార్రా!" అని రచయిత పలికించిన మాటల్లో గిరిజనుల వాస్తవ జీవితం దాగి ఉంది. సందర్భానుసారంగా ప్రయోగినచిన భాష, అలంకారాలు కథకు మరింత సౌందర్యాన్ని తెచ్చి పెట్టాయి. "కరెంట తంబామీ్మద ఎవలో చుట్ట కాలుతున్నట్టగ ఎర్రగ రంగమ్మిరపకాయనాగ ఎలుగెలిగి పోతుంది, కరెంటుబుడ్డీ" అని చెప్పడంలో స్వచ్ఛమైన ఉత్తరాంధ్ర భాష దాగి ఉంది. గిరిజనుల కష్టం ఏ రీతిగా పల్లం ప్రజల, అధికారుల చేతిలోకి వెళ్ళిపోతుందో రచయిత తనదైన శైలిలో చెప్పారు. "వెండి పోతలాగ పార్తంది ఏరు. కొండమీదున్న సవరోళ్ళ సెమటే గావల వూటల్లాగ అలగ కారికారి ఒక దగ్గర చేరిచేరి ఇలా నార్తంది. అది తిన్నగ 'వనజ' పండివోడి భూమిలోకి, దాన్నించి 'జియ్యమ్మవల్స' మండలాదికొరిగోరి భూమిలోకి ఎల్లిపోతాది. సవరోళ్ళ సెమట అక్కడ సరుకైపోద్ది" అని రాస్తారు సువర్ణముఖి.

సువర్ణముఖి కథల్లో నాటకీయత ఉంటుంది. కథ విభిన్నంగా నడుస్తుంది. ఆదివాసీల ఘర్షణలను, ఘటనలను చిత్రీకరించిన తీరుకు సంబంధించి 'పండుగ', 'గోరపిట్ట', 'సుక్కి' కథలు కనిపిస్తాయి. ఈ కథలన్నీ విస్తృతమైన నిడివి కలిగి ఉంటాయి. ప్రభుత్వం ప్రజాదర్బార్ పథకంలో భాగంగా గిరిజన యువకుల్ని ఆకర్షించి పోలీసు ఉద్యోగాలిచ్చి ఇన్‌ఫార్మర్‌లుగా మార్చడం, ఫలితంగా ఉద్యమకారులంతా ఉద్యోగాల్లో చేరిపోవడం 'పండుగ' కథలో కనిపిస్తుంది. కొండ ప్రాంతంలో జీవిస్తున్న సవరలు నాగరిక సమాజం ఇష్టానికి అనుగుణంగా జీవించే ప్రయత్నంలో మోసపోతున్నారు. అడవిలో ప్రవేశించిన గిరిజనేతరుల చేతిలో నలిగిపోతున్న ఆదివాసి మహిళల ఆత్మఘోష 'గోరపిట్ట' కథ.

"సువర్ణముఖి ఎప్పుడూ ఒక వాతావరణం, ఒక దృశ్యం, ఒక సంఘటన లేకుండా మనముందు ఒక సత్యాన్ని ఆవిష్కరించడు" అని వరవరరావు అన్నట్లుగా శక్తివంతమైన శైలితో, స్వచ్ఛమైన భాషతో ఆయన కథలు మనల్ని వెంటాడతాయి. ఇంత మంచి కథలు వెలువడడానికి ప్రధాన భూమిక శ్రీకాకుళ గిరిజనోద్యమం. ఆ పోరాట అనుభవాలలో పెరిగినవారు సువర్ణముఖి. ఉద్యమ సాహిత్యాన్ని ఆకళింపు చేసుకొని ఆదివాసీల జీవితపు పార్శ్వాలను విభిన్న కోణాల్లో చూపించారు.

**సారిపల్లి నాగరాజు**
80083 70326



## రెండు చేతులు

అవంటే ఎంతో ఇష్టం నాకు
వాటిలో నా మొఖం దాచుకొనేంత ఇష్టం
ఆ రెండు చేతుల కోసం బ్రతుకంతా
చేతులు చాచి ఎదురుచూసేంత ఇష్టం
ఆ చేతులే..
నా అడుగులు తడబడుతున్నప్పుడు
కొండంత ఆసరాగా మారి పట్టి నిలుపుతాయి
చెంపలను నిమిరి
నా తడి కళ్ళను
చూపుడు వేలుతో అద్ది ముద్దాడుతాయి
పసికూనల్ని రెక్కల చాటుకు చేర్చుకున్న
తల్లి పక్షిలా
నన్ను తన కౌగిట్లో భద్రంగా పొదువుకుంటాయి

ఆ చేతులు..
తడారిపోయిన నా పెదవులకు
చెలిమి వెన్నను పూస్తాయి
నా పరిసరాల చుట్టూ
సువాసనలు వెదజల్లి
నాతో మాట్లాడిస్తాయి
మృదువైన మాటల్లో నన్ను ముంచి తీస్తాయి
అలసిన నా నుదుటిపై స్వేదాన్ని తుడిచి
చెదిరిపోయిన నా ముంగురులు సవరిస్తాయి
వేకువ చల్లదనాన్ని విసిరి
కొత్త రాగాన్ని నా గొంతులో ఒలకబోస్తాయి

ఆ చేతుల కోసం ఎన్నాళ్లుగానో
వెతుకుతున్నాన్నేను
కలనైనా కనిపించి అక్కున చేర్చుకుంటాయేమోనని
నిద్ర వాకిలి చెంత కూర్చొని నిరీక్షిస్తున్నాను
ఆ చేతుల దిండుపై తలవాల్చి
నన్ను నేను మరచిపోతూ
ఆ భ్రమల్లోనే మురిసిపోతూ
బతుకు రేక తెల్లబడే దాకా బతికిపోతుంటాను

**సునీత గంగవరపు**
94940 84576

### హాసిని రామచంద్ర లిటరరీ ఫౌండేషన్ (హెచ్ఆర్‌సి) కథలు, కవితల పోటీలు

హెచ్ఆర్‌సి కథల, కవితల పోటీ కోసం ప్రయోజనాత్మక అంశాలతో రచనలను జూన్ 25లోగా 9502818774 నంబరుకు వాట్సప్‌తోపాటు నాలుగు ప్రతు లను చిరునామా: తోట సుభాషిణి, ఇం.నెం. 15-13-309, బ్యాంకు కాలనీ, ఖమ్మం- 507002కు పంపాలి.

**సుభాషిణి తోట**

### పాలపిట్ట దాశరథి శతజయంతి సంచిక కోసం రచనల ఆహ్వానం

ఈ ఏడాది జూలై 22న దాశరథి కృష్ణమాచార్యులు శతజయంతి సంవత్సరం ఆరంభమవుతున్న సందర్భంగా దాశరథి శతజయంతి సంచికని తెస్తున్నాం. ఇందుకోసం దాశరథి కృష్ణమాచార్యులతో అనుబంధం గలవారు వారితో తమ జ్ఞాపకాలు, సాహిత్య సంబంధాల గురించి వ్యాసాలను, ముఖ్యంగా దాశరథి పాల్గొన్న సభల ఫోటోలను, వారితో ఉన్న తమ ఫోటోలను, దాశరథి రాసిన ఉత్తరాలను చిరునామా: ఎడిటర్, పాలపిట్ట, ఫ్లాట్ నెం: 2, ఎం.ఐ.జి-2, ఏపిహెచ్‌బి, బాగ్‌లింగంపల్లి, హైదరాబాద్- 500044కు పంపగోరుతున్నాము. ఫోన్: 9490099327, ఈమెయిల్: palapittabooks@gmail.com

**పాలపిట్ట**



రెండ్రోజుల నుంచి ఠారెత్తించిన ఎండల ధాటికి ఉడికిపోయిన జనం ఆదివారం సాయంత్రానికి చల్లబడ్డారు. ఉరుములు, మెరుపులతో దంచికొట్టిన వానతో ఉపశమనం పొందారు. 6.15 గంటలకు ప్రారంభమైన భారీ వర్షం 7.45 గంటల వరకు నిర్విరామంగా కొనసాగింది. నగరంలోని గాయత్రినగర్, బెంజిసర్కిల్, పటమట, విద్యాధరపురం, కేఆర్ మార్కెట్, భవానీపురం తదితర ప్రాంతాల్లోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. పటమట, విద్యాధరపురంల్లో కొద్దిసేపు విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రోడ్లపైనే మోకాలు లోతు వర్షపునీరు నిలిచిపోయింది. ట్రాఫిక్ స్థంభించింది. బెంజిసర్కిల్ ప్రాంతంలో కార్లు వర్షపునీటిలో కదల్లేక పావుగంటకు పైగానే నిలిచిపోయాయి. - భవానీపురం

# దంచికొట్టిన వాన

- చన్నాళ్లకు గంటపాటు కుండపోత వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం



బందరు రోడ్డులో వర్షపునీటిలో నిలిచిపోయిన ట్రాఫిక్



నిర్మల కాన్వెంట్ రోడ్డులో భారీగా నిలిచిన వర్షపు నీరు



ఐజీఎంసీ స్టేడియంలోకి చేరిన నీరు




బెంజిసర్కిల్ సమీపంలో..



బెంజిసర్కిల్ సమీపంలో నీటితో నిండిపోయిన రోడ్డు

# నాది - మీ పార్టీనే..

రాష్ట్రంలో అధికారం మారడంతో నిన్నటి వరకు వైసీపీకి తొత్తులుగా పనిచేసిన కొందరు అధికారులు నేడు మనుగడ కోసం పోరాటం మొదలుపెట్టారు. ఉన్న సీటును కాపాడుకునేందుకు పడరాని పాట్లు పడుతున్నారు. దేవదాయశాఖలో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల అధికారిణిగా ఉన్న ఉద్యోగి తీరే దీనికి నిదర్శనం. వైసీపీ కీలక నేత విజయసాయిరెడ్డికి వీరభక్తురాలిగా గుర్తింపు పొందిన ఈమె ప్రస్తుతం తన విధేయతను మార్చేసుకున్నారు. ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల్లోని ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతూ తాను టీడీపీ మద్దతురాలినని, తనను ప్రస్తుతం ఉన్న హోదాల్లోనే కొనసాగించాలని విన్నపాలు చేసుకుంటున్నారు. ఈమె తీరుపై దేవదాయశాఖ ఉద్యోగులే ఆశ్చర్యపోతున్నారు.



## ఇక్కడే కొనసాగించాలని ప్రభుత్వానికి విజయసాయి భక్తురాలి విన్నపాలు

- సర్కార్ మారడంతో మారిన విధేయత
- టీడీపీ ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- సీటు కోసం దేవదాయ శాఖ ఉన్నతాధికారిణి పాట్లు
- రెండు జిల్లాలకు ఆమే అధికారిణి.. తొలి నుంచీ ఆరోపణలే

(విజయవాడ - ఆంధ్రజ్యోతి) : వైసీపీ ప్రభుత్వంలో ఆ పార్టీ కీలక నాయకుడు విజయసాయిరెడ్డి అండతో ఎన్టీఆర్, కృష్ణా జిల్లాల ఉద్యోగిగా ఉన్న అధికారిణి చెలరేగిపోయారు. ఆయన ఆశీస్సులతోనే ఆమె 2022లో కృష్ణా జిల్లాలోని నెమలి దేవస్థానానికి బదిలీ అయ్యారు. వెనువెంటనే ఎన్టీఆర్ జిల్లా బాధ్యతలను కూడా ఆమెకే అప్పగించారు. ఒకే ఉద్యోగికి రెండు కీలక పదవులు కట్టబెట్టడం.. అది కూడా ఆరోపణలు ఎదుర్కొంటున్న ఉద్యోగికి ఇవ్వడంపై విమర్శలు రావడంతో కొద్ది కాలానికి ఎన్టీఆర్ జిల్లాకు వేరే అధికారిణిని నియమించారు. అయితే ఆమెకు బాధ్యతలు అప్పచెప్పకుండా ముప్పతిప్పలు పెట్టి మూడు చెరువుల నీళ్ల తాగించి ఇబ్బందులకు గురి చేశారు. ఉన్నతాధికారుల ఒత్తిళ్లతో చివరికి బాధ్యతలు అప్పగించి, ఈమె కృష్ణాజిల్లా బాధ్యతలు చేపట్టారు. అయితే విజయసాయి అండ ఉండటంతో పట్టుబట్టి మరీ కొద్ది రోజులకే మళ్లీ ఎన్టీఆర్ జిల్లా అధికారిణిని బదిలీ చేయించి, ఆ స్థానంలో అదనపు బాధ్యతలు తనకే వచ్చేలా ఆదేశాలు జారీ చేయించుకున్నారు. రెండు జిల్లాల బాధ్యతలు అప్పగించినా ఆమె ఏ రోజూ సక్రమంగా కార్యాలయానికి వచ్చే వారు కాదని ఉద్యోగులే చెబుతారు. ఓ దశలో స్పందన కార్యక్రమానికి వరుసగా గైర్హాజరవుతుండటంతో కృష్ణాజిల్లా కలెక్టర్ ఆమెను మందలించి షోకాజ్ నోటీసు కూడా జారీ చేశారు. విజయసాయి అండతో తనకు నచ్చిన వారికి ఆలయాల్లో పోస్టులు ఇప్పించుకుని చక్రం తిప్పారు. ఉన్నతాధికారులను లెక్కచేయకుండా అధికార జులుం ప్రదర్శించారన్న ఆరోపణలు ఉన్నాయి. విజయసాయి రెడ్డి ఉత్తరాంధ్ర జిల్లాలకు వైసీపీ ఇన్చార్జిగా ఉన్నపుడు ఆయన అండతో దేవదాయశాఖకు చెందిన ఓ ఉన్నతాధికారితో కలిసి పెద్దఎత్తున భూ కుంభకోణాలకు పాల్పడినట్టు ఈ అధికారిణిపై ఆరోపణలు ఉన్నాయి. విధులు సరిగా నిర్వహించమన్నందుకు ఏకంగా తన పైఅధికారిపై ఆరోపణలు చేసి, కార్యాలయంలోనే ఆయనపై ఇసుకు చల్లిన ఘనత ఈమె సొంతం. ఈ వ్యవహారంలో సదరు అధికారి ఏకంగా ఉద్యోగం వదిలేసి వెళ్లిపోయారు. కార్యాలయంలో ఉన్నతాధికారిపై అవిధేయత చూపినందుకు ఎలాంటి చర్యలూ తీసుకోకపోవడం గమనార్హం.

### అడ్డగోలుగా చేసేశారు..

సదరు అధికారిణి విజయసాయి అండతో అడ్డగోలుగా వ్యవహరించారు. నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ఆదేశాలు ఇచ్చారు. వన్‌టౌన్ సామారంగం చౌక్‌లో 1916లో చల్లంరాజు వెంకట శేషయ్య ధర్మసత్రాన్ని నిర్మించారు. దాత ఆశయాల మేరకు ఇతర ప్రాంతాల నుంచి వచ్చిన బాటసారులకు ఆ భవనంలో వసతులు కల్పించి హిందూ ప్రచారానికి వినియోగించాలి. సత్రం నిర్వహణకు ఉపయోగపడేలా 11 షాపులను నిర్మించి, వాటి అద్దెను వాడుకునేలా పకడ్బందీగా ఏర్పాట్లు చేశారు. ప్రస్తుతం దేవదాయశాఖ ఆధీనంలో ఈ సత్రం ఉంది. ఈ క్రమంలో 2023లో మొత్తం 11 షాపులకు వేలంపాట నిర్వహించారు. వీటిలో రెండు షాపులకు దేవదాయశాఖ నిబంధనలకు విరుద్ధంగా జీవో నెంబర్ 426 అమలు చేయకుండా 11 ఏళ్లకు లీజుకి ఇచ్చేశారు. నిబంధనల ప్రకారం ఏ షాపునైనా వేలం నిర్వహించి కేవలం 3 ఏళ్ల కాలానికే లీజుకు ఇస్తారు. ఈ వ్యవహారంలో ఈ అధికారిణి, దేవదాయశాఖ కమిషనరేట్‌లో మరో కీలక అధికారి కుమ్మక్కయినట్టు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంలో సుమారు కోటి రూపాయలు చేతులు మారినట్లు దేవదాయశాఖ అధికారులే బహిరంగంగా ఆరోపించారు. దీనిపై వన్‌టౌన్‌కు చెందిన పలువురు వ్యాపారులు ఏసీబీ అధికారులకు ఫిర్యాదు చేయగా, రాజకీయ ఒత్తిళ్లతో దాన్ని పక్కనపడేసినట్టు తెలుస్తోంది. ఆలయాలు, చారిటబుల్ ట్రస్ట్‌లలో తనిఖీలకు వెళితే వాటి స్థాయిని బట్టి ముడుపులు వసూలు చేస్తారన్న ఆరోపణలు ఈ అధికారిణిపై ఉన్నాయి. వివాదాస్పద, లీజుకు సంబంధించిన దేవదాయశాఖ భూములు విషయంలో ఎన్‌వోసీ ఇవ్వాలంటూ రూ.లక్ష సమర్పించుకోవాలని, తనిఖీల సమయంలో రూ.అరలక్ష నగదు, కనీసం పదివేల రూపాయల విలువగల పట్టుచీర సమర్పించాల్సిందేనని ఆ శాఖలోనే ఉద్యోగులే బహిరంగంగా చెబుతుంటారు.

### విధేయత మార్చేశారు..

వైసీపీ ప్రభుత్వం అధికారం కోల్పోయి కూటమి ప్రభుత్వం రావడంతో ఈ అధికారిణి తన విధేయతను కూడా మార్చేశారు. ఏ రకంగానైనా సరే ఉమ్మడి కృష్ణాజిల్లాలోనే తనకు విధులు కేటాయింపచేసుకునేందుకు ఆమె అధికార పార్టీ ప్రజాప్రతినిధులు చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు. గత నాలుగు రోజులుగా మంత్రి కొల్లు రవీంద్ర, ఎమ్మెల్యేలు వెనిగండ్ల రాము, మండలి బుద్ధప్రసాద్, యార్లగడ్డ వెంకట్రావు, శ్రీరాం తాతయ్యను కలిశారు. కృష్ణాజిల్లా బాధ్యతలతోపాటు ఎన్టీఆర్ జిల్లా అదనపు బాధ్యతల్లోనే తనను కొనసాగించాలని వారికి విన్నవించుకున్నట్లు సమాచారం. ఒకవేళ ఆయా స్థానాల్లో కొనసాగించడం కుదరకపోతే రెండు జిల్లాల్లోనే ఒక్కడో ఒకచోట తనకు అవకాశం కల్పించాలని కోరుతున్నట్టు చెబుతున్నారు. ప్రసిద్ధ మోపిదేవి దేవస్థానం ఈవో కానీ తిరుమలగిరి వెంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవోగా కానీ నియవింపచాలని కోరుతున్నట్లు సమాచారం.

# సిగ్నల్స్ కామధేనువు

## బీఎస్ఎన్ఎల్ వద్ద 'కౌ'

- సిగ్నల్స్ పునరుద్ధరణకు మొబైల్ టవర్లు
- రద్దీ ఉన్న ప్రదేశాల్లో ఏర్పాటు

గన్నవరం మండలం కేసరపల్లి వద్ద జరిగిన సీఎం ప్రమాణస్వీకార సభాప్రాంగణం వద్ద కొంతమంది సెల్‌ఫోన్లు మాత్రమే పనిచేశాయి. సీఎంకు జడ్‌ప్లస్ కేటగిరీ ఉండడంతో జామర్లు ఆన్‌చేయడంతో సెల్‌ఫోన్లకు సిగ్నల్స్ రావడం లేదని కొంతమంది భావించారు. కొంతమంది సెల్‌ఫోన్లు మాత్రం మోగాయి. దీనికి ప్రధాన కారణం బీఎస్ఎన్ఎల్ తీసుకొచ్చిన 'కౌ'.



(ఆంధ్రజ్యోతి - విజయవాడ) : మొబైల్ రంగంలో తన ప్రత్యేకతను చూపించుకోవడానికి కొత్త ఆవిష్కరణలకు బీఎస్ఎన్ఎల్ శ్రీకారం చుట్టింది. ప్రముఖుల సభలు జరిగినప్పుడు, జనం రద్దీ ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఈ కౌను ప్రయోగిస్తోంది. ఇటీవల జరిగిన ఎన్నికల్లో ప్రధాని నరేంద్ర మోదీ పాల్గొన్న కూటమి సభల్లో కౌ లక్షలాదికి మందికి సిగ్నల్స్‌ను అందజేసింది. దీనితో మొబైల్ రంగంలో అసలు ఈ బీఎస్ఎన్ఎల్ రూపొందించిన కౌ ఏమిటన్న దానిపై చర్చ జరుగుతోంది.

### అసలు కౌ అంటే...

సెల్‌ఫోన్లకు సిగ్నల్స్‌ను ప్రసారం చేయడానికి బీఎస్ఎన్ఎల్ రూపొందించిన కొత్త టెక్నాలజీ పేరు కౌ. సెల్ ఆన్ వీల్స్ పేరుతో మినీ టవర్లను రూపొందించింది. దీన్ని సంక్షిప్తంగా కౌ అని వ్యవహరిస్తున్నారు. ఒక్కమాటలో చెప్పాలంటే ఇదొక మొబైల్ టవర్. సెల్‌ఫోన్ నుంచి కాల్ మరొకరికి వెళ్లాలన్నా, ఇతరుల నుంచి మనకు రావాలన్నా అందుకు అవసరమైన సిగ్నల్స్ టవర్ నుంచి విడుదలవుతాయి. ఈ సిగ్నల్స్ కోసం బీఎస్ఎన్ఎల్‌తోపాటు అన్ని సర్వీసు ప్రొవైడర్లు పట్టణాలు, నగరాలు, గ్రామాల్లో పలు ప్రాంతాల్లో టవర్లను ఏర్పాటు చేశాయి. ఈ టవర్లు స్థిరంగా ఉండిపోతాయి. నగర నడిబొడ్డున ఉన్నా సిగ్నల్స్ సరిగా ఉండడం లేదని అనేక మంది సెల్‌ఫోన్ వినియోగదారులు నిత్యం గగ్గోలు పెడుతున్నారు. సిగ్నల్స్ విషయంలో అన్ని సర్వీసు ప్రొవైడర్ల పరిస్థితి ఒకేలా ఉందని విమర్శలు గుప్పిస్తున్న పరిస్థితులు ఉన్నాయి. అప్పటి వరకు ఫోన్ మాట్లాడుతున్నా కాసేపటికి కాల్ కట్ అయిపోతుంది. కొన్నిసార్లు నంబర్‌ను డయల్ చేసినప్పుడు ఫోన్ స్ర్కీన్‌పై కాలింగ్ అని చూపిస్తుంది. ఎంతసేపు అయినా కాల్ మాత్రం కనెక్ట్ అవ్వదు. దీనికి ప్రధాన

- మిగతా 4లో



## అమ్మవారి సన్నిధిలో సుప్రీంకోర్టు న్యాయమూర్తి

సుప్రీంకోర్టు న్యాయమూర్తి ప్రశాంత్ కుమార్ మిశ్రా దంపతులు ఆదివారం ఇంద్రకీలాద్రిపై అమ్మవారిని దర్శించుకున్నారు. వీరికి ఈవో కేఎస్ రామారావు, సిబ్బంది ఆలయ మర్యాదల అనంతరం వేద పండితులు ఆశీర్వచనం అందించారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం ఇచ్చి సత్కరించారు. - వన్‌టౌన్

## సజావుగా సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు



ఎస్ఆర్ఆర్ కాలేజీ వద్ద పరీక్షకు వెళుతున్న అభ్యర్థులు

యూనియన్ పబ్లిక్ సర్వీసు కమిషన్ (యూపీఎస్సీ) నేతృత్వంలో నగరంలో ఆదివారం సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు సజావుగా జరిగాయి. 25 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు పేపర్-1, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 4.30 గంటల వరకు పేపర్-2 పరీక్షలు జరిగాయి. - విజయవాడ

# విదేశాల్లో ఉద్యోగం.. 2.5 లక్షల జీతం..!

## 5 లక్షలిస్తే వీసా, టికెట్, ఉద్యోగ కల్పన బాధ్యత నాదే

'మీకు ఎలాంటి విద్యార్హత లేకపోయినా ఫర్వాలేదు. కెనడాలో మీకు ఉద్యోగం ఇప్పిస్తా. నెలకు రెండున్నర లక్షల జీతం. దీనికోసం మీరు చేయాల్సింది.. అక్కడ మీరు సంపాదించబోయే రెండు నెలల జీతాన్ని ముందుగా ఇక్కడ పెట్టుబడి పెట్టడమే" అంటూ ఓ కన్సల్టెన్సీ నిరుద్యోగులు, చిరు వ్యాపారులు, చేతి వృత్తుల వారికి ఆశలు కల్పించింది. కెనడా డాలర్లను ఆశగా చూపి వారి వద్ద నుంచి రూ.కోట్లలో వసూలు చేసి వారందరికీ కుచ్చుటోపి పెట్టింది. విజయవాడలోని ఓ కన్సల్టెన్సీ నిర్వాహకురాలి వలలో చిక్కుకున్న బాధితులు ఇప్పుడు లబోదిబోమంటున్నారు. ఆలస్యంగా వెలుగు చూసిన మాయలాడి నిర్వాకానికి సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి.

- కెనడాలో ఉద్యోగాల పేరిట ఓ కన్సల్టెన్సీ ఎర
- 50 మందికిపైగా నిరుద్యోగులకు కుచ్చుటోపీ
- నకిలీ సర్టిఫికెట్లు సృష్టించి బాధితులకే బెదిరింపు
- పోలీసులను ఆశ్రయించేందుకు సిద్ధమైన బాధితులు
- విజయవాడలో రూ.కోట్లు దండుకున్న నకిలీ కన్సల్టెన్సీ నిర్వాహకురాలు

గుంటూరు, జూన్ 16 : గతంలో విజయవాడ ఆటోనగర్‌లోని ఓ కన్సల్టెన్సీ ద్వారా కొంతమంది యువకులు విజిటింగ్ వీసాపై కెనడా వెళ్లి అక్కడే ఉద్యోగం చేస్తున్నారు. వారిని చూసి మరికొందరు కూడా కెనడా వెళ్దామని భావించి ఆటోనగర్‌లోని కన్సల్టెన్సీని సంప్రదించారు. ఆ కన్సల్టెన్సీలో భాగస్వామి అయిన ఓ యువతి బాధితులకు పరిచయమై.. కెనడాలో ఉద్యోగం ఇప్పిస్తానని వారందరికీ నమ్మకం కలిగించింది. అదే సమయంలో ఆ కన్సల్టెన్సీలో భాగస్వామితో విభేదాలు వచ్చి ఆమె బయటకు వచ్చేసింది. ఏలూరు రోడ్‌లో మరో కన్సల్టెన్సీ స్థాపించి వారందరినీ అక్కడకు పిలిపించుకుంది. గత డిసెంబరు నుంచి ఒక్కొక్కరి వద్ద ఐదు లక్షలు కట్టించుకుంది. ఉభయ గోదావరి, విజయనగరం, శ్రీకాకుళం జిల్లాల నుంచి గుంటూరు వరకు అనేకమంది ఆమెకు డబ్బులు కట్టారు. గుంటూరుకు చెందిన కే అనిల్ కుమార్ నుంచి రూ.5 లక్షలు కట్టించుకుంది. ఆమె సూచన మేరకు బ్రిటన్‌లో ఎమ్మెస్ చదువుతున్న అనిల్ కుమార్ అన్న కుమార్తెను కూడా చదువు మధ్యలోనే ఆపేసి స్వదేశానికి రప్పించారు. ఆ యువతి కూడా కన్సల్టెన్సీ నిర్వాహకురాలికి రూ.5 లక్షలు చెల్లించారు. మీకు వీసా వచ్చిందని, ఉద్యోగం కూడా రెడీగా ఉందని ఏప్రిల్ 25న కెనడా వెళ్లిపోవడమే అని నమ్మించింది. ఇందుకుగాను వారిరువురి పేరుతో ఒక్కొక్కరికి రూ.1.80 లక్షలతో విమాన టికెట్లు బుక్ చేసినట్లు నకిలీ టికెట్లు కూడా పంపింది. తక్షణం డబ్బులు చెల్లిస్తే టికెట్ బుక్ అవుతుందని.. లేదంటే వీసా కూడా రద్దవుతుందని భయపెట్టింది. నిజమేనని నమ్మిన బాధితులు మరో మూడున్నర లక్షలు ఆమెకు చెల్లించారు. అనంతరం వారు కెనడా వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకున్నారు. తీరా గడువు సమీపించే సమయానికి ఆమె మాట మార్చింది. సాంకేతిక సమస్య వచ్చిందని త్వరలోనే మీరు వెళ్లే తేదీని ఖరారు చేస్తానని కాలయాపన చేసింది. దీంతో బాధితులు తాము మోసపోయామని భావించారు. అదే సమయంలో వివిధ జిల్లాలకు సంబంధించిన నిరుద్యోగులు పెద్ద సంఖ్యలో ఈ కార్యాలయం చుట్టూ తిరుగుతుండడంతో వారందరూ కలిసి తమకు జరిగిన అన్యాయం గురించి చర్చించుకున్నారు. మోసపోయామని గ్రహించి రెండు రోజుల క్రితం ఏలూరు రోడ్‌లోని కన్సల్టెన్సీ కార్యాలయానికి వెళ్లి తమ డబ్బులు తిరిగిచ్చేయాలని డిమాండ్ చేశారు. కానీ, ఆమె వారిని తీవ్రస్థాయిలో బెదిరించింది. బాధితులే తనకు తప్పుడు సర్టిఫికెట్లు ఇచ్చి మోసం చేయబోయారంటూ విజయవాడ కమిషనర్, మాచవరం సీఐకి ఫిర్యాదు చేసినట్టుగా తయారు చేసిన ఫిర్యాదును అనిల్ కుమార్‌కు పంపి పరోక్షంగా బెదిరించింది. ఈ నకిలీ కన్సల్టెన్సీ నిర్వాహకుల చేతిలో మోసపోయిన వారిలో అత్యధిక మంది పేద, మధ్యతరగతి వర్గాలకు చెందిన వారే ఉన్నారు. ఇప్పుడు వారంతా లబోదిబోమంటున్నారు. విజయవాడ పోలీస్ కమిషనర్‌ను ఆశ్రయించేందుకు సిద్ధమయ్యారు. తమను మోసం చేసిన కన్సల్టెన్సీ నిర్వాహకురాలి నుంచి తమ సొమ్మును రికవరీ చేయాలని, లేని పక్షంలో ఆత్మహత్యలే శరణ్యమని బాధితులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ప్రపంచ స్కేటింగ్‌లో మెరిసిన తెలుగుతేజం 4లో..
గోమాతలకు విముక్తి.. • 200 గోవులను విడిపించిన వీహెచ్‌పీ

# గోమాతలకు విముక్తి..

**» 200 గోవులను విడిపించిన వీహెచ్‌పీ సభ్యులు**

బక్రీద్ సందర్భంగా బలి ఇవ్వడానికి నిర్బంధించిన సుమారు 200కు పైగా గోవులను ఆదివారం విశ్వ హిందూ పరిషత్ సభ్యులు విడిపించారు. గొల్లపూడి అట్కిన్‌సన్ స్కూల్ రోడ్డు చివర టర్నింగ్ వద్ద ఈ గోవులను నిర్బంధించారు. సమాచారం తెలుసుకున్న విశ్వహిందూ పరిషత్ గోరక్ష కార్యకర్తలు వాటిని విడిపించారు. - **విద్యాధరపురం**





# ప్రపంచ స్కేటింగ్‌లో మెరిసిన తెలుగుతేజం

**విజయవాడ స్పోర్ట్స్, జూన్ 16 :** న్యూజిలాండ్‌లో జరిగిన ప్రపంచ ఓషియానిక్ రోలర్ స్కేటింగ్ పోటీల్లో విజయవాడ స్కేటింగ్ క్రీడాకారిణి, తెలుగు తేజం మాత్రపు జెస్సీరాజ్ స్వర్ణంతో మెరిసింది. 13 ఏళ్ల వయస్సులోనే దేశంలో నెంబర్-1 స్కేటర్‌గా పేరొందిన జెస్సీరాజ్ భారత్‌కు ప్రాతినిధ్యం వహించింది. పసిఫిక్ కప్ ఆర్టిస్టిక్ ఓపెన్ ఇన్విటేషనల్ కాంపిటేషన్ పేరుతో ఈ పోటీలను నిర్వహించగా, రెండు రౌండ్లలో జెస్సీరాజ్ 31.98 పాయింట్లతో బంగారు పతకాన్ని వశం చేసుకుంది. భారత్‌తో పాటు ఆస్ట్రేలియా, బ్రెజిల్, చైనా, ఐర్లాండ్, జపాన్, న్యూజిలాండ్ దేశాల క్రీడాకారులు బరిలో దిగారు. విజయవాడ ఎస్ఎస్ఎం స్కూల్‌లో 9వ తరగతి చదువుతున్న జెస్సీరాజ్ పతకం సాధించడంపై ఆంధ్రప్రదేశ్ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ కార్యదర్శి థామస్ చౌదరి, కోచ్ సింహాద్రిలు అభినందించారు.



స్వర్ణం సాధించిన రోలర్ స్కేటర్ జెస్సీరాజ్



# ఇంద్రకీలాద్రికి పోటెత్తిన భక్తులు

**» దుర్గమ్మను దర్శించుకున్న ప్రముఖులు**

**» ఆదివారం ఆదాయం రూ.54.09 లక్షలు**

**వన్‌టౌన్, జూన్ 16 :** దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో ఆదివారం భక్తులు అధిక సంఖ్యలో దుర్గమ్మవారిని దర్శించుకున్నారు. ఆదివారం సందర్భంగా దుర్గమ్మ ఆలయం కిటకిటలాడింది. వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అమ్మవారి దర్శనానికి విచ్చేశారు. భక్తుల రద్దీ దృష్ట్యా ఈవో కేఎస్ రామారావు, ఇతర అధికారులు, సిబ్బంది భక్తులు ఒత్తిడికి గురికాకుండా చర్యలు తీసుకున్నారు. భక్తులకు సమాచారమందించడంలో వేగం, నాణ్యత ఉండాలని సూచించారు.

ఆదివారంసాయంత్రం 6.30 గంటల వరకు అమ్మవారికి వచ్చిన ఆదాయ వివరాలను దేవస్థానం ప్రకటించింది. రూ.33.50 లక్షలు దర్శనం టికెట్ల ద్వారా, మొత్తంగా రూ.54,09,493లు ఆదాయం వచ్చినట్టు తెలిపారు. రూ.500 టికెట్ రుసుం ద్వారా 3236 మంది భక్తులు దర్శించుకోగా రూ.16,18,000, రూ.300 టికెట్ ద్వారా 2755మంది దర్శించుకోగా రూ.8,26,500లు, రూ.100 టికెట్ ద్వారా 9013 మంది దర్శించుకోగా రూ.9,01,300 ఆదాయం సమకూరింది. 4936 మంది భక్తులు తలనీలాలను సమర్పించారు. 68,749 లడ్డూ ప్రసాదాన్ని విక్రయించగా 29,853 పులిహోర ప్రసాదాలను విక్రయించారు. విరాళాల ద్వారా రూ.2,07,780 ఆదాయం సమకూరింది. శనివారం మొత్తంగా రూ.33,39,481 రూపాయలు, శుక్రవారం నాడు 39,74,194 రూపాయలు ఆదాయం సమకూరింది.



దుర్గమ్మను దర్శించుకున్న పి.నారాయణ దంపతులు, మంత్రి సత్యకుమార్

**అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు..**

దుర్గమ్మవారిని ఆదివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్, రాష్ట్ర మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ, అమ్మవారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. వీరికి ఈవో కేఎస్ రామారావు, సిబ్బంది ఆలయ మర్యాదలను అందజేసి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు వేదాశీర్వచనంచేశారు. అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.

**అమ్మవారికి 59 గ్రాముల బంగారు హారం కానుక..**



ముంబాయికి చెందిన అహిల్యా వసంతరావు పాటిల్ ఆయన కుటుంబసభ్యులు ఆదివారం ఆలయానికి విచ్చేసి దుర్గమ్మ వారి అలంకరణ నిమిత్తం 59 గ్రాముల బంగారు హారాన్ని అందజేశారు.

ధర్మపదం వేదికపై ఆదివారం తెనాలికి చెందిన శ్రీలక్ష్మి కూచిపూడి నృత్యకళాకేంద్రం వారిచే కూచిపూడి నృత్యాభినయనం కన్నుల విందుగా సాగింది. ఎ.వెంకటలక్ష్మి ఆధ్వర్యంలో కళాకారుల బృందం కీర్తనలకు చక్కని అభినయం చేసి అహుతులను అలరించారు.



స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు కరికల్ వలవెన్‌కు అందజేస్తున్న ఈవో

## సుబ్బారాయుడిని దర్శించుకున్న రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ

**మోపిదేవి, జూన్ 16 :** మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్పెషల్ చీఫ్ సెక్రటరీ (రెవెన్యూ అండ్ ఎండోమెంట్) ఆర్.కరికల్ వలవెన్ కుటుంబసమేతంగా ఆదివారం దర్శించుకున్నారు. తొలుత నాగ పుట్ట వద్ద పాలు పోసి స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ డిప్యూటీ కమిషనర్, కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు నల్లం సూర్యచక్రధరరావు వారిని ఆలయ మర్యాదలతో ఘనంగా సత్కరించి స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.

## గులాబీల అలంకరణలో తిరుపతమ్మ అమ్మవారు



**పెనుగంచిప్రోలు, జూన్ 16 :** తిరుపతమ్మ ఆలయం ఆదివారం తెలుగు రాష్ట్రాలకు చెందిన భక్తులతో పోటెత్తింది. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు ఆలయ పరిసరాలతో పాటు మునేటి అవతల వైపున గల మామిడి తోటలన్నీ భక్తులతో కిటకిటలాడాయి. మునేటి కాసులపై భక్తుల వాహనాలతో నిండిపోయింది. దీంతో ఎస్ఐ పి.రాంబాబు స్వయంగా సిబ్బందితో పోలీస్ స్టేషన్ సెంటర్ మునేటి అవతల వైపున ప్రత్యేక బందోబస్తు నిర్వహించి ప్రయాణీకులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నారు. గులాబీ పూలతో ప్రధాన అర్చకుడు మరేబోయిన గోపిబాబు ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు సుందరంగా అలంకరణ చేశారు. గులాబీల అలంకరణలో అమ్మవారిని భక్తులు పెద్ద సంఖ్యలో దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఆలయ అధికారులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

## సెంట్రల్ జోన్ వన్డే చాంప్ ప్రకాశం

**విజయవాడ స్పోర్ట్స్, జూన్ 16 :** మూలపాడు ఏసీఏ క్రికెట్ స్టేడియం వేదికగా జరుగుతున్న ఏసీఏ సెంట్రల్ జోన్ పురుషుల అండర్-23 వన్డే క్రికెట్ మ్యాచ్‌ల్లో ప్రకాశం జిల్లా టీమ్ మెరుగైన రన్‌రేట్‌తో చాంపియన్‌గా నిలిచింది. ఆదివారం గుంటూరు-కృష్ణా జట్ల మధ్య మ్యాచ్ జరిగింది. తొలుత కృష్ణా జట్టు 50 ఓవర్లలో 291/9 పరుగులు చేసింది. పీవీ దుర్గారావు(78) ఖాజా మొహిద్దీన్(67) అర్ధసెంచరీలతో రాణించారు. అనంతరం గుంటూరు జట్టు 46.5 ఓవర్లలో 265 పరుగులకు కుప్పకూలింది. దీంతో మూడు జట్లు మూడేసి మ్యాచ్‌లు ఆడి రెండేసి విజయాలతో ఎనిమిది పాయింట్లతో నిలవగా మెరుగైన రన్‌రేట్(1.86)తో ప్రకాశం చాంపియన్ నిలవగా, గుంటూరు (0.85)రెండోస్థానంలోను, కృష్ణా(0.37) మూడో స్థానంలో నిలిచాయి.

# ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తా..

**» అభయాంజనేయుడి సేవలో మంత్రి పార్థసారథి**



జంక్షన్‌లో అభయాంజనేయస్వామిని దర్శించిన మంత్రి పార్థసారథి

**హనుమాన్‌జంక్షన్, జూన్ 16 :** ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో ప్రజల ఆకాంక్షలను నెరవేర్చడానికి కృషి చేస్తామని గృహనిర్మాణ, సమాచారశాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. ప్రమాణ స్వీకారం అనంతరం ఆదివారం నూజివీడు వెళుతూ మార్గమధ్యలో జంక్షన్‌లోని అభయాంజనేయ ఆలయాన్ని సందర్శించారు. అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. ప్రధాన అర్చకులు మారేపల్లి సీతారామానుజాచార్యులు ఆలయ మర్యాదలతో స్వామి చిత్రపటాన్ని అందించి ఆశీస్సులు అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కూటమి ప్రభుత్వం ద్వారా ప్రజల ఆశయాలను నెరవేర్చడానికి కృషి చేస్తామన్నారు. మంత్రికి బాపులపాడు, నూజివీడు, పెదపాడు మండలాల నుంచి పెద్ద ఎత్తున టీడీపీ, జనసేన నాయకులు, కార్యకర్తలు ఘనంగా స్వాగతం పలికారు.

## చంద్రబాబును కలిసిన కొనకళ్ల



**మచిలీపట్నం టౌన్ :** కూటమి ప్రభుత్వం తాజా రాజకీయ పరిస్థితులపై సీఎం చంద్రబాబుతో కలిసి చర్చించినట్టు మాజీ ఎంపీ, టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు కొనకళ్ల నారాయణ పేర్కొన్నారు. ఆదివారం చంద్రబాబును కొనకళ్ల మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ సందర్భంగా నూతన ప్రభుత్వంపై ప్రజల మనోభావాలు అడిగారన్నారు. కృష్ణాజిల్లా పరిధిలోని ఏడు నియోజక వర్గాలు గెలుపొందడం పట్ల చంద్రబాబు సంతోషం వ్యక్తం చేసారన్నారు. కొనకళ్ల బుల్లయ్య తదితరులు చంద్రబాబును కలిసారు.

**దేవినేని ఉమాను కలిసిన మంత్రులు**



**గొల్లపూడి :** మాజీమంత్రి దేవినేని ఉమామహేశ్వరరావును గొల్లపూడిలోని ఆయన నివాసంలో ఆదివారం రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి, బీసీ సంక్షేమం, హ్యాండ్లూమ్ అండ్ టెక్స్‌టైల్స్‌శాఖా మంత్రి ఎస్.సవితలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన వారిని ఘనంగా సత్కరించి ప్రత్యేక అభినందనలు తెలిపారు.

## రైతు సమస్యలపై దృష్టి సారించాలి

**» మంత్రి అచ్చెన్నాయుడికి గోపు సత్యనారాయణ వినతి**



**మచిలీపట్నం టౌన్, జూన్ 16 :** వైసీపీ పాలనలో అన్నదాతలు ఎన్నో అవస్థలు పడ్డారని, రైతుల సమస్యలపై దృష్టి సారించాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశుసంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడిని కలిసి టీడీపీ కృష్ణాజిల్లా తెలుగురైతు అధ్యక్షుడు గోపు సత్యనారాయణ విన్నవించారు. ఆదివారం మంత్రిని మర్యాదపూర్వకంగా కలిసి రైతు సమస్యలపై చర్చించారు. చంద్రబాబు అధికారంలోకి రావడంతో రైతులు సంతోషంతో ఉన్నారన్నారు. రైతులకు సబ్సిడీపై వరి వంగడాలు, ఖరీఫ్ రుణాలు సకాలంలో అందించాలన్నారు. మంత్రిని కలిసిన వారిలో తెలుగురైతు రాష్ట్ర అధ్యక్షుడు మారెడ్డి శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రం సబ్సిడీలను దిగమింగిన వైసీపీ

**» ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు**

**గుణదల, జూన్ 16 :** ఉమ్మడి కృష్ణా జిల్లా మెట్ట ప్రాంతంలో వేలాది ఎకరాల్లో పామాయిల్ సాగు చేసిన రైతులకు కేంద్రం ఇచ్చిన సబ్సిడీలను సైతం వైసీపీ మింగేసిందని సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు ఆళ్ల గోపాలకృష్ణారావు ఆరోపించారు. కరెన్సీనగర్లోని వ్యవసాయశాఖ క్యాంపు కార్యాలయంలో ఆదివారం మంత్రి అచ్చెన్నాయుడును రైతు సంఘాల నాయకులతో కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతులకు వైసీపీ ప్రభుత్వం డ్రిప్, స్ప్రింక్లర్ ఇరిగేషన్‌కు కేంద్రం రైతులకు ఇచ్చిన సబ్సిడీలను కూడా దిగమింగేశారని ఆవేదన వ్యక్తం చేశారు. కూటమి ప్రభుత్వంలో ఆ తప్పిదం జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో కృష్ణా తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీ మాజీ ఛైర్మన్ గుత్తా శివరామకృష్ణ, కృష్ణా పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటి మాజీ ఛైర్మన్ మైనేని మురళీకృష్ణ, నాగార్జున సాగర్ ఎడమ కాలువ ప్రాజెక్ట్ కమిటి మాజీ ఛైర్మన్ ఎనమద్ది పుల్లయ్య చౌదరి తదితరులు అచ్చెన్నాయుడును కలిసి పూలమాల, దుశ్శాలువాతో సత్కరించారు.

## రాష్ట్రాన్ని అభివృద్ధిపథంలో నడిపిద్దాం : రవీంద్ర

**మచిలీపట్నం టౌన్ :** కూటమి అభ్యర్థులు సమన్వయతో రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలని రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు.రవీంద్ర ఇంటి వద్ద ఆదివారం విజయవాడ వెస్ట్ ఎమ్మెల్యే సుజనాచౌదరి కలిశారు. ఈ సందర్భంగా రవీంద్ర మాట్లాడుతూ, చంద్రబాబు, పవన్‌కళ్యాణ్, మోదీల నాయకత్వంలో రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి కావలసిన నిధులు తీసుకురావడంలో ఎంపీ బాలశౌరి సహాయ సహకారాలు అందుతాయన్నారు. చంద్రబాబు హయాంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి జరుగుతుందన్నారు. అమరావతికి పూర్వవైభవం తెస్తామన్నారు.



కార్యవర్గ సమావేశంలో మాట్లాడుతున్న ఎస్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

## రాష్ట్ర ప్రభుత్వానికి పూర్తి సహకారం

**- ఎస్టీయూ**

**గుడివాడ, జూన్ 16 :** గత ఐదేళ్ల వైసీపీ పాలనలో పాఠశాలల్లో అనేక అస్తవ్యస్త పరిస్థితులు నెలకొన్నాయని, నూతన ప్రభుత్వం విద్యారంగాన్ని గాడిలో పెట్టాల్సిన అవసరం ఎంతో ఉందని, దీనికి పూర్తిస్థాయిలో సహకారం అందిస్తామని ఎస్టీయూ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్.సాయి శ్రీనివాస్ ప్రకటించారు. ఆదివారం స్థానిక కార్యాలయంలో జిల్లా శాఖ ప్రథమ కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆయన మాట్లాడుతూ, గత ప్రభుత్వం తెచ్చిన జీవో 117 వలన ప్రాథమిక పాఠశాలలు కనుమరుగయ్యే ప్రమాదం ఏర్పడిందన్నారు. సదరు జీవోను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. పాఠశాల విద్యారంగాన్ని చక్కదిద్దుతానని మంత్రి నారా లోకేశ్ ప్రకటించారని, ఉద్యోగ, ఉపాధ్యాయ సమస్యలపై త్వరలో సమావేశం నిర్వహిస్తామని ప్రకటించిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు ధన్యవాదాలు తెలిపారు. ఉపాధ్యాయులకు 2011 పీఆర్సీలో ఉన్న లక్షలాది రూపాయల బకాయిలు, ఐదేళ్లలో పెండింగ్‌లో ఉన్న డీఏ బకాయిలు, శెలవు బకాయిలు విషయమై నూతన ప్రభుత్వం సానుకూల దృష్టితో పరిష్కరించాలని కోరారు. గత ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులపై కక్షపూరితంగా వ్యవహరించిందని, తమ పోరాటాలు, ఉద్యమాలు కేవలం సమస్యల పరిష్కారానికేనని, విధానపరమైన నిర్ణయాలపై మాత్రమే ఉంటుందన్నారు. ఏకోపాధ్యాయ పాఠశాలలను వెంటనే ఇద్దరు ఉపాధ్యాయుల ఉండే విధంగా ఏర్పాటు చేయాలని, బోధనారంగంలో తీవ్ర ఒత్తిడి కలుగజేస్తున్న యాప్‌లను తగ్గించాలని, బోధనేతర పనులను తొలగించాలని, ఏపీజీఎల్ఐ సమస్యలను పరిష్కరించాలని తదితర తీర్మానాలను ఆమోదించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పి.ఇమ్మానియేల్, ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, రాష్ట్ర అదనపు ప్రధాన కార్యదర్శి ప్రసాద్, సీపీఐ జిల్లా కార్యదర్శి తాతయ్య, జిల్లా ఆర్థిక కార్యదర్శి మాధవరావు, రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు రాజశేఖర్, ఎ.ఎస్.వి ప్రసాద్, మూర్తి, పలు మండలాల అధ్యక్షకార్యదర్శులు, జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

# వృద్ధుల జీవితానికి భరోసా కల్పిద్దాం

**» ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ దిల్లీరావు**

**ధర్నాచౌక్ ,జూన్ 16:** వృద్ధుల శారీరక, మానసిక ఆరోగ్యానికి, ఆర్థిక భద్రతకు సమాజంలోని ప్రతీ ఒక్కరూ కలిసి పని చేయల్సిన అవశ్యత ఉందని కలెక్టర్ ఢిల్లీరావు పేర్కొన్నారు. ప్రభుత్వాలు,స్వచ్ఛంద సంస్థల భాగస్వామ్యంతో వారి గౌరవప్రదమైన జీవితానికి భరోసా కల్పిద్దామని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ వృద్ధులపై వేధింపుల నివారణ అవగాహన దినోత్సవ కార్యక్రమం గాంధీనగర్‌లోని ప్రముఖ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వయోవృద్ధుల సంక్షేమ చట్టం- 2007, వయోవృద్ధుల సంక్షేమ కార్యక్రమాలపై అవగాహన కల్పించి వాటిని సద్వినియోగం చేసుకోనేలా చూడాలన్నారు. వేధింపులకు సంబంధించి ఫిర్యాలుపై డివిజన్ స్థాయిలో సత్వర పరిష్కారానికి కృషి చేస్తున్నట్టు తెలిపారు. వృద్ధులపై వేధింపుల ఘటనలు చోటుచేసుకోవడంపై ఆవేదన వ్యక్తం చేశారు. వేధింపులకు అడ్డుకట్ట వేయాలన్నారు. నైతిక విలువలతో కూడిన విద్యను అందించడం ద్వారా మెరుగైన సమాజం నిర్మితమవుతుందన్నారు. ఎన్టీఆర్ జిల్లా సీనియర్ సిటిజన్స్ వుల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షుడు వేమూరు బాబూరావు, కార్యదర్శి, మోతుకూరి వెంకటేశ్వరరావు, హెల్పేజ్ ఇండియా ప్రతినిధి లంకపల్లి మృణాల్, బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కే.చంద్రమౌళి, వయోవృద్ధు సంక్షేమ శాఖ ఏడీ.వి.కామరాజు, వాసవ్య మహిళా మండలి అధ్యక్షురాలు డాక్టర్ కీర్తి, డాక్టర్ సీఎల్ వెంకటరావు, సీవీ.బాబు, ప్రజా కళాకారులు పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.





సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ దిల్లీరావు



## వేదాద్రి నరసింహస్వామికి మొక్కుబడుల చెల్లింపు

**జగ్గయ్యపేట, జూన్ 16 :** రాష్ట్రంలో టీడీపీ అధికారంలోకి వస్తే వేదాద్రి యోగానంద లక్ష్మీ నరసింహస్వామిని నడిచి వెళ్లి దర్శించుకుంటానని జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య సతీమణి శ్రీదేవి మొక్కును ఆదివారం చెల్లించుకున్నారు. ఆదివారం ఉదయం స్వయంభూ విఘ్నేశ్వరస్వామి దేవస్థానం నుంచి ఆమె పూజలు చేసి పాదయాత్రను ప్రారంభించారు. కాలినడకన వేదాద్రి చేరుకున్నారు. ఆమెకు సంఘీభావంగా కిట్టు, సిద్దూ పలువురు టీడీపీ మహిళా నేతలు, కౌన్సిలర్లు యాత్రలో పాల్గొన్నారు. వేదాద్రిలో యోగానంద లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని పూజలు చేశారు.

## దరఖాస్తుల ఆహ్వానం

**గవర్నర్‌పేట, జూన్ 16 :** గురుపౌర్ణమి పురస్కరించుకుని జూలై 14న గురువులకు వందనం పేరుతో నిర్వహించే గురుబ్రహ్మ, గురు శిరోమణి పురస్కారాల ఎంపికకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సాహిత్య, సామాజిక, సాంస్కృతిక సేవా సంస్థ సర్వేజనా సుఖినో భవంతు (హైదరాబాద్) వ్యవస్థాపక అధ్యక్షుడు లయన్ డాక్టర్ ఈఎస్ఎస్ నారాయణ మాష్టారు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్య, వైద్యం, సాహిత్యం, సంగీతం, నృత్యం, కళలు, క్రీడలు, కరాటే, ఆధ్యాత్మికం, నాటక రంగం, టీవీ, సినీ రంగాలలో సేవలు అందిస్తున్న ప్రతిభావంతులైన గురువులకు పురస్కారాలు అందజేస్తామన్నారు. ఆసక్తి ఉన్న గురువులు ఈనెల 25వ తేదీలోపు తమ ప్రతిభను తెలియజేసే సర్టిఫికెట్లు, ఫోటోలు, పత్రికల క్లిప్పింగ్స్ జిరాక్స్ కాపీలు, 4 పాస్‌పోర్టు సైజు ఫోటోలను దరఖాస్తుకు జతచేసి కార్యాలయానికి పంపాలని కోరారు. వివరాలకు 96523 47207 నెంబరులో సంప్రదించాలని కోరారు.

# దీక్ష విరమించిన దండమూడి

**» జగన్ పాలనకు నిరసనగా నల్లచొక్కా**

**» 2023 నుంచి నల్లచొక్కాతోనే దండమూడి**



**(విజయవాడ - ఆంధ్రజ్యోతి)** వైఎస్ జగన్ రెడ్డి టీడీపీ శ్రేణులపై సాగిస్తున్న దమనకాండను నిరసిస్తూ నల్లచొక్కా ధరించిన కృష్ణా జిల్లా తెలుగు యువత అధ్యక్షుడు దండమూడి చౌదరి ఎట్టకేలకు దీక్ష విరమించారు. టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబు చేతుల మీదుగా పసుపు చొక్కా తీసుకుని ధరించి తన నిరసనను విరమించారు. వైసీపీ పాలనను నిరసిస్తూ 2023 జనవరిలో దండమూరి నల్లచొక్కా ధరించి దీక్షను ప్రారంభించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో వైసీపీ సర్కారు కూలిపోయి టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఎట్టకేలకు ఏడాదిన్నర తర్వాత దండమూడి తన నల్లచొక్కా దీక్షకు స్వస్తి పలికారు. శనివారం సీఎం చంద్రబాబును కలిసి ఆయన చేతుల మీదుగా పసుపు చొక్కా స్వీకరించి ధరించారు.

# సిగ్నల్స్ కామధేనువు

(3వ పేజీ తరువాయి)

సమస్య సిగ్నల్స్ లేకపోవడమేనని సెల్ యూజర్లకు తెలిసిన విషయమే

**సిగ్నల్స్ జాం**

నగరంలో రహదారులపై ట్రాఫిక్ స్తంభించిపోయినట్టే సెల్‌టవర్ల నుంచి వెలువడే సిగ్నల్స్ స్తంభించిపోతారు. దీనికి ప్రధాన కారణం ఎక్కువ మంది ఒకేచోట ఉండడమేనని బీఎస్ఎన్ఎల్ వర్గాలు చెబుతున్నాయి. ఈ సమస్యలు ఎక్కువగా జాతరలు జరిగినప్పుడు, బహిరంగ సభలు నిర్వహించినప్పుడు, ట్రాఫిక్‌లో వాహనాలను ఎక్కువ సమయం ఆగినప్పుడు వస్తాయని స్పష్టం చేస్తున్నారు. ఒక్కో సెల్‌టవర్ సామర్థ్యం (బ్యాండ్ విడ్త్) 100 ఎంబీ ఉంటుంది. ఈ సామర్థ్యం ఉన్న టవర్ 10వేల సెల్‌ఫోన్లకు సిగ్నల్స్‌ను ప్రసారం చేస్తుంది. దీనికి మించిన సెల్‌ఫోన్లు ఆ ప్రాంతంలో ఉన్నప్పుడు సిగ్నల్స్ జామ్ అవుతాయి. దీనితో కొంతమందికి సిగ్నల్స్ అందవు. మరికొంతమంది సిగ్నల్స్ అందినా కాల్‌బ్రేక్‌లు అవుతాయి. ప్రముఖుల సభల్లో ఎక్కువగా ఇలాంటి పరిస్థితులు ఉత్పన్నమవుతుండడంతో బీఎస్ఎన్ఎల్ కౌను తీసుకొచ్చింది. ఇదొక మొబైల్ టవర్. ఇది జనరేటర్ మాదిరిగా ఉంటుంది. ఈ వాహనంపై విద్యుత్ సరఫరా చేసే క్యాబిన్ ఉంటుంది. టవర్ యాంటీనా విడిభాగాలుగా ఉంటుంది. అవసరమైనచోటకు ఈ వాహనాన్ని తీసుకెళ్లి యాంటీనాను బిగిస్తారు. ఈ యాంటీనా ఎత్తు ఆరు నుంచి ఏడు అడుగుల వరకు ఉంటుంది. ఇటువంటి కౌలు బీఎస్ఎన్ఎల్ వద్ద తిరుపతి, నెల్లూరు, విశాఖపట్నంలో ఉన్నాయి. ఎన్నికల ప్రచారంలో రాయలసీమలో కూటమి నిర్వహించిన సభల్లో ప్రధాని మోదీ పాల్గొన్నప్పుడు ఈ కౌ సేవలను వినియోగించారు. ఇటీవల జరిగిన చంద్రబాబు ప్రమాణ స్వీకార కార్యక్రమానికి తిరుపతిలో ఉన్న కౌను కేసరపల్లికి తీసుకొచ్చారు.



మాట్లాడుతున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు

## రాష్ట్రాభివృద్ధిలో సంపూర్ణ సహకారం

**- ఉద్యోగుల సంఘం నేతలు**

**వన్‌టౌన్, జూన్ 16 :** రాష్ట్రాభివృద్ధిలో ప్రభుత్వానికి పూర్తి సహకారం అందిస్తామని ప్రభుత్వ నాలుగవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.మల్లేశ్వరావు, ప్రధాన కార్యదర్శి తోట చిన్నప్పలు స్పష్టం చేశారు. విజయవాడ లెనిన్ సెంటర్‌లోని రెవెన్యూ భవన్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. సమావేశానికి అధ్యక్షత వహించిన మల్లేశ్వరరావు మాట్లాడుతూ, ఉద్యోగుల సమస్యల పరిష్కారంతో పాటు రాష్ట్రప్రభుత్వానికి అభివృద్ధిలో పూర్తిగా సహకరిస్తామని సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించినట్టు చెప్పారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న అమరావతి జేఏసీ ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, ఉద్యోగుల ఆర్థిక, ఆర్థికేతర సమస్యలను వీలైనంత త్వరగా కొత్త ప్రభుత్వం పరిష్కరిస్తుందన్న నమ్మకం ఉందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం చేపట్టే అన్ని అభివృద్ధి కార్యక్రమాలకు ఉద్యోగుల పక్షాన సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు ఈ.సుబ్రహ్మణ్యం, రాష్ట్ర ఉపఅధ్యక్షుడు ఎస్.సుబ్రహ్మణ్యం, సహ అధ్యక్షుడు మద్దిలేటి, కోశాధికారి శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



## మాజీమంత్రి జోగి రమేశ్ ఇంటిపై రాళ్ల దాడి

**ఇబ్రహీంపట్నం , జూన్ 16 :** ఇబ్రహీంపట్నంలోని మాజీమంత్రి జోగి రమేశ్ ఇంటిపై గుర్తుతెలియని వ్యక్తులు ఆదివారం కారులో వచ్చి రాళ్ల దాడి చేశారు. కారు దిగిన ఇద్దరు వ్యక్తులు ఇంటిపై రాళ్లు విసురుతూ మాజీమంత్రిని 'రారా.. బయటకు రా..' అంటూ అరిచారు. అక్కడున్న కానిస్టేబుల్ వారిని వారించారు. పట్టరాని కోపంతో ఉన్నవారు కానిస్టేబుల్‌పై కూడా తిరగబడే ప్రయత్నం చేశారు. ఆ సమయంలో మాజీమంత్రి కానీ, ఆయన కుటుంబ సభ్యులు కానీ ఇంట్లో లేరు. కాగా, దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని వైసీపీ నేతలు డిమాండ్ చేస్తున్నారు.



## విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు ప్రదానం

**గవర్నర్‌పేట, జూన్ 16 :** బందరు లాకుల సెంటర్‌లోని స్వాతంత్ర్య సమరయోధుల భవన్‌లో ఆదివారం మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ పదవ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చిన 15 ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందజేసింది. పాఠశాల స్థాయిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతితో పాటు మెమొంటోలు, ధ్రువీకరణ పత్రాలు అందజేశారు. సంస్థ చైర్మన్ ఎం.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు పి.వీరశేషగిరిరావు, ఉపాధ్యక్షుడు వి.బాబూరావు, కార్యదర్శి దావులూరు సాంబశివరావు, సంస్థ ప్రతినిధులు చెరుకూరి బాబు, కృష్ణారెడ్డి, మోతుకూరి వెంకటేశ్వరరావు, సత్యానందం పాల్గొన్నారు.



# టీడీపీతోనే ప్రజాపాలన

**ఎమ్మెల్యే బొండా ఉమా**

**అజిత్‌సింగ్‌నగర్, జూన్ 16:** తెలుగుదేశం పార్టీతోనే ప్రజాపాలన సాధ్యమని, ఎన్నికల్లో ఇచ్చిన హామీల అమలుకు సీఎం చంద్రబాబు శ్రీకారం చుట్టారని ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అన్నా క్యాంటీన్లు పునరుద్ధణ చేస్తున్న సందర్భంగా టీడీపీ సెంట్రల్ నేతలు అజిత్‌సింగ్‌నగర్‌లోని సెయింట్ ఆన్స్ స్కూల్ అన్నా క్యాంటీన్ వద్ద ఆదివారం పేదలకు భోజనం ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఉమా ముందుగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు భోజనం అందజేశారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపేందుకు సీఎం చంద్రబాబు బృహత్తర ప్రణాళికతో ముందుకెళ్తున్నారన్నారు. నేతలు ఎరుబోతు రమణారావు, పైడి శ్రీను, నవనీతం సాంబశివరావు పాల్గొన్నారు.

**సేవా కార్యక్రమాలకు సహకారమందిస్తా..**

**మొగల్రాజపురం :** ప్రజలకు సేవ చేసే ఉద్దేశంతో ఏర్పాటు చేసే వైద్య శిబిరాలకు గానీ, ఇతరత్రా సేవా కార్యక్రమాలకు తన వంతు సాయం ఎప్పుడూ ఉంటుందని ఎమ్మెల్యే బొండా ఉమా అన్నారు. ది కృష్ణాజిల్లా ఆటో ఫైనాన్సియర్స్ అసోయేషన్ స్వర్ణోత్సవ వేడుకల సందర్భంగా మొగల్రాజపురం ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్ హాలులో ఆదివారం ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలనలో ఆరోగ్యశ్రీ కింద కూడా పేదలకు వైద్య సేవలు అందించలేని దుస్థితి ఉందని చెప్పారు. తెలుగుదేశం పాలనలో పేద ప్రజల ఆరోగ్యానికి ఎటువంటి ఢోకా ఉండదని హామి ఇచ్చారు. అనంతరం గోల్డెన్ జూబిలీ ఉత్సవాల కమిటీ చైర్మన్ విజికె ప్రసాద్, అసోసియేషన్ అధ్యక్షులు ఎస్. జయప్రకాష్ నారాయణ మాట్లాడుతూ తమ సంఘం పుట్టి 50 సంవత్సరాలైన సందర్భంగా ఈ వైద్య శిబిరం ద్వారా 500 మందికి వైద్య పరీక్షలు, ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నామని చెప్పారు. ఈ వేడుకలు మూడు రోజుల పాటు జరుగుతాయని దీనిలో బాగంగా 19వ తేది రహదారి భద్రతా అవగాహన సదస్సు నిర్వహిస్తామన్నారు. 22వ తేదీ మురళీ ఫార్ట్యూన్ హోటల్‌లో స్వర్ణోత్సవ వేడుకలు జరుగుతాయాన్నారు. ఎమ్మెల్యే బొండా ఉమా వైద్య శిబిరాన్ని సందర్శించి వైద్యులు చేస్తున్న వైద్య పరిక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ ఆఫ్ ఫైనాన్స్ అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్ రాధాకృష్ణ, కోనేరు బసవేశ్వరరావు, బొబ్బ నారాయణరావు, వల్లూరి నాగార్జున, యార్లగడ్డ సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.



జ్ఞాపికతో బొండా ఉమాను సత్కరిస్తున్న అసోసియేషన్ సభ్యులు

## వృద్ధులకు నిత్యావసరాలు

**మొగల్రాజపురం, జూన్ 16 :** దీవెన ఫౌండేషన్ ద్వారా నిరుపేద వృద్ధులకు 2 నెలలకు సరిపడా నిత్యావసరాలను కానిస్టేబుల్ దేవయ్య ఆదివారం అందజేశారు. సిద్ధమ్మ, అంజమ్మ అనే వృద్ధులు ఏ పనిచేయలేని దుస్థితిలో ఉండటం, తినడానికి కూడా సరుకులు లేక దీనస్థితిలో ఉండటంతో సిటీ పోలీస్ తరుపున దీవెన ఫౌండేషన్ సభ్యులతో కలిసి 3 టౌన్ కానిస్టేబుల్ దేవయ్య వృద్ధుల ఇంటికి వెళ్లి సరుకులు అందించారు.

## వైవీబీకి పాస్టర్ల అభినందన



వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను అభినందిస్తున్న పాస్టర్లు

**ఉయ్యూరు, జూన్ 16 :** రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన సందర్భంగా పెనమలూరు నియోజకవర్గ చర్చి పాస్టర్లు మాజీ ఎమ్మెల్సీ టీడీపీ రాష్ట్ర ఉపాధ్య క్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్‌ను ఆదివారం కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వ పాలనలో రాష్ట్రంలో అభి వృద్ధి కుంటుపడటంతో ఎన్నికల్లో ప్రజలు కూటమి అభ్యర్థులను భారీ మెజారిటీతో గెలిపించి చంద్ర బా బును ముఖ్యమంత్రిని చేశారన్నారు. పాస్టర్ల సంఘం నాయకుడు రాజేశ్ తదితరులు పాల్గొని రాజేంద్ర ప్రసాద్‌ను సత్కరించి అభినందనలు తెలిపారు.

## ద్వారకా తిరుమలకు తెలుగు మహిళలు

**ఉంగుటూరు :** టీడీపీ కూటమి ఘన విజయం సందర్భంగా వేమండ గ్రామానికి చెందిన టీడీపీ సీనియర్ నాయకుడు తోట నాగభూషణం సౌజన్యంతో, టీడీపీ మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ ఆధ్వర్యంలో సుమారు 20మంది తెలుగు మహిళలు, ద్వారకా తిరుమలకు బయలుదేరి వెళ్లారు.



జలమయమైన ఐదో నెంబర్ రోడ్డు

## వర్షంతో రోడ్లు జలమయం

**భారతీనగర్, జూన్ 16 :** అకాల వర్షానికి మూడు, నాలుగు డివిజన్‌లోని కాలనీల ప్రధాన, అంతర్గత,రోడ్లతోపాటు పలు సర్వీస్ రోడ్లు జలమయమయ్యాయి. ఆదివారం సాయంత్రం కురిసిన వర్షానికి 5వ నెంబర్ రోడ్డు, ఐటీఐ కళాశాల రోడ్డు, భారతీనగర్ నోవాటెల్ సర్వీస్‌రోడ్డు, గురునానక్ రోడ్డు, ఎన్టీఆర్ కాలనీ, కరెన్సీనగర్, ఎల్ఐసీ కాలనీ, పలు సర్వీస్ రోడ్లు, ఆటోనగర్ రోడ్డు, సమీపంలోని గమేళాబజార్‌రోడ్డులోని సైడ్ డ్రైనేజీలు పూడికతో నిండిపోయాయి. దీంతో పలు కాలనీ ప్రధాన, అంతర్గత రహదారులు జలమయమయ్యాయి. ఆ సమయంలో వర్షపు నీరు ఎక్కువగా రావడంతో ద్విచక్రవాహనదారులు, పాదచారులు తీవ్ర ఇక్కట్లు పడుతూ రాకపోకలు సాగించారు. నగరంలో సుమారు గంటపాటు ఏకధాటిగా కురిసిన వర్షానికి కాలనీ రోడ్లన్నీ జలమయం కావడంతో స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకొని డ్రైనేజీలలోని పూడిక తొలిగించాలని కాలనీ వాసులు కోరుతున్నారు.

## కనకదుర్గానగర్‌లో గుర్తుతెలియని మృతదేహం

**వన్‌టౌన్, జూన్ 16:** కనకదుర్గానగర్‌లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభించినట్లు ఆదివారం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. వారు తెలిపిన వివరాల ప్రకారం.. కనకదుర్గానగర్ మరుగుదొడ్ల సమీపంలో ఓ వ్యక్తి మృతి చెందినట్టు సమాచారం పోలీసులకు అందింది. వారు ఘటనా ప్రాంతానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడ ఎలాంటి గుర్తింపు ఆధారాలు లేనందున పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

## కేన్సర్ నిర్ధారణ పరీక్షలు

**పటమట, జూన్ 16:** ఫాదర్స్ డే సందర్భంగా రూట్ హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరుకు చెందిన సోమలరాజు ఫౌండేషన్, హెచ్‌సీజీ క్యూరీ కేన్సర్ సెంటర్ సహకారంతో 45ఏళ్లు నిండిన తల్లిదండ్రులకు అశోక్‌నగర్‌లోని రూట్ హెల్త్ ఫౌండేషన్ కార్యాలయంలో ఉచిత కేన్సర్ నిర్ధారణ పరీక్షలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రొస్టేట్ క్యాన్సర్‌పై అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య అతిథి సిద్ధార్థ వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వై. రూపేష్‌కుమార్ మాట్లాడుతూ ఈ రూట్స్ సంస్థ కొన్నేళ్లుగా ఎంతో ఖరీదైన వైద్యపరీక్షలను ఉచితంగా నిర్వహిస్తూ ఎంతోమందికి ఉపయోగకరంగా ఉంటుందని వారి సేవ లు అభినందనీయమన్నారు. సంస్థ చైర్మన్ డాక్టర్ పోలవరపు విజయభాస్కర్‌రావు మాట్లాడుతూ పురుషులకు వచ్చే ప్రొస్టేట్ క్యాన్సర్‌ను, మహిళలకు వచ్చే సర్వికల్ క్యాన్సర్‌ను పీఎస్‌ఏ, పాప్ స్మియర్ అనే సులభమైన పరీక్షల ద్వారా గుర్తించవచ్చునన్నారు. ఈ ఉచిత కేన్సర్ శిబిరంలో 110 మందికి కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించారు. సోమలరాజు ఫౌండేషన్ అధ్యక్షుడు శివరాజు, అన్నే శివనాగేశ్వరరావు, రూట్స్ ఫౌండేషన్ అధ్యక్షుడు శివరాజు, సభ్యులు శ్రీనివాస్, జి.వెంకటరమణ, విజయలక్ష్మి, శ్రవణ్ కామేశ్వరి, సోమనాథ్ హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.



కేన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తున్న రూట్స్ వైద్య నిపుణులు

పంచముఖ ఆంజనేయస్వామి ఆలయంలో

## ఘనంగా పూర్ణాహుతి



పూర్ణాహుతి నిర్వహిస్తున్న వేదపండితులు

**వన్‌టౌన్, జూన్ 16 :** విజయదుర్గా రామలింగేశ్వర పంచముఖ ఆంజనేయ స్వామి దేవస్థానంలో చతుర్థ వార్షిక బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని 3వ రోజైన ఆదివారం పలు విశేష కార్యక్రమాలను నిర్వహించారు. తొలుత దేవతా మూర్తులకు అనుష్టానాలు, పారాయణలు, హోమాలు, బలిహరణలు సమర్పించారు. మధ్యాహ్నం రామలింగేశ్వర, గంగా, పార్వతి, విజయదుర్గాదేవతల కల్యాణ మహోత్సవాన్ని శాస్త్రోక్త, వేదోక్త విధానంలో నిర్వహించారు. అనంతరం వేద మంత్రాల నడుమ పూర్ణాహుతి నిర్వహించారు. వేద పండితుల ఆశీర్వాచనం అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ జరిగింది. హైదరాబాద్‌కు చెందిన అట్లూరి గౌరీనాథ్ దంపతులు నిత్యాన్నదానానికి ఉభయదాతలుగా వ్యవహరించారు.

## మంత్రి పార్థసారథికి సత్కారం

**కంకిపాడు, జూన్ 16 :** గృహ నిర్మాణ శాఖ మంత్రి పార్థసారథిని జిల్లా తెలుగురైతు కార్యదర్శి మద్దాలి సాయిబాబు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి సత్కరించారు. ఈ సందర్భంగా సాయిబాబు మాట్లాడుతూ, టీడీపీ ప్రభుత్వం ప్రజా సంక్షేమ పాలన అందిస్తుందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ గత ప్రభుత్వ హయాంలో ఇళ్ల పట్టాలు పంపిణీ చేయలేదన్నారు. గత ప్రభుత్వంలో ఇళ్లపట్టాలు రాని వారికి ఇళ్లపట్టాలు పంపిణీ చేసే విధంగా చర్యలు తీసుకోవాలని మంత్రి సారథిని కోరినట్లు ఆయన తెలియజేశారు.

**హనుమాన్‌జంక్షన్ :** కూటమి ప్రభుత్వంలో ప్రమాణ స్వీకారం చేసిన మున్సిపల్ శాఖా మంత్రి పొంగూరు నారాయణ, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి వై.సత్యకుమార్‌లను టీడీపీ బాపులపాడు మండలం నాయకులు సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఆదివారం అమరావతి సచివాలయంలోని వారి పేషీలో మంత్రులను కలిశారు. ఈ కార్యక్రమంలో మొవ్వా వెంకటేశ్వరరావు, వడ్డిల్లి లక్ష్మీకుమారి, గరిమెళ్ల నరేంద్ర విజయసారథి, కోనంకి శ్రీధర్, పెమ్మసాని శైలజ పాల్గొన్నారు.



మంత్రి పార్థసారథిని సత్కరిస్తున్న సాయిబాబు

## రోడ్ల అభివృద్ధికి చర్యలు చేపట్టండి



అధికారులతో మాట్లాడుతున్న రాజా

**ఈడుపుగల్లు (కంకిపాడు), జూన్ 16 :** ఈడుపుగల్లు - ఉప్పలూరు ప్రధాన రహదారి అభివృద్ధికి తగు చర్యలు చేపట్టాలని వివిధ శాఖల అధికారులను మాజీ ఎంపీపీ దేవినేని రాజా కోరారు. అధ్వానంగా మారిన రహదారిని ఆర్అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులతో కలిసి ఆయన ఆదివారం పరిశీలించారు. ఈ సందర్భంగా దేవినేని రాజా మాట్లాడుతూ, ఈడుపుగల్లు - ఉప్పలూరు రహదారి పరిస్థితి దయనీయంగా మారిందన్నారు. అదే విధంగా పునాదిపాడుపై ఓవర్ వద్ద రోడ్డు పరిస్థితి కూడా దయనీయంగా మారిందని తక్షణం ఈ రెండు ప్రాంతాల్లో రోడ్ల మరమ్మతులు చేపట్టాలని కోరారు. కార్యక్రమంలో ఈడుపుగల్లు సర్పంచ్ పి.ఇందిర, గ్రామ పార్టీ అధ్యక్షులు షేక్ షకార్, సుధాకర్ పాల్గొన్నారు.

# ఈద్గా నిర్మాణానికి కృషి

**ఎమ్మెల్యే బోడె ప్రసాద్**



ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు వినతిపత్రం ఇస్తున్న కమిటీ సభ్యులు

**పెనమలూరు, జూన్ 16 :** తాడిగడప మునిసిపాలిటీ పరిధిలోని సనత్‌నగర్, కృష్ణనగర్, సిద్దిఖ్‌నగర్, మురళీనగర్, యనమలకుదురు, తాడిగడప, పోరంకి ప్రాంతాల్లో ఉన్న 15మసీదుల ముస్లిం సమాజం నిత్యం ఈద్ నమాజ్‌లు నిర్వహించుకోవడానికి కనీసం ఐదుఎకరాల స్థలం కేటాయించి ఈద్గా, షాదీఖానా తదితర నిర్మాణాలు చేపట్టేందుకు తాను కృషి చేస్తానని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ హామీ ఇచ్చారు. ఆదివారం అశోక్‌నగర్ చెక్‌పోస్టు వద్ద ఉన్న మసీద్ ఏ సిద్దికియా రజీ కమిటీ సభ్యులతో షేక్ బుజ్జి అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ కోర్టుల్లోనూ, రియల్ ఎస్టేట్ మాఫియా గుప్పెట్లో ఉన్న భూముల్లో లాయర్లతో మాట్లాడి న్యాయసలహాలు తీసుకొని వీలైనంత త్వరలో రాష్ట్రంలోనే ఒక మోడల్ ఈద్గాను నిర్మించేందుకు కృషి చేస్తానని తెలిపారు. రేకుల మసీదు, యనమలకుదురు వంటి చోట్ల మసీదుల్లో ప్రార్థనలు నిర్వహించుకోవడంలో ఇబ్బందులను తాను గ్రహించానని తెలిపారు. సనత్‌నగర్‌లో తనను నిన్నటి ఎన్నికల్లో సపోర్టు చేశారని, ఈద్గా నిర్మాణానికి తన వంతు సమకారం తన బాధ్యతని పేర్కొన్నారు. సనత్ నగర్‌కు సంబంధించిన డ్రైనేజి సమస్యకు ఫుల్‌స్టాప్ పెడతామని పేర్కొన్నారు. రేకుల మసీదు వద్ద రోడ్డును వెడల్పు చేసి డ్రైను వాటర్‌ను బయటికి పంపే ప్రయత్నం చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అనుమో లు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, ఇమాం, ఇబ్రహీం, ఇక్బాల్, రియాజ్, సమీర్, అబిద్, బాషా, రెహమాన్, కరీం, ఇనయతుల్లామసీదు కమిటీ ప్రెసిడెంటు వాహేద్, కార్యదర్శి ఫజాల్ పాల్గొన్నారు.

**డ్రెయినేజీ వ్యవస్థను మెరుగుపరుస్తాం**

కానూరు గ్రామంలోను, చుట్టుప్రక్కల ఉన్న డ్రైనేజి వ్యవస్థలను సత్వరమే మెరుగుపరచేందుకు తగు చర్యలు తీసుకుంటామని పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం స్థానిక టీడీపీ నాయకులు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావులతో కలిసి కానూరు గ్రామంలోని డ్రైనేజి వ్యవస్థను పరిశీలించారు. ఏలూరు కాల్వ నుంచి కొత్త ఆటోనగర్, కానూరు బాడవ డొంక, హరిజనవాడ నుంచి చిన్నచెరువు వరకు ఉన్న ప్రధాన డ్రైన్‌ను పరిశీలించి అధికారులకు తగు సూచనలిచ్చారు. డ్రైన్లలో మురుగు పారుదలకు అడ్డుగా ఉన్న తూటుకాడ, గుర్రపుడెక్క, తూముల్లోని సిల్టు తొలిగించేందుకు వెంటనే యంత్రాలు ఏర్పాటు చేయాలని కమిషనరును ఆదేశించారు. ఆయన వెంట అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, డీఈ రాజారావు, అంగిరేకుల మురళి, దోనేపూడి రవికిరణ్, మాదు రామకృష్ణ, ఉప్పాల వెంకటేశ్వరర్లు, తాతపూడి గణేష్, కరిమికొండ సురేష్, సత్రం శివయ్య ఉన్నారు.

## తేనెటీగల దాడిలో విశ్రాంత జవాన్ మృతి

వెలిగండ్ల, జూన్ 16: తేనెటీగల దాడిలో విశ్రాంత జవాన్ మృతి చెందిన ఘటన ప్రకాశం జిల్లా వెలిగండ్ల మండలం ఇమ్మడిచెరువులో చోటుచేసుకుంది. కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన జుటికే సుందరరావు (57) సీఆర్‌పీఎఫ్‌లో జవాన్‌గా పనిచేసి స్వచ్ఛంద ఉద్యోగ విరమణ చేశారు. శనివారం ఆయన భార్య రోజమ్మతో కలిసి కనిగిరిలో బ్యాంకుకు ద్విచక్ర వాహనంపై బయల్దేరారు. బాపనపల్లి గ్రామ సమీపంలోకి చేరుకునే సరికి ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. దీంతో భార్యాభర్తలు పంట పొలాల్లోకి పరుగులు తీశారు. అయినప్పటికీ తేనెటీగలు వదలలేదు. ఆ సమయంలో అటుగా ఆటోలో వెళ్తున్న వారు ముఖాలకు కండువాలు కప్పుకుని వెళ్లి భార్యాభర్తలను కనిగిరి ప్రభుత్వ ఆసుపత్రి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సుందరరావు మృతి చెందినట్టు నిర్ధారించారు. చికిత్స అనంతరం రోజమ్మ కోలుకున్నారు.

## ఒంటరి ఏనుగు దాడిలో రైతు మృతి

రామకుప్పం, జూన్ 16: చిత్తూరు జిల్లా కుప్పం రామకుప్పం మండలం పీఎం తాండా సమీపంలో శనివారం రాత్రి ఏనుగు దాడిలో ఓ రైతు మృతి చెందారు. రాత్రి 9 గంటల ప్రాంతంలో పొలం వద్ద షెడ్‌లో ఆవులను కట్టేసి రైతు కన్నానాయక్ ఇంటికి వెళుతున్నారు. మార్గమధ్యలో తన టమోటా తోటను ఒంటరి ఏనుగు ధ్వంసం చేయడం గమనించిన ఆయన భయంతో పరుగుతీశారు. కొద్ది దూరం వెళ్లగానే కింద పడిపోగా ఒంటరి ఏనుగు దాడిచేసి, తొండంతో దూరంగా విసిరేసింది. దీంతో కన్నానాయక్ అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయారు. అటవీశాఖ అధికారులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కుప్పం ప్రభుత్వాస్పత్రికి తరలించారు.


ఇందిరాగాంధీ స్టేడియంలో నిలిచిన వర్షపు నీరు..


గుణదల సమీపంలో వాహనంతో చిరు వ్యాపారి ఇక్కట్లు..


ఏలూరు రోడ్డులో జోరుగా కురుస్తున్న వాన..

# భారీ వర్షానికి విజయవాడ అతలాకుతలం

- గంటసేపు దంచికొట్టిన వాన
- నీట మునిగిన లోతట్టు ప్రాంతాలు
- చెరువుల్లా మారిన రహదారులు

విజయవాడ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): విజయవాడ నగరంలో ఆదివారం సాయంత్రం కురిసిన భారీ వర్షానికి లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో గంట సేపు కురిసిన వర్షానికి నగరంలోని రహదారులు చెరువుల్లా మారాయి. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. కాగా, నగరంలోని ఇందిరాగాంధీ మున్సిపల్ స్టేడియం ఎదురుగా ఉన్న మహాత్మాగాంధీ రోడ్డులో వర్షం నీరు నిలిచిపోయిన ప్రాంతాన్ని నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్‌తో కలిసి పురపాలకశాఖ మంత్రి నారాయణ పరిశీలించారు. భవిష్యత్తులో వరద నీరు రోడ్లపై నిలవకుండా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. లోతట్టు ప్రాంతాలు, జలమయం అయ్యే ప్రధాన రహదారులను క్షేత్రస్థాయిలో పర్యటించిన మంత్రి.. అధికారులకు సూచనలు చేశారు.

### అక్కడక్కడా భారీ వర్షాలు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉపరితల ఆవర్తనం, ద్రోణి ప్రభావంతో ఆదివారం కోస్తా జిల్లాల్లో పలు చోట్ల భారీ వర్షాలు కురిశాయి. కాకినాడ రూరల్‌లో 83, ఏలూరు జిల్లా నిడమర్రులో 80, విజయనగరంలో 70, అల్లూరి జిల్లా కూనవరంలో 48.5, తూర్పుగోదావరి జిల్లా గోపాలపురంలో 48.5, పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో 47.5, కృష్ణా జిల్లా పమిడిముక్కలలో 31.5 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. సోమవారం అల్లూరి జిల్లాలో పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు, కోస్తా, రాయలసీమలో అక్కడక్కడా తేలికపాటి వర్షాలు పడతాయని విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా తేలికపాటి వర్షాలు కురిసే అవకాశం ఉందని తెలిపింది.


క్యూలైన్‌లో వేచి ఉన్న సర్వదర్శన భక్తులు

## శ్రీవారి సర్వదర్శనానికి 36 గంటలు

తిరుమల, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. శనివారం నుంచే రద్దీ పెరగ్గా, ఆదివారం కూడా అదే స్థాయిలో భక్తులు కిక్కిరిసి కనిపించారు. సర్వదర్శన భక్తులతో వైకుంఠం క్యూకాంప్లెక్స్‌లోని కంపార్టుమెంట్లు, నారాయణగిరిలోని షెడ్లు నిండిపోయాయి. క్యూలైన్ కృష్ణతేజ గెస్ట్‌హౌస్ వెనుకభాగంలోని రింగురోడ్డు మీదుగా నందకం వరకు దాదాపు మూడు కిలోమీటర్ల మేరకు వ్యాపించింది. వీరికి 36 గంటల దర్శన సమయం పడుతున్నట్టు టీటీడీ ప్రకటించింది.

## టీటీడీ నిత్య అన్నదానానికి రూ.10 లక్షలు విరాళం

తుళ్లూరు, జూన్ 16: తిరుమల తిరుపతి దేవస్థానానికి తుళ్లూరు మండల మాజీ జెడ్పీటీసీ సభ్యుడు బెజవాడ నరేంద్రబాబు రూ.10 లక్షల విరాళాన్ని అందజేశారు. చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి కావడంతో శనివారం ఆయన కుటుంబ సమేతంగా తిరుమల వెళ్లి శ్రీవారిని దర్శించుకున్నారు. అనంతరం నిత్య అన్నదాన కార్యక్రమానికి ఆయన రూ.10 లక్షలు విరాళాన్ని అందజేశారు. ఈ సందర్భంగా నరేంద్ర మాట్లాడుతూ రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, అమరావతి రాజధాని శరవేగంగా చంద్రబాబు నేతృత్వంలో అభివృద్ధి చెందాలని స్వామిని వేడుకున్నట్టు తెలిపారు.



టీటీడీ అధికారులకు రూ.10 లక్షల చెక్కును అందజేస్తున్న నరేంద్రబాబు

---

**ఏపీపీఎస్సీ పరీక్షల ప్రత్యేకం**

# చెవి నిర్మాణం

**• బయాలజీ**



**చెవి అనేది వినడానికి, సమతాస్థితికి ఉపయోగపడే జ్ఞానేంద్రియం. చెవి గురించి అధ్యయనం చేసే శాస్త్రాన్ని ఒటాలజీ అంటారు. మానవుడు 20 హెర్ట్జ్‌ల నుంచి 20,000 హెర్ట్జ్‌ల వరకు మాత్రమే ధ్వనిని వినగలుగుతాడు. దీనినే శ్రవ్య అవధి అని పిలుస్తారు. 20 హెర్ట్జ్‌ల కన్నా తక్కువ పౌనఃపున్యం ఉన్న ధ్వని తరంగాలను పరశ్రావ్యాలు అంటారు. వీటిని ఏనుగులు, గబ్బిలాలు, కుక్కలు వంటి జీవులు వినగలుగుతాయి.**

**చెవిలో మూడు భాగాలు ఉంటాయి. అవి... బాహ్య చెవి, మధ్య చెవి, లోపలి చెవి.**

**బాహ్య చెవి:** దీనిని వెలుపలి చెవి అని కూడా పిలుస్తారు. దీనిలో పిన్నా, బాహ్య శ్రవణ కుహరం, కర్ణభేరి త్వచము అనే మూడు భాగాలుంటాయి. పిన్నాను చెవి దొప్పగా పేర్కొంటారు. ఇది స్థితిస్థాపక మృదులాస్థి నిర్మాణం. బాహ్య శ్రవణ కుహరము ఒక వంపు తిరిగిన నాళంలా ఏర్పడి పిన్నా, కర్ణభేరి త్వచము మధ్య విస్తరించిన నిర్మాణం. చెవి దొప్ప, బాహ్యశ్రవణ కుహర చర్మంలో సున్నిత రోమాలు, మైనం అనేవి ఉంటాయి. చెవిలోకి దుమ్ము, ధూళి ఇతరత్రా రేణువులు ప్రవేశించకుండా రోమాలు, మైనం నిరోధిస్తాయి. కర్ణభేరి త్వచము శంఖువు ఆకారంలో ఉంటుంది. ఈ త్వచము బాహ్య శ్రవణ కుహరాన్ని, మధ్య చెవిని వేరు చేసే పలుచని అర్ధ పారదర్శక పొర. ఈ త్వచం శబ్దతరంగాలను బాహ్య చెవి నుంచి గ్రహించి మధ్య చెవిలోని కూటకానికి అందిస్తుంది.

**మధ్య చెవి:** మధ్య చెవి అనేది బాహ్య చెవి కర్ణభేరి త్వచానికి, లోపలి చెవి అస్థి విభాజకానికి మధ్యలో విస్తరించి ఉంటుంది. ఇది పుర్రెలోని టెంపోరల్ ఎముకలో ఏర్పడిన గాలితో నిండి ఉంటుంది. మధ్య చెవిలో మాలియస్, ఇంకస్, స్టెపిస్ అనే మూడు అస్థి ఖండాలు ఉంటాయి. మాలియస్‌ని హామర్‌బోన్ అని, ఇంకస్ ని అన్విల్ బోన్ అని, స్టెపిస్‌ని స్టిరప్ బోన్ అని పేర్కొంటారు. ఈ ఎముకలు మూడు గొలుసులుగా ఒకదానితో ఒకటి కలిసి ఉంటాయి. మాలియస్ తలభాగం ఇంకస్‌తో, పరాంతభాగం కర్ణభేరి త్వచంతో కలిసి ఉంటుంది. ఇంకస్ అనేది మధ్య ఎముక. ఇది స్టెపిస్ తలతో కలుపబడి ఉంటుంది. లోపలి చెవి అస్థివిభాజకంలోని అండాకార రంధ్రపు కిటికీతో స్టెపిస్ కలుపబడి ఉంటుంది. ఈ మాలియస్, ఇంకస్, స్టెపిస్ మూడు ఎముకలు శబ్ద ప్రకంపనలను లోపలి చెవికి అందజేస్తాయి. మధ్య చెవి కుహరం గ్రసనిని కలుపుతూ యుస్టేషియన్ నాళం ఉంటుంది. ఈ నాళం కర్ణభేరి త్వచానికి ఇరువైపులా వాయు పీడనాన్ని సమానస్థాయిలో ఉంచడానికి తోడ్పడుతుంది.

**లోపలి చెవి:** వినికిడి ప్రక్రియలో ప్రధాన పాత్రను వహించేది లోపలి చెవి. ఇది ద్రవంతో నిండి ఉన్న కుహరం. దీనిని లాబరింత్ అంటారు. దీనిలో బోని లాబరింత్, మెంబ్రినస్ లాబరింత్ రెండు భాగాలు ఉంటాయి. బోని లాబరింత్‌లో వరుసగా కాక్లియా, వెస్టిబుల్, సెమి సర్క్యులర్ కెనాల్స్ అనే మూడు రకాల కుల్యలు ఉంటాయి.

**ఎ.కాక్లియా:** దీనినే కర్ణావర్తనం అని కూడా పిలుస్తారు. ఇది సర్పిలాకార నిర్మాణం. కాలా వెస్టిబ్యులి, స్కాలా మీడియా, స్కాలా టింపాని అనే మూడు సమాంతర నాళాలుంటాయి.

**బి.వెస్టిబుల్:** దీనిలోని ముందు భాగాన్ని సాక్యులస్ అని, వెనుక భాగాన్ని యుట్రిక్యులస్ అని పేర్కొంటారు. సాక్యులస్, యుట్రిక్యులస్ రెండింటిని కలిపి ఆటోలిత్ అంగంగా పిలుస్తారు.

**సి. సెమి సర్క్యులర్ కెనాల్స్:** ఇవి మూడు ఉంటాయి. ఒకదానికొకటి లంబకోణంలో అమరి ఉంటాయి. వీటి పీఠభాగం ఉబ్బి ఉంటుంది.

### వినికిడి ప్రక్రియ

బాహ్య చెవి శబ్ద తరంగాలను గ్రహించి కర్ణభేరి త్వచం మీదకు మళ్లిస్తుంది. ఈ శబ్దతరంగాలకు అనుగుణంగా కర్ణభేరి త్వచం కంపిస్తుంది. ఈ ప్రకంపనలు మూడు ఎముకలైన మాలియస్, ఇంకస్, స్టెపిస్ ద్వారా అండాకార రంధ్రపు కిటికీ వద్దకి చేరి కాక్లియాలోనికి ప్రవేశించి పెరిలింఫ్, ఎండోలింఫ్ ద్రవాలలో అలలను ఉత్పత్తి చేస్తాయి. ఈ అలలు బేసిల్లార్ త్వచంలో ఒక చిన్న అలను కలిగిస్తాయి. ప్రేరణ వల్ల బేసిల్లార్ త్వచంలోని హేర్ సెల్స్ ఒరిగి టెక్టోరియల్ త్వచం మీద ఒత్తిడి కలిగిస్తాయి. అందువల్ల సన్నిహిత అభివాహి నాడీ కణాలలో నాడీ ప్రచోదనం ఏర్పడి శ్రవణ నాడీ ద్వారా మెదడుని చేరుతుంది. అక్కడ నాడీ ప్రచోదనం విశ్లేషించబడి ధ్వని గుర్తించబడుతుంది.

### చెవికి సంబంధించిన అపస్థితులు

**ఒటిటిస్ మీడియా:** ఇది చిన్న పిల్లల్లో సాధారణంగా ఉండే అపస్థితి. మధ్య చెవిలోని యూస్టేసియన్ నాళం పొట్టిగా ఉన్నట్లయితే బ్యాక్టీరియా సంక్రమణకు గురైనప్పుడు చెవిలో చీము అధికంగా వస్తుంది.

**టిన్నిటస్:** మెదడులో కణితులు ఏర్పడినప్పుడు గాని, అధిక శబ్దాలు విన్నప్పుడు గాని చెవిలో మైనం(సెరుమినస్) అధికంగా ఏర్పడినప్పుడు గాని లోపలి చెవిలో ఉన్న హేర్ సెల్స్ దెబ్బతింటాయి.


కె.నాగశేషులు, సీనియర్ ఫ్యాకల్టీ

---

# దిక్సూచి
DIKSUCHI

**కరెంట్ అఫైర్స్ / జనరల్ ఎస్సే**



'జన్యు వనరులు', 'సాంప్రదాయిక జ్ఞానం'పై

# మేధాసంపత్తి ఒప్పందం

**అనాదిగా భారతీయ వంటగదిలోని పోపులపెట్టే చిన్నపాటి ఫస్ట్‌ఎయిడ్ బాక్స్ కాగా, పెరటిలోని అనేక మొక్కలు మందులనిచ్చే కల్పతరువులు. దెబ్బలకు పసుపు, కఫానికి తులసి, దగ్గుకు కరక్కాయ, దంత సంరక్షణకు వేపపుల్ల... ఇలా చెప్పుకొంటూపోతే భారతీయ సాంప్రదాయిక విజ్ఞానం ఒక వైద్యరంగం వద్దే ఆగిపోదు. వ్యవసాయం, పశుపోషణ వంటి అనేక రంగాల్లో మమేకమై కనిపిస్తుంది. అదేవిధంగా భారతదేశ భౌగోళిక, వాతావరణ వైవిధ్యతల దృష్ట్యా జన్యు వనరులపరంగా కూడా దేశం సుసంపన్నం.**

అయితే హఠాత్తుగా ఎవరోవచ్చి వీటి వైశిష్ట్యాలను ప్రయోగశాలల్లో తాము నిర్ధారించాము కాబట్టి వీటిపై తమకు యాజమాన్యపు హక్కులున్నాయని అంటే? తరతరాలుగా వస్తున్న సాంప్రదాయిక విజ్ఞానంపై మనకు హక్కు లేకుండా మేధాసంపత్తి హక్కులను వారు దాఖలుపర్చుకుంటే?

నిజానికి గతంలో అదీ జరిగింది. పసుపు, వేప వంటి భారతీయ సాంప్రదాయిక వైద్య విజ్ఞాన అంశాలతోపాటు, నేఫాల్, నేఫాల్-49 గోధుమ రకాలు, బాస్మతి బియ్యం వంటి జన్యు వనరులపై కూడా మేధాసంపత్తి హక్కులను విదేశీ సంస్థలు తీసుకున్నాయి. 1995లో అమెరికా తమ దేశంలోని యూనివర్సిటీ ఆఫ్ మిసిస్సిపీ మెడికల్ సెంటర్ పసుపునకు గాయాలు నయంచేసే గుణం ఉందని ప్రయోగాత్మకంగా రుజువు చేయడంతో పేటెంట్ మంజూరు చేసింది. అయితే ఇండియన్ కౌన్సిల్ ఫర్ సైన్స్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (సీఎస్ఐఆర్) అందించిన చారిత్రక ఆధారాలతో తరవాత ఆ పేటెంట్ రద్దయింది.

అదేవిధంగా వేపకాయల నుంచి తీసిన అజాడిరాక్టిన్ ప్రధాన పదార్థంగా తయారుచేసిన ఒక ఔషధంపై 'డబ్ల్యూఆర్ గ్రేస్' అనే కంపెనీకి పేటెంట్ మంజూరైంది. అయితే దీనిపై భారత్ తీవ్రంగా ప్రతిస్పందించడంతో పునఃపరిశీలించి యురోపియన్ పేటెంట్ ఆఫీస్ దానిని రద్దు చేసింది. కానీ యునైటెడ్ స్టేట్స్ పేటెంట్ అండ్ ట్రేడ్‌మార్క్ ఆఫీస్ దానిని రద్దు చేయలేదు.

భారతదేశానికి చెందిన నాప్‌హాల్ గోధుమ రకాలపై 2003లో ఒక యురోపియన్ కంపెనీ బయోపైరసీ(ప్రకృతిసిద్ధ సహజ జన్యు పదార్థాల అక్రమ వినియోగం) చేసి పేటెంట్లు పొందింది. వాస్తవానికి ఇవి సహజ వనరులని, కొత్త ఆవిష్కరణలు కావని భారత అధికారులు సాక్ష్యాలు సమర్పించడంతో పేటెంట్లు రద్దుచేశారు.

ఇదేవిధంగా 2000 సంవత్సరంలో కూడా ఒక అమెరికన్ కంపెనీ బాస్మతి బియ్యంపై పొందిన పేటెంట్‌ను రద్దు చేయించడానికి భారతీయ అధికారులు పెద్ద న్యాయపోరాటమే చేశారు.

ఈవిధంగా ఒక దేశానికి లేదా ప్రాంతానికి చెందిన సాంప్రదాయిక జ్ఞానం, జన్యు వనరులపై వేరొకరు పేటెంట్ పొందడమంటే వారి హక్కులను హరించడమే కాదు, న్యాయంగా వారికి దక్కాల్సిన ప్రయోజనాలు దక్కకుండా పోవడమే. అందుకే ఈ సమస్యను పరిష్కరించడానికి సాంప్రదాయిక, జన్యు వనరులను ఎవరైనా వినియోగిస్తున్నప్పుడు న్యాయబద్ధంగా సంబంధీకులకు దక్కాల్సిన వాటాను అందించడానికి తోడ్పడేలా 2010లో నగోయా ప్రోటోకాల్ తీసుకువచ్చారు. అయితే ఇది అంత సమర్థంగా పనిచేయక పోతుండటంతో మరో కొత్త కట్టుబాటు అవసరమైంది. ఈ నేపథ్యంలో ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(వరల్డ్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ ఆర్గనైజేషన్) ఇటీవల 'ట్రీటీ ఆన్ ఇంటెలెక్చ్యువల్ ప్రాపర్టీ(ఐపీ), జెనెటిక్ రిసోర్సెస్ (జీఆర్స్) అండ్ అసోసియేటెడ్ ట్రెడిషనల్ నాలెడ్జ్(ఏటీకే) (మేధా సంపత్తి, జన్యు వనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం) తీసుకువచ్చారు.

ప్రపంచ మేధోసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ) ప్రధాన కార్యాలయం(జెనీవా)లో 2024 మే 13-24 మధ్య రెండువారాల పాటు, 192 దేశాలు 86 మంది పరిశీలకులు సుదీర్ఘ చర్చలు జరిపిన దరిమిలా మే 24న 'మేధాసంపత్తి, జన్యువనరులు, పారంపర్య సాంప్రదాయిక విజ్ఞాన ఒప్పందం' సాకారమైంది.

### ఒప్పంద ముఖ్యాంశాలు

1. ఇప్పటివరకూ ఉన్న మేధోసంపత్తి పరిరక్షణ ఒప్పందాలన్నింటిలోనూ సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులపై స్థానికులకు ఉన్న హక్కును గుర్తించిన ఏకైక ఒప్పందం ఇది.

2. ఒక దేశానికి సంబంధించిన సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరులను ఇతరులు దోచుకోకుండా, అక్రమంగా వినియోగించుకోకుండా ఈ ఒప్పందం అడ్డుకుంటుంది. దీనిలో ఉన్న 'మాండేటరీ డిస్‌క్లోజర్ ఆబ్లిగేషన్స్' అనే నిబంధన ప్రకారం పేటెంట్ దరఖాస్తుదారు ఏదైనా జన్యువనరులను గానీ, సాంప్రదాయిక విజ్ఞానాన్ని గానీ తమ ఆవిష్కరణలో వినియోగిస్తే అది ఏ దేశానికి చెందిందో, ఆ విజ్ఞానాన్ని పరిరక్షిస్తున్న వారెవరో కూడా స్పష్టంగా వెల్లడించాల్సి ఉంటుంది.

3. ఈ ఒప్పందం ద్వారా జన్యు వనరులు, సాంప్రదాయిక విజ్ఞానం ప్రపంచవ్యాప్తంగా పరిరక్షించేందుకు అన్ని భాగస్వామ్య దేశాలు తమ దేశీయ మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్'(సదరు జన్యు వనరు/సాంప్రదాయిక విజ్ఞానం ఏ ప్రాంతానికి చెందిందో వెల్లడించే) నిబంధనను చేర్చాల్సి ఉంటుంది.

4. ఈ ఒప్పందం సాంప్రదాయిక విజ్ఞానం, జన్యువనరుల నుంచి నేరుగా సంగ్రహించిన అంశాలకు కాక వాటిని వినియోగించి చేసిన సరికొత్త ఆవిష్కరణలకు మాత్రమే మేథోసంపత్తి హక్కులను అందించడానికి సమ్మతిస్తుంది.


ఎం.బాలలత, సివిల్స్ మెంటార్

### ఒప్పంద ప్రయోజనాలు

1. సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల సంవృద్ధి గల భారతదేశం, గ్లోబల్ సౌత్ దేశాల ప్రయోజనాలు, హక్కులు పరిరక్షించగలుగుతారు.

2. బయోపైరసీ ద్వారా ఇతరులు అక్రమ లబ్ధి పొందడాన్ని నివారించి సాంప్రదాయిక విజ్ఞానం, జన్యు వనరుల పరిరక్షణతో సంబంధం గల స్థానిక ప్రజలకు లబ్ధి చేకూరుతుంది.

3. మేధాసంపత్తి హక్కుల పరిరక్షణలో అంతర్జాతీయ ప్రమాణాలు ఏర్పడి, దేశాల మధ్య మేధాసంపత్తి హక్కుల వివాదాలు తగ్గుముఖం పడతాయి. పారదర్శకత పెరుగుతుంది.

4. విజ్ఞాన చౌర్యం, జన్యు వనరుల నకిలీలు తయారు కాకుండా ప్రాచీన విజ్ఞానం, జన్యు వనరుల ఆధారంగా సరికొత్త ఆవిష్కరణలను ప్రోత్సహించవచ్చు.

అయితే 1999 నుంచి జరిపిన సుదీర్ఘ చర్చల ప్రతిరూపంగా 25 సంవత్సరాల తరవాత సాకారమైన ఈ ఒప్పందం అమలులోకి రావాలంటే కనీసం 15 సభ్యదేశాలు సంతకాలు చేసి, దానిని ర్యాటిఫై (ధృవీకరించాల్సి) ఉంటుంది. అదేవిధంగా ఇది పటిష్ఠంగా అమలుకావాలంటే అన్ని దేశాలు తమ మేధాసంపత్తి హక్కుల చట్టాలను ఈ ఒప్పందానికి అనుగుణంగా సరిదిద్దాల్సి ఉంటుంది. అయితే ఇప్పటివరకు కేవలం 35 దేశాల్లో మాత్రమే 'డిస్‌క్లోజర్ ఆఫ్ ఆరిజన్' వంటి నిబంధనలు వారి మేధాసంపత్తి హక్కుల చట్టాల్లో చేర్చారు. ఇకముందు ఎన్ని ఎక్కువ దేశాలు ఇలాంటి నిబంధనలను స్వీకరిస్తాయన్న దానిపైనే ఈ ఒప్పంద అమలు ఆధారపడి ఉంటుంది. ఈ ఒప్పందం పటిష్ఠంగా అమలుకావడమంటే ప్రపంచ జీవవైవిధ్యంలో ఏడు నుంచి ఎనిమిది శాతం వరకు కలిగి ఉన్న, సాంప్రదాయిక విజ్ఞానపరంగా సుసంపన్నమైన భారతదేశానికి శుభపరిణామమే.

### మేధాసంపత్తి హక్కు అంటే?

ఒక వ్యక్తి లేదా సంస్థ ఆవిష్కరణలను, ఇతరులు కాపీచేసి వారు అనాయాస లబ్ధి పొందకుండా ఆవిష్కర్తకు ఆ ఆవిష్కరణపై కొంత కాలానికి సర్వహక్కులు కల్పిస్తూ ఇచ్చే చట్టబద్ధమైన హక్కు.

### ప్రపంచ మేధాసంపత్తి సంస్థ(డబ్ల్యూఐపీఓ)

- ఇది ఐక్యరాజ్య సమితికి చెందిన ఒక అంగము. స్విట్జర్లాండ్‌లోని జెనీవాలో ఉంది.
- దీనిని మేథోసంపత్తి హక్కుల విషయమై అంతర్జాతీయ సహకారం పెంపొందించడానికి 1967లో ఏర్పాటుచేశారు.
- దీనిలో 193 సభ్యదేశాలున్నాయి.
- భారతదేశం 1975లో దీనిలో చేరింది.
- మేధాసంపత్తి హక్కుల విషయమై చర్చలకు ఒక అంతర్జాతీయ వేదికగా, వివాద పరిష్కార కేంద్రంగా పనిచేస్తుంది.
- అంతర్జాతీయ మేధాసంపత్తి ఒప్పందాలను పర్యవేక్షిస్తుంది.
- మేధాసంపత్తి హక్కుల రిజిస్ట్రేషన్ చేస్తుంది.

## 19న డిప్యూటీ సీఎంగా పవన్ బాధ్యతలు

▸▸ సచివాలయం రెండో బ్లాక్‌లో చాంబర్!



అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ 19వ తేదీన డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించనున్నారు. మంగళవారం ఆయన విజయవాడ రానున్నారు. బుధవారం ఉదయం సచివాలయానికి వెళ్లి బాధ్యతలు తీసుకుంటారు. సాధారణ పరిపాలన శాఖ ఇప్పటి వరకూ ఆయనకు చాంబర్ కేటాయించలేదు. డిప్యూటీ సీఎం హోదాలో ఆయనకు సచివాలయంలోని రెండో బ్లాక్‌లో చాంబర్ కేటాయించే అవకాశం ఉంది. ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన పవన్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక శాఖలు కేటాయించిన సంగతి తెలిసిందే. డిప్యూటీ సీఎం హోదాలో పవన్ పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, పర్యావరణ, అటవీ శాఖలను నిర్వహించనున్నారు.

## టీడీపీ రాష్ట్ర సారథిగా పల్లా శ్రీనివాసరావు

▸▸ చంద్రబాబు ప్రకటన.. అచ్చెన్నకు అభినందనలు



అమరావతి/విశాఖపట్నం, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడిగా గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు యాదవ్ నియమితులయ్యారు. ఈ విషయాన్ని టీడీపీ అధినేత చంద్రబాబు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ విశాఖ పార్లమెంటు అధ్యక్షుడిగా సమర్థంగా పనిచేసిన పల్లా తన నూతన బాధ్యతలను విజయవంతంగా నిర్వహిస్తారని ఆశిస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర అధ్యక్షుడిగా ఇప్పటి వరకు టీడీపీని నడిపించడంలో అద్భుత పనితీరు కనబరిచిన పార్టీ సీనియర్ నేత, రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడిని ఆయన అభినందించారు. పల్లా ఈ ఎన్నికల్లో 95,235 ఓట్ల భారీ మెజారిటీతో గాజువాక నుంచి గెలుపొందారు. రాష్ట్రంలో ఈయనదే అత్యధిక మెజారిటీ. 2014లోనూ గెలిచిన ఆయన్ను మంత్రివర్గంలోకి తీసుకోవాలని ప్రయత్నించినప్పటికీ అనేక సమీకరణల కారణంగా వీలు కాలేదని, ఇప్పుడాయనపై చాలా పెద్ద బాధ్యత పెట్టామని బాబు చెప్పినట్లు తెలిసింది. పల్లా కుటుంబం ఆది నుంచీ టీడీపీతోనే ఉంది. ఆయన తండ్రి సింహాచలం 1994లో విశాఖ-2 ఎమ్మెల్యేగా ఆ పార్టీ తరపున గెలిచారు. పల్లా విశాఖ పార్లమెంటు పార్టీ అధ్యక్షుడిగా 2000 నుంచి 2024 ఎన్నికల వరకు పనిచేశారు.

### అధినేత నమ్మకాన్ని నిలబెడతా

పార్టీ రాష్ట్ర అధ్యక్ష పదవిని కట్టబెట్టిన చంద్రబాబుకు పల్లా ధన్యవాదాలు తెలియజేశారు. తనపై గురుతర బాధ్యతను ఉంచిన అధినేత నమ్మకాన్ని నిలబెడతానని.. ఆయన ఆశీస్సులతో పదవిని సమర్థంగా నిర్వహించి అందరి మన్ననలు పొందుతానని అన్నారు. 'పూర్తి సమయం పార్టీ కోసం కేటాయిస్తా. ఇంతటి బాధ్యత తీసుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నా. కార్యకర్తలకు అండగా ఉంటా. పార్టీని, ప్రభుత్వాన్ని సమన్వయం చేసుకుంటూ పని చేస్తా. నామినేటెడ్ పదవుల విషయంలో కష్టపడిన కార్యకర్తలు, నాయకులకు అధిక ప్రాధాన్యం ఇస్తా' అని తెలిపారు. కాగా.. టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా నియమితులైన పల్లా శ్రీనివాసరావు యాదవ్‌కు వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు అభినందనలు తెలిపారు. బీసీ వర్గానికి చెందిన తనను టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడిగా ఇప్పటి వరకు కొనసాగించి, పార్టీ బలోపేతానికి కృషి చేసే అవకాశం కల్పించిన సీఎం చంద్రబాబుకు ఓ ప్రకటనలో ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

## కేన్సర్ రహిత రాష్ట్రంగా ఏపీ..!

▸▸ ఎయిమ్స్ తరహాలో ఆరోగ్య సేవలు: ఆరోగ్య మంత్రి సత్యకుమార్

▸▸ సచివాలయంలో బాధ్యతలు స్వీకరణ.. అధికారులతో సమీక్ష



అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): కేన్సర్ రహిత ఏపీగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దేందుకు అన్ని రకాల చర్యలు చేపట్టనున్నట్లు రాష్ట్ర ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ అన్నారు. అమరావతి సచివాలయంలోని ఐదవ బ్లాక్‌లో రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమం, వైద్యవిద్యాశాఖ మంత్రిగా ఆదివారం ఉదయం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా 5.30 కోట్ల మందికి కేన్సర్ స్క్రీనింగ్‌కు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం చేశారు. అలాగే చిన్న పిల్లల ఆరోగ్య సమస్యలను గుర్తించేందుకు నిర్వహించే ఆర్‌బీఎస్‌కే కార్యక్రమానికి సంబంధించిన ఫైల్‌పై కూడా సంతకం చేశారు. ఈ సందర్భంగా సత్యకుమార్ మాట్లాడుతూ... ప్రతి ఏడాది సగటున 48 వేల మంది కేన్సర్ మహమ్మారి బారినపడుతూ ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. నోటి, రొమ్ము, గర్భాశయ కేన్సర్ల నివారణపై ప్రజల్లో సరైన అవగాహన కల్పించడంతో పాటు మెరుగైన వైద్యం అందజేయాలనే లక్ష్యంతో దాదాపు 5.30 కోట్ల మందికి స్క్రీనింగ్ చేసేందుకు నిర్ణయం తీసుకుంటూ తొలి సంతకం చేశానన్నారు. రాష్ట్రంలో పెద్ద ఎత్తున యువత గంజాయి, డ్రగ్స్‌కు బానిసలుగా మారుతున్నట్లు వార్తలు వస్తున్నాయని, ఇందుకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. డ్రగ్స్‌కు బానిసలైన యువతలో మార్పు తెచ్చేందుకు డి అడిక్షన్ కేంద్రాలను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆరోగ్యశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణబాబు, ఏపీఎంఎస్ఐడీసీ ఎండీ మురళీధర్ రెడ్డి, ఆరోగ్యశ్రీ ట్రస్ట్ సీఈవో లక్ష్మీషా, కమిషనర్ ఎస్.వెంకటేశ్వర్ ఇతర అధికారులు పాల్గొన్నారు. మంత్రిగా బాధ్యతలు తీసుకున్న వెంటనే సత్యకుమార్ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఆరోగ్యశాఖలో పరిస్థితి, ప్రాధాన్యత పథకాలు, ప్రాజెక్టులపై విభాగాల వారిగా అధికారుల్ని అడిగి తెలుసుకున్నారు. కొత్త మెడికల్ కాలేజీల నిర్మాణం, ఎన్ఎంసీ అనుమతులపై కృష్ణబాబు ఆయనకు వివరించారు. జీఎన్ఎం నుంచి స్టాఫ్ నర్సుల పదోన్నతుల అంశం ఆరోగ్యశాఖకు పెద్ద తలనొప్పిగా మారిందని వివరించారు. దీనిపై స్పందించిన మంత్రి... సీఎంతో చర్చించిన తర్వాత నిర్ణయం తీసుకుందామని చెప్పారు. అలానే ఆరోగ్యశ్రీ ప్రొసీజర్లు కొన్ని ప్రభుత్వాస్పత్రుల్లోనే నిర్వహించేలా, పీజీ సర్వీస్ కోటా 30 శాతం నుంచి 15 శాతానికి కుదించేలా త్వరలోనే నిర్ణయం తీసుకుందామని చెప్పి మంత్రి సమీక్షను ముగించారు.

### అనారోగ్య శాఖగా మార్చేశారు: సత్యకుమార్

రేణిగుంట, జూన్ 16: ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆరోగ్యశాఖను అనారోగ్య శాఖగా మార్చేశారని ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ మండిపడ్డారు. ఆదివారం సాయంత్రం విజయవాడ నుంచి విమానంలో తిరుపతి చేరుకున్న ఆయన మీడియాతో మాట్లాడారు. మాజీ సీఎం జగన్ ఉత్తుత్తి బటన్‌నొక్కి అభివృద్ధిని పూర్తిగా విస్మరించారని, రాష్ట్రాన్ని అప్పులకు చిరునామాగా మార్చారని విమర్శించారు. ఆరోగ్యశాఖ విభాగాల్లో అన్నిటిపై శ్వేతపత్రం విడుదలచేసి, లోతుగా పరిశీలించి ప్రక్షాళన చేయాల్సిన అవసరం ఉందన్నారు. ఆరోగ్యశాఖపై త్వరలోనే ముఖ్యమంత్రితో సమీక్ష నిర్వహించి.. వాస్తవాలను బయటకు తీస్తామని స్పష్టం చేశారు.

## పెద్దిరెడ్డి పాపాలు బయటకు తీస్తాం

▸▸ రవాణా మంత్రి రాంప్రసాద్‌రెడ్డి



రాయచోటి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కుటుంబం చేసిన అరాచకాలు, అన్యాయాలు, పాపాలు అన్నింటినీ బయటకు తీస్తాం.. అక్రమంగా తిన్నదంతా కక్కిస్తామని రాష్ట్ర రవాణా, యువజన, క్రీడా శాఖల మంత్రి మండిపల్లి రాంప్రసాద్‌రెడ్డి అన్నారు. ఆదివారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని తన కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్రజల ఆస్తులు, సంపదను దోచుకున్న కుటుంబం పెద్దిరెడ్డిదేనని, పాలు, ఇసుక, మద్యం, ఎర్రచందనం, ఇరిగేషన్, రోడ్లు పనులు దేన్నీ తమ అక్రమ సంపాదన కోసం ఈ కుటుంబం వదలలేదని మంత్రి చెప్పారు. తంబళ్లపల్లె నియోజకవర్గం అంగళ్లు మండలంలో అనుమతులు లేకుండానే సుమారు 700 కోట్లతో ముదివేడు బ్యాలెన్సింగ్ రిజర్వాయర్‌ను పెద్దిరెడ్డి కుటుంబం నిర్మించిందని పేర్కొన్నారు. పెద్దిరెడ్డి కుటుంబం రైతుల నుంచి భూములు లాగేసుకుందని ఆరోపించారు. దీనిపై సమగ్ర విచారణ చేసి బాధిత రైతులకు న్యాయం చేస్తామన్నారు. ఇసుక క్వారీలు, గ్రానైట్ కంపెనీలను పెద్దిరెడ్డి కుటుంబం అక్రమంగా లాక్కుందని, వీటిపైనా విచారణ జరిపిస్తామన్నారు. అక్రమంగా ఇసుక రీచ్‌ల నుంచి ఇసుకను తరలించి పక్క రాష్ట్రాలకు అమ్ముకున్న ఘటనలపైనా విచారణ చేసి అందరి చిట్టా బయటకు తెస్తామన్నారు. రోడ్డు ప్రమాదాలు జరగకుండా అన్ని శాఖలను సమన్వయ పరిచి చర్యలు తీసుకుంటామన్నారు. గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు నిజమైన క్రీడాకారులను ప్రోత్సహిస్తామని తెలిపారు.

# మళ్లీ పోలవరం

(మొదటి పేజీ తరువాయి)

పూర్తికావలసిన మిగిలిన హెడ్ వర్క్స్ పనుల అంచనా వ్యయాన్ని గత ఐదేళ్ల సీఎంగా ఉన్న జగన్మోహన్‌రెడ్డి భారీగా పెంచేశారు. వాటికి, డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంలు, గైడ్‌బండ్ మరమ్మతుల అంచనాలను ఏకంగా రూ.21 వేల కోట్లకు పెంచేశారు. కేంద్రంతో సంప్రదింపులు జరిపి.. జగన్ ప్రభుత్వం చేసిన విధ్వంసంపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలన్న డిమాండ్ నేపథ్యంలో.. చంద్రబాబు ఎలాంటి నిర్ణయం తీసుకుంటారోనన్న ఆసక్తి సర్వత్రా నెలకొంది.



చంద్రబాబురాక నేపథ్యంలో పోలవరం ప్రాజెక్టు వద్ద ఏర్పాట్లు.. శంకుస్థాపన స్థూపం

### 2016లో బాబు శంకుస్థాపన

వైఎస్ సీఎంగా ఉన్నప్పుడు 2005లో భద్రచలం వద్ద భారీ సెట్టింగులు వేసి ఇందరా సాగర్ పేరిట పోలవరం ప్రాజెక్టు పనులకు శంకుస్థాపన చేశారు. హెడ్‌వర్క్స్ పనులు ఎక్కడ చేపట్టాలో నిర్ణయించకుండానే.. సులువైన కుడి కాలువ మట్టి తవ్వకం పనులు చేపట్టారు. ఇందులో భారీ అక్రమాలు జరిగాయి. ఎడమ కాలువ తవ్వకం పనులూ ప్రారంభించారు. రాజశేఖర్‌రెడ్డి తన ఐదేళ్ల పాలనలో హెడ్‌వర్క్స్ పనులకు శంకుస్థాపన కూడా చేయలేకపోయారు. రాష్ట్ర విభజన జరిగాక.. 2014లో తెలంగాణ నుంచి ఏడు ముంపు మండలాలను ఏపీలో విలీనం చేశాకే ప్రాజెక్టుకు ఓ రూపం వచ్చింది. ఈ ప్రాజెక్టును ఇతర జలాశయాల తరహాలో గోదావరి ప్రవాహానికి అడ్డంగా నిర్మించడం లేదు. అడ్డంగా స్పిల్ వే, స్పిల్ చానల్ నిర్మాణం చేపట్టేందుకు నేల స్వభావం సహకరించలేదు. 150 మీటర్ల లోతుదాకా బంకమట్టితో కూడిన చౌడు నేల ఉంది. ఇలాంటి చోట స్పిల్‌వే, స్పిల్ చానల్ నిర్మించి 48 రేడియల్ గేట్లను బిగించి 194.6 టీఎంసీల జలాలను నిల్వ చేస్తే.. భారీ వరదకు కొట్టుకు పోతాయి. అందుకే ఏకంగా గోదావరి నదీ మార్గాన్నే మళ్లించాలని నిర్ణయించారు. తెలంగాణ నుంచి విలీనమైన రామయ్యపేట వద్ద స్పిల్‌వే, స్పిల్ చానల్ పనులకు 2016 డిసెంబరు 30న నాటి సీఎం చంద్రబాబు శంకుస్థాపన చేశారు. నాడు ప్రారంభమైన పనులు 2019 ఫిబ్రవరి నాటికి.. 72 శాతం వరకు పూర్తయ్యాయి.

### చేయాల్సింది చేయకుండా..

2013-14 అంచనా వ్యయం రూ.20,398 కోట్లు కాగా.. 2017-18నాటి పెరిగిన ధరల ప్రకారం రూ.55,548.74 కోట్లకు చంద్రబాబు సవరించి కేంద్రం ఆమోదానికి పంపారు. కమీషన్ల కోసమే భారీగా పెంచారని జగన్ ఆరోపణలు గుప్పించారు. తాను అధికారంలోకి వచ్చాక ఓ కమిటీని వేసి రూ.3,128.31 కోట్ల మేర అక్రమాలు జరిగాయని నివేదిక తెప్పించుకున్నారు. దాని ఆధారంగా విజిలెన్స్-ఎన్‌ఫోర్స్‌మెంట్ దర్యాప్తు జరపాలని నిర్ణయించారు. ఈ సమాచారాన్ని కేంద్రానికి పంపారు. అయితే ఈ ప్రాజెక్టుకు తానే యజమానినని.. పనుల్లో లోపాలుంటే తానే దర్యాప్తు చేస్తానని కేంద్రం స్పష్టం చేయడంతో విజిలెన్స్ విచారణపై వెనక్కి తగ్గారు. కానీ కేంద్రం వద్దన్నా నాటి కాంట్రాక్టు సంస్థ నవయుగ ఇంజనీరింగ్‌ను తొలగించారు. హెడ్‌వర్క్స్‌లో మిగిలిన పనులకు రూ.1,771 కోట్ల అంచనా వ్యయంతో బిడ్లు పిలిచారు. మేఘా ఇంజనీరింగ్ ఒక్కటే బిడ్ దాఖలు చేసింది. ఆ పనులను రూ.1,548.13 కోట్లకు దానికి కట్టబెట్టింది. 2021 డిసెంబరునాటికి పూర్తి చేస్తానన్న మేఘా ఒప్పందం చేసుకుంది. ఇప్పటికీ దిక్కులేదు. ఇక రూ.55,548.74 కోట్ల అంచనా వ్యయంపై తీవ్ర విమర్శలు గుప్పించిన జగన్.. ఆ మొత్తానికే ఆమోదించాలని ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాను కలిసినప్పుడల్లా అడిగారు. ఇక 2019 నవంబరు నుంచి ప్రారంభం కావలసిన పనులు ప్రారంభించలేదు. ఎర్త్ కమ్ రాక్‌ఫిల్(ఈసీఆర్ఎఫ్) డ్యాం పనులు చేయలేదు. దీంతో 2020లో అకస్మాత్తుగా వచ్చిన వరదకు డయాఫ్రం వాల్ దెబ్బతింది. ఇక ప్రాజెక్టు గరిష్ఠ నీటి మట్టం 45.72 మీటర్ల కాంటూరులో 194.60 టీఎంసీల నిల్వకు కూడా జగన్ తూచ్ అనేశారు. కేవలం 41.15 మీటర్ల కాంటూరులో 115 టీఎంసీల నిల్వ చేస్తూ మిని రిజర్వాయరుకు పరిమితం చేసేందుకే మొగ్గు చూపారు. కేంద్రానికి కూడా తొలిదశ అంటూ కార్యాచరణ ప్రణాళికలు పంపుతూ వచ్చారు. 2021, 2022 సంవత్సరాల్లో గోదావరికి వచ్చిన భారీ వరద కారణంగా .. డయాఫ్రం వాల్, ఎగువ, దిగువ కాఫర్ డ్యాంలు, గైడ్‌బండ్ దెబ్బతిన్నాయి. వీటి మరమ్మతుల కోసం రూ.21,000 కోట్ల దాకా వ్యయం అవుతుందని కేంద్రానికి రాష్ట్ర జల వనరుల శాఖ అంచనాలను పంపింది. వీటిని పరిశీలించిన కేంద్ర ఆర్థిక శాఖ రూ.12,911.13 కోట్లు ఇచ్చేందుకు అంగీకరించింది. కానీ కేబినెట్ ఆమోదించలేదు.

### వాయిదాలపై వాయిదాలు

ప్రాజెక్టు పూర్తికి గడువును జగన్ ఎప్పటికప్పుడు పెంచుకుంటూ పోయారు. ఇక సహాయ పునరావాసాన్ని కూడా జగన్ వదిలేశారు. నిర్వాసితులకు పూర్తిస్థాయి పునరావాసం కల్పించకుండా వారి గ్రామాలను ముంచడం సరికాదని చంద్రబాబు భావించి పునరావాసానికే అధిక ప్రాధాన్యం ఇచ్చి ప్రాజెక్టు పనులతో పాటు పునరావాసాన్ని కూడా సమీక్షించేవారు. నిర్వాసితులను దృష్టిలో ఉంచుకుని కాఫర్ డ్యాంను పూర్తి చేయకుండా.. గోదావరి జలాలు కిందకు వెళ్లడానికి ఏ ఆటంకం లేకుండా చంద్రబాబు చూస్తే.. జగన్ మాత్రం కాఫర్ డ్యాం పూర్తి చేసి, దాని ఎత్తును పెంచేసి గ్రామాలను వరదలకు ముంచేశారు. నిర్వాసితులను మాయమాటలతో గ్రామాల నుంచి ఖాళీ చేయించి, పరిహారం చెల్లించకుండానే భూములను లాగేసుకున్నారు. 56,495 నిర్వాసిత కుటుంబాలకు గానూ 12,797 కుటుంబాలకు మాత్రమే పునరావాసం అమలైంది. ప్రాజెక్టులో 194.6 టీఎంసీల జలాలను నిల్వ చేస్తేనే.. 960 మెగావాట్ల జల విద్యుత్ ఉత్పత్తి చేసే వీలుంటుంది. కానీ విద్యుదుత్పత్తి కోసం జగన్ మరో రూ.700 కోట్లతో ఎత్తిపోతల పథకాన్ని ప్రతిపాదించారు.

### సీఎం షెడ్యూల్ ఇదీ..

ముఖ్యమంత్రి చంద్రబాబు సోమవారం ఉదయం 11 గంటలకు చంద్రబాబు ఉండవల్లి నివాసం నుంచి బయల్దేరి మధ్యాహ్నం 12 గంటలకు పోలవరం చేరుకుంటారు. 12.05 నుంచి 1.30 గంటల వరకు కుంగిన గైడ్‌బండ్‌తో పాటు నిలిచిపోయిన అన్ని పనులనూ పరిశీలిస్తారు. మధ్యాహ్నం 2.05 నుంచి 3.05 గంటల వరకు ప్రాజెక్టు అధికారులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం 3.10 గంటల నుంచి 3.40 వరకు గెస్ట్‌హౌస్‌లో మీడియా సమావేశం నిర్వహిస్తారు. సాయంత్రం 4 గంటలకు ఉండవల్లికి బయల్దేరతారు. ఇంకోవైపు.. ప్రాజెక్టు అధికారులు 3 రోజుల నుంచి రాత్రింబవళ్లూ పని చేసి ప్రాజెక్టు ప్రాంతానికి కళ తెచ్చారు. చంద్రబాబు శంకుస్థాపన చేసిన శిలాఫలకం మళ్లీ వెలుగు చూసింది. జగన్ సర్కారు నిర్లక్ష్యంతో అది తుప్పలతో నిండిపోయింది. దానిని శుభ్రం చేసి అధికారులు అందంగా తయారు చేశారు. అలాగే స్థూపాన్ని కూడా శుభ్రపరిచారు.

## శాసనసభ స్పీకర్‌గా అయ్యన్నపాత్రుడు



అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే, బీసీ నాయకుడు చింతకాయల అయ్యన్నపాత్రుడిని ముఖ్యమంత్రి చంద్రబాబు ఖరారుచేసినట్లు టీడీపీ వర్గాలు తెలిపాయి. అనకాపల్లి జిల్లా నర్సీపట్నం నియోజకవర్గం నుంచి 24,676 ఓట్ల మెజారిటీతో విజయం సాధించిన ఆయన అసెంబ్లీలో అడుగు పెట్టడం ఇది ఏడోసారి. 1982లో పార్టీ ఆవిర్భావ సమయం నుంచీ టీడీపీలో ఉన్నారు. 1983, 85, 94, 99, 2004, 14, 24ల్లో ఎమ్మెల్యేగా విజయం సాధించారు. 1996లో అనకాపల్లి నుంచి లోక్‌సభకు ఎన్నికయ్యారు. ఎన్టీఆర్, చంద్రబాబు మంత్రివర్గాల్లో పనిచే శారు. ఇటీవలి మంత్రివర్గ ఏర్పాటులోనే ఆయనకు బెర్తు లభించడం ఖాయమని ఆ పార్టీ వర్గాలు భావించాయి. కానీ సామాజిక సమీకరణల దృష్ట్యా అవకాశం దక్కలేదు. గత ఐదేళ్లలో అధికార వైసీపీపైన, ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డిపైనా ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. దీంతో ఆయనపై పలు అక్రమ కేసులు బనాయించారు. నిర్భయ చట్టం కింద కూడా కేసు నమోదు చేశారు. ఇరిగేషన్ భూమికి ఫోర్జరీ ధ్రువపత్రాలతో ఎన్‌వోసీ తీసుకున్నారన్న ఆరోపణలతో సీఐడీ పోలీసులు 2022 నవంబరు 2వ తేదీన అర్ధరాత్రి దాటాక ఇంటి గోడలు దూకి మరీ ఆయన్ను, ఆయన కుమారుడిని అరెస్టు చేయడం తెలిసిందే. తాజా ఎన్నికల్లో టీడీపీ కూటమి విజయం అనంతరం ఏర్పాటైన మంత్రివర్గంలో చంద్రబాబు ఆయనకు మంత్రి పదవి ఇవ్వలేకపోయారు. దరిమిలా స్పీకర్ పదవి ఇవ్వాలని నిర్ణయించారు. స్పీకర్ పదవిని కోరుతూ ఒకరిద్దరు సీనియర్లు ముఖ్యమంత్రిని కలిసి మాట్లాడగా.. అయ్యన్నను ఎంపిక చేస్తున్నట్లు ఆయన వారికి తెలిపారు. చంద్రబాబు గతంలో ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు 1999లో ఉత్తరాంధ్రకే చెందిన ప్రతిభాభారతికి స్పీకర్‌గా అవకాశం కల్పించిన విషయం విదితమే. ఇప్పుడు మరోసారి అదే ప్రాంతానికి చెందిన అయ్యన్నపాత్రుడికి ఆ పదవి దక్కనుంది.

## డిప్యూటీ స్పీకర్‌గా జనసేనకు చాన్స్

▸▸ చీఫ్ విప్‌గా ధూళిపాళ్ల నరేంద్ర!

కేబినెట్‌లో మూడు మంత్రి పదవులు దక్కించుకున్న జనసేనకు.. అసెంబ్లీలో డిప్యూటీ స్పీకర్ పదవి కూడా ఇవ్వాలని నిర్ణయించారు. దీనిని ఎవరికి ఇవ్వాలన్న అంశంపై జనసేన అధినేత, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ కసరత్తు చేస్తున్నారు. కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి పేర్లను పరిశీలిస్తున్నట్లు తెలిసింది. వీరిద్దరూ తొలిసారి ఎమ్మెల్యేలే. వీరిలో మాధవికే ఈ పదవి దక్కే అవకాశం ఉన్నట్లు సమాచారం. కాగా... ప్రభుత్వ చీఫ్ విప్‌గా పొన్నూరు టీడీపీ సీనియర్ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌ను నియమించాలని సీఎం చంద్రబాబు నిర్ణయించినట్లు తెలుస్తోంది. నరేంద్రకు ఇప్పటి వరకూ మంత్రి పదవి రాలేదు. ఈసారి వస్తుందని అనుకున్నా గుంటూరు జిల్లా నుంచి ముగ్గురుకు మంత్రి పదవులు ఇచ్చారు. దీంతో ఆయనకు చాన్స్ మిస్ అయింది. ఆ లోటును భర్తీ చేయడానికి చీఫ్ విప్ ఇవ్వాలని నిర్ణయించినట్లు చెబుతున్నారు.

## పరిశ్రమల ఏర్పాటుకు ప్రోత్సాహం: మంత్రి కొండపల్లి

విజయనగరం (ఆంధ్రజ్యోతి), జూన్ 16: సూక్ష్మ, చిన్నతరహా పరిశ్రమల ఏర్పాటును ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని, సీఎం చంద్రబాబు, ఐటీ మంత్రి లోకేశ్ సూచనల మేరకు ఇందుకోసం ప్రత్యేక విభాగాన్ని కూడా ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర సూక్ష్మ, చిన్న తరహా పరిశ్రమల శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. ఆదివారం విజయనగరం వచ్చారు. టీడీపీ జిల్లా కార్యాలయంలో మాట్లాడారు. గత ప్రభుత్వంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం కరువైందన్నారు. ఆర్థికంగా రాష్ట్రం దెబ్బతిందని, ఎన్ఆర్ఐలు రాష్ట్రంలో భారీగా పెట్టుబడులు పెట్టాలని కోరారు. ఇది వరకు పరిశ్రమలు ఏర్పాటు చేస్తామని కొందరు భూములు తీసుకున్నారని, వాటిని నెలకొల్పారా లేదా? వాటి ప్రగతి ఏంటో చూసి ఆ భూములపై నిర్ణయం తీసుకుంటామని మంత్రి చెప్పారు. నిరుద్యోగ యువతకు ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామన్నారు. మహిళల అభివృద్ధికి సెర్ప్ ద్వారా మరిన్ని నిధులు విడుదల చేస్తామని తెలిపారు.

## ఉన్నత విద్య కార్యదర్శిగా పోలా భాస్కర్ బాధ్యతలు

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు టీటీడీ ఈవోగా బదిలీ కావడంతో ఆ బాధ్యతలను కళాశాల విద్యాశాఖ కమిషనర్ పోలా భాస్కర్‌కు అప్పగిస్తూ సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. భాస్కర్‌కు పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు అప్పగిస్తున్నట్లు అందులో పేర్కొన్నారు.

# అమరావతిపైనే ఆశలు

▸▸ చిత్తశుద్ధి, పట్టుదలతోనే సాధ్యం

▸▸ వ్యూహాత్మక అడుగులు కీలకం

▸▸ న్యాయ సమస్యలు రాకుండా చర్యలు

▸▸ భూములిచ్చిన రైతులకు అప్పుడే భరోసా

▸▸ ప్రభుత్వానికి అందిన మేధావుల సలహాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

రాష్ట్ర రాజధాని అమరావతిపై ప్రజలకు, భూములు ఇచ్చిన రైతులకు కోటి ఆశలు ఉన్నాయి. అనేక ఆకాంక్షలు కూడా ఉన్నాయి. మూడు రాజధానుల ప్రతిపాదనను తిరస్కరించిన ప్రజలు అమరావతికి కట్టుబడతామన్న టీడీపీ కూటమికి భారీ మెజారిటీ ఇచ్చి గెలిపించారు. వీరి ఆశలు, ఆకాంక్షలు నెరవేరాలంటే రాష్ట్ర ప్రభుత్వం పక్కా ప్రణాళికలతో ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని పలువురు మేధావులు సూచిస్తున్నారు. మార్చి 31, 2029 గడువుతో అమరావతి ప్రాజెక్ట్ ఫేజ్-1ను నూరుశాతం ముగిసే లక్ష్యంగా పనిచేయాల్సిన అవసరముందని భావిస్తున్నారు. అయితే, గత జగన్ సర్కారు అమరావతి విధ్వంస పరిణామాల దృష్ట్యా, రాజధాని పునర్నిర్మాణానికి వచ్చే ఐదేళ్ల కాలంలో ఎంతో వ్యూహాత్మకంగా అడుగులు వేస్తే తప్ప ముందుకు సాగలేరని మేధావులు చెబుతున్నారు. భవిష్యత్తులో మరోసారి అలాంటి విధ్వంస ఆలోచనలకు తావు లేకుండా, సమగ్ర, ఆచరణాత్మక లక్ష్యాలను నిర్దేశించుకుని అడుగులు వేయాలని అంటున్నారు. ఈ క్రమంలో మేధావులు, రైతులు, పెట్టుబడిదారులు, ఉన్నతాధికారుల నుంచి సర్కారు కొన్ని విషయాలను సేకరించి పరిశీలన చేస్తోంది.

### తక్షణ కర్తవ్యం

- గత ప్రభుత్వ నిర్వాకం కారణంగా నిలిచిపోయిన పనుల వల్ల కలిగిన భౌతిక, ఆర్థిక నష్టాన్ని సాంకేతిక నిపుణులతో సమీక్షించి అంచనా వేయాలి. కట్టడాల ప్రస్తుత నాణ్యతను పరిగణనలోకి తీసుకుని ఆ పనులన్నింటినీ సవరించిన అంచనాలతో తిరిగి మొదలు పెట్టడానికి చర్యలు చేపట్టాలి.
- వచ్చే ఐదేళ్లలో న్యాయపరమైన ఇబ్బందులు లేకుండా దశల వారీగా పనులు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలి. పెండింగ్ బిల్లులు, మొబలైజేషన్ అడ్వాన్సులు, కాంట్రాక్టులకు గడువు పెంచడం, ఉన్న కాంట్రాక్టులు రద్దు చేసి కొత్త కాంట్రాక్టులు పిలవడం తదితర చర్యలు తీసుకోవాలి. పెండింగ్ భూసమీకరణ, ల్యాండ్ పూలింగ్ కింద భూములిచ్చిన రైతులకు కేటాయించిన ప్లాట్లు, వాటికి సంబంధించిన న్యాయపరమైన చిక్కులను సత్వరమే పరిష్కరించి ఏపీసీఆర్‌డీఏకు అప్పగించాలి.
- రైతులకు కేటాయించిన ప్లాట్లులో సీసీ రోడ్లను, వాటర్, పవర్, స్ట్రీట్‌లైటింగ్, ఫుట్‌పాత్ తదితర సర్వహంగులతో పూర్తి చేసి వచ్చే మూడు సంవత్సరాల్లో వారికి అందించాలి. మార్చి 2027 నాటికి రైతులందరికీ లాస్ట్‌మైల్ కనెక్టివిటీతో వారి ప్లాట్లను అభివృద్ధి చేసి అందించాలి. పెండింగ్ రిజిస్ట్రేషన్లు నిర్దిష్ట కాలపరిమితితో పూర్తి చేయాలి.
- అమరావతిలోని సీడ్ యాక్సిస్‌రోడ్లు, కనెక్టివిటీ రోడ్లు, ఎమ్మెల్యే ఎమ్మెల్సీ, ఏఐఎస్, గెజిటెడ్, నాన్ గెజిటెడ్, గ్రూప్-డీ క్వార్టర్స్, సెక్రటరీ, ప్రిన్సిపల్ సెక్రటరీ, న్యాయమూర్తులు, మంత్రుల బంగళాలు, ఏపీసీఆర్‌డీఏ ప్రాజెక్టు ఆఫీసు, టిడ్కో హౌసింగ్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ సత్వరమే పూర్తి చేయాలి.
- అమరావతిని రాయలసీమ, ఉత్తరాంధ్ర నుంచి రాష్ట్ర, జాతీయ రహదారులతో మూడేళ్లలో అనుసంధానించాలి. భవిష్యత్తు రాజధాని తాగునీటి అవసరాల కోసం వైకుంఠపురం వద్ద 40 టీఎంసీల సామర్థ్యం ఉన్న రిజర్వాయర్‌ను పైప్‌లైన్ సదుపాయాలతో 4 ఏళ్ల కాలపరిమితితో పూర్తి చేయాలి.

## పిన్నెల్లి సోదరులపై రౌడీషీట్

▸▸ మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నేత రామకృష్ణారెడ్డిపై 14 కేసులు

మాచర్లటౌన్, జూన్ 16: పల్నాడు జిల్లా మాచర్ల నియోజకవర్గం మాజీ ఎమ్మెల్యే, వైసీపీ నాయకుడు పిన్నెల్లి రామకృష్ణారెడ్డి, ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డిలపై పోలీసులు రౌడీషీట్ తెరిచారు. ఇద్దరిపైనా విడివిడిగా రౌడీ షీట్లు తెరిచినట్లు గురజాల డీఎస్పీ సీహెచ్ శ్రీనివాసరావు తెలిపారు. ఇక నుంచి వారిపై నిరంతరం నిఘా ఉంటుందని వివరించారు. రామకృష్ణారెడ్డిపై హత్యాయత్నం సహా 14 కేసులు నమోదయ్యాయని, ఆయన సోదరుడు వెంకట్రామిరెడ్డిపై కూడా హత్యాయత్నం సహా 9 కేసులు నమోదైనట్లు వివరించారు.

### నేరాలు-ఘోరాలు!

మాచర్ల నియోజకవర్గంలో పిన్నెల గెలుపొందేందుకు తన సోదరుడు వెంకట్రామిరెడ్డితో కలిసి హింసకు పాల్పడ్డారు. పోలింగ్‌కు ముందు రోజు మొదలుకొని పోలింగ్ రోజు, ఆ మరుసటి రోజు దారుణాలకు పాల్పడ్డారు.

- మే 12న రెంటచింతలలో పిన్నెల్లి అనుచరుడు మోర్తాల ఉమమహేశ్వరరెడ్డి టీడీపీ ఏజెంట్లు మల్లయ్య, సిద్ధయ్యపై దాడి చేసి గాయపరిచాడు. మే 13 పోలింగ్ రోజున పిన్నెల్లి రామకృష్ణారెడ్డి రెంటచింతల మండలంలోని పాలువాయిగేటు గ్రామంలో 202 పోలింగ్ బూత్‌లోకి దౌర్జన్యంగా ప్రవేశించి ఈవీఎం, వీవీప్యాట్‌లను ధ్వంసం చేశారు.
- అడ్డుకోబోయిన టీడీపీ ఏజెంట్ నంబూరి శేషగిరిరావుపై మారణాయుధాలతో దాడి చేయించారు. రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదైంది.
- వెల్దుర్తి మండలం కొత్తపుల్లారెడ్డిగూడెంలో టీడీపీ ఏజెంట్ రేఖ్యానాయక్‌పై దాడి చేసిన ఘటనలో కూడా రామకృష్ణారెడ్డిపై 307 సెక్షన్ కింద కేసు నమోదైంది.
- పోలింగ్ మరుసటి రోజు కారంపూడిలో సీఐ నారాయణస్వామిపై జరిగిన దాడిలో రామకృష్ణారెడ్డిపై 307 కేసు నమోదైంది.
- ఇవి కాక మరో 11 ఘర్షణల్లో వివిధ సెక్షన్ల కింద రామకృష్ణారెడ్డిపై కేసులు నమోదు అయ్యాయి. అలాగే ఆయన సోదరుడు పిన్నెల్లి వెంకట్రామిరెడ్డి పోలింగ్ మరుసటి రోజు మే 14న కారంపూడి పట్టణంలో వందలాది రౌడీమూకలతో మారణాయులతో టీడీపీ కార్యాలయం, ప్రైవేటు ఆస్తుల ధ్వంసంలో పాల్గొనగా అడ్డుకోబోయిన సీఐ నారాయణస్వామిపై దాడి చేసిన సంఘటనలో 307 సెక్షన్ కింద కేసు నమోదైంది.
- పోలింగ్ రోజు మాచర్ల పట్టణంలో టీడీపీ నేత యెనుముల కేశవరెడ్డి ఇంటి వద్ద టీడీపీ కార్యకర్తలను తన వాహనంతో ఢీకొట్టి మారణాయుధాలతో విచక్షణారహితంగా దాడి చేసిన సంఘటనలో గాయపడ్డ ఆదూరి అలైక్యరావుతోపాటు మరో ఆరుగురికి తీవ్ర గాయాలైన సంఘటనలో 307 కేసు నమోదైంది.

## పెద్దిరెడ్డి సోదరులకు హైకోర్టు నోటీసులు

బి.కొత్తకోట, జూన్ 16: పుంగనూరు ఎమ్మెల్యే, మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, అయన సోదరుడు తంబళ్లపల్లె ఎమ్మెల్యే ద్వారకానాథ్‌రెడ్డిల నుంచి తనకు ప్రాణహాని ఉందని అన్నమయ్య జిల్లా బి.కొత్తకోటకు చెందిన జడ్డి రామకృష్ణ హైకోర్టులో రిట్ పిటిషన్ వేశారు. అత్యవసర విచారణ కింద స్పందించిన హైకోర్టు ఈ విషయమై విచారణ జరిపి నివేదిక అందచేయాలని అన్నమయ్య జిల్లా ఎస్పీ కృష్ణారావుకు ఆదేశాలు జారీ చేసినట్లు జడ్డి రామకృష్ణ తెలిపారు. ప్రతివాదులైన పెద్దిరెడ్డి సోదరులతో పాటు మరో 12 మందికి కౌంటర్ దాఖలు చేయాల్సిందిగా నోటీసులు అందినట్లు తెలుస్తోంది. ఈ విషయమై జడ్డి రామకృష్ణ మాట్లాడుతూ.. పెద్దిరెడ్డి తన అధికారాన్ని అడ్డుపెట్టుకొని అనేక అక్రమాలు చేశారని, తనను వేధించారని ఆరోపించారు.

# పాత మాస్టర్ ప్లాన్ ప్రకారమే అమరావతి

(మొదటి పేజీ తరువాయి)



సచివాలయంలో బాధ్యతలు స్వీకరించిన నారాయణ

ఎప్పటిలోగా పూర్తి చేస్తామో కాలపరిమితి నిర్దేశిస్తామని తెలిపారు. ఆదివారం వెలగపూడి సచివాలయంలో బాధ్యతలు చేపట్టిన అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడారు. గతంలో టీడీపీ ప్రభుత్వం ఉన్నప్పుడు రూ.48 వేల కోట్లతో అమరావతి నిర్మాణానికి టెండర్లు పిలిచి పనులు మొదలుపెట్టామన్నారు. చంద్రబాబు ఆదేశాలకు అనుగుణంగా ప్రపంచంలో టాప్ టెన్ నగరాల్లో నూతన రాజధాని నిలిచేలా పనులు చేశామని తెలిపారు. చిన్న లిటిగేషన్ కూడా లేకున్నా.. గత జగన్ ప్రభుత్వం రాజధాని నిర్మాణాన్ని అర్ధాంతరంగా నిలిపేసిందని ఆవేదన వ్యక్తంచేశారు. 'భూములిచ్చిన రాజధాని రైతులను నిలువునా మోసం చేసింది. మూడు రాజధానుల పేరు చెప్పి రాజధాని అమరావతిని ధ్వంసం చేసింది. దాని అరాచక పాలనతో ప్రజలు విసుగు చెంది టీడీపీ కూటమికి అధికారం ఇచ్చారు. త్వరలోనే రాజధాని నిర్మాణ పనులు పునఃప్రారంభిస్తాం. మూడు దశల్లో రాజధాని అమరావతిని నిర్మించాలని గతంలో ప్రతిపాదనలు రూపొందించి అమలు చేశాం. తొలి దశ పనులకు రూ.48 వేల కోట్లు ఖర్చవుతాయి. మూడు దశల్లో కలిపి రాజధాని నిర్మాణానికి రూ.లక్ష కోట్లు వ్యయమవుతాయి' అని వివరించారు. రాజధానిపై కోర్టులో ఉన్న కేసులపై అధ్యయనం చేసి సానుకూల చర్యలు తీసుకుంటామన్నారు. రాజధాని రైతులకు కచ్చితంగా న్యాయం చేస్తామని తెలిపారు. రాజధానిలో రోడ్ల ధ్వంసం సహా దొంగతనాలపై కచ్చితంగా చర్యలుంటాయని.. కమిటీ వేసి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.

### మంత్రి పేషీలో శ్రీలక్ష్మి హల్‌చల్

రెండు రోజుల కిందట ఐఏఎస్, ఐపీఎస్ అధికారులందరూ సీఎం చంద్రబాబును కలిసినప్పుడు ఆయన పురపాలక శాఖ ప్రత్యేక సీఎస్ శ్రీలక్ష్మి ఇచ్చిన పుష్పగుచ్ఛం తీసుకునేందుకు నిరాకరించారు. ఆ తర్వాత వైసీపీతో అంటకాగిన ఐఏఎస్‌లు అడ్డగోలుగా ఫైళ్లు నడిపిన తీరును ప్రస్తావించారు. ఆదివారం మంత్రి నారాయణ పేషీలో శ్రీలక్ష్మి హల్‌చల్ చేశారు. ఆ శాఖకు ప్రత్యేక సీఎస్ అయినందున.. నారాయణ సతీమణి వద్ద ఎక్కువ సేపు ఉండి కలుపుగోలుగా మాట్లాడే యత్నాలు చేశారు. ప్రతిదానికీ మంత్రి వద్దకు వెళ్లి మాటలు కలపడం చూస్తే మళ్లీ ఇదే శాఖలో కొనసాగే కోరిక ఆమెకు ఉందేమోనని పలువురు అనుమానాలు వ్యక్తం చేశారు. అయితే ఆ తర్వాత ఏదో ఫైలుపై సంతకాల కోసం ఆమె వస్తే నారాయణ పక్కనపెట్టారు.

# యూపీఎస్సీ ప్రిలిమ్స్.. సూటిగా ప్రశ్నలు

## పేపర్ సులభం.. పెరగనున్న కటాఫ్!

» కటాఫ్ 80-95గా ఉండే చాన్స్: నిపుణులు

ఆంధ్రజ్యోతి ఎడ్యుకేషన్ డెస్క్: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(యూపీఎస్సీ) ఆదివారం నిర్వహించిన సివిల్స్ ప్రిలిమినరీ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. పరీక్ష కేంద్రాల వద్ద అధికారులు నిబంధనలను కఠినంగా అమలు చేశారు. అరగంట ముందే గేట్లను మూసివేయడంతో.. ఒక్క నిమిషం ఆలస్యమైన విద్యార్థులెందరో పరీక్ష రాయలేకపోయారు. పలు కేంద్రాల వద్ద మహిళా అభ్యర్థులు పరీక్షకు అనుమతించకపోవడంతో కంటతడి పెట్టారు.

### సులభంగా పేపర్లు

సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో మొదటి అంకమైన ప్రిలిమ్స్ పేపర్ సులువుగానే ఉందని అభ్యర్థులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఉదయం నిర్వహించిన జనరల్ స్టడీస్(జీఎస్), మధ్యాహ్నం జరిగిన సీశాట్-- రెండూ సులభంగానే వచ్చాయని సివిల్స్ మెంటార్ ఎం.బాలలత పేర్కొన్నారు. "సీశాట్ అర్హత పరీక్ష కాగా, జనరల్ స్టడీస్ పేపర్‌లో వచ్చిన మార్కులు ప్రాతిపదికగానే కటాఫ్‌ను నిర్ణయించి, మెయిన్స్‌కు పంపుతారు. సీశాట్ ప్రశ్నలు కూడా నాన్ మ్యాథ్స్ అభ్యర్థులకూ చాలా ఈజీగా ఉంది. దాంతో చాలా మంది అందులో అర్హత సాధిస్తారు. అలా చూసుకున్నా ఈసారి కటాఫ్ పెరిగే అవకాశం ఉంది" అని 'లా ఎక్సలెన్స్ ఐఏఎస్' అధినేత డాక్టర్ రాంబాబు వ్యాఖ్యానించారు.

### తికమక పెట్టకుండా..

జనరల్ స్టడీస్‌లో ఈసారి చాలా ప్రశ్నలు నేరుగా వచ్చాయి. తికమక పెట్టే ప్రశ్నలు తక్కువ. ప్రశ్నల నిడివి కూడా పెద్దగా లేదు. ఆప్షన్స్‌లో సందిగ్ధత లేదు. అందుకే ఈసారి కటాఫ్ 80-95 మధ్య ఉండవచ్చని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. 90 ఆపై మార్కులు సాధిస్తామని భావించే అభ్యర్థులు వెంటనే మెయిన్స్‌పై దృష్టి సారించవచ్చని చెబుతున్నారు. గత ఏడాది రెండు పేపర్లూ కష్టంగా ఉండటంతో కటాఫ్ 75 మార్కులుగా నిర్ణయించిన విషయం తెలిసిందే.! జనరల్ స్టడీస్‌లో పాలిటీ నుంచి 20 ప్రశ్నలు వచ్చాయి. మిగతా సబ్జెక్టుల వారీగా చూస్తే.. భూగోళశాస్త్రం(19 ప్రశ్నలు), ఎకానమీ(14), పర్యావరణం-వ్యవసాయం(12), అంతర్జాతీయ సంబంధాలు(11), శాస్త్ర సాంకేతిక రంగాలు(10), చరిత్ర-కళలు-సంస్కృతి(9), ప్రభుత్వ పథకాలు, వర్తమాన వ్యవహారాలు(5) ఆ తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. పాలిటీలో ప్రశ్నలు సులువుగా ఉన్నాయి. అంతర్జాతీయ సంబంధాల నుంచి వచ్చిన ప్రశ్నలు కొంత మధ్యస్థంగా ఉన్నాయి. జాగ్రఫీలో క్లయిమెటాలజీ ప్రశ్నలు ఎక్కువగా వచ్చాయి. హిస్టరీలో ఎక్కువగా ప్రాచీన భారత దేశ చరిత్ర నుంచి ప్రశ్నలు అడిగారు. సింగిల్ స్టేట్‌మెంట్ ప్రశ్నలు ఎక్కువ రావడం కూడా ఈసారి బాగా కలిసివచ్చింది. ఎకానమీ, జాగ్రఫీలో కాన్సెప్ట్ ఆధారిత ప్రశ్నలు వచ్చాయి. బేసిక్స్ బలంగా ఉన్న అభ్యర్థులకు పాలిటీలో ఎక్కువ మార్కులు వస్తాయనడంలో సందేహం లేదని నిపుణులు చెబుతున్నారు. అలాగే కరెంట్ అఫైర్స్‌లో అడిగిన ప్రశ్నలు సూటిగా ఉన్నాయి. సమాధానాలు గుర్తించడం సులువు అనే చెప్పవచ్చంటున్నారు. మొత్తమ్మీద అన్ని విభాగాల్లో సులువు నుంచి మధ్యస్థంగా ప్రశ్నలున్నాయి. ఒక మాదిరిగా ప్రిపేరైన అభ్యర్థులు సైతం గట్టెక్కే అవకాశాలే బలంగా కనిపిస్తున్నాయి. ఈసారి ప్రశ్నల సరళిలో ఒక వైవిధ్యం స్పష్టంగా కనిపించింది. గతంలో రెండు వర్గాల మధ్య జతపర్చమని అడిగే వారు. ఈసారి మూడు వర్గాల మధ్య అనుసంధానం చేయాల్సి వచ్చింది. ఉదాహరణకు జలపాతాలు - అవి ఉన్న ప్రాంతం - నది వంటి అంశాలను జతపర్చాలని అడిగారు. గడిచిన రెండేళ్ల ట్రెండ్ ఈసారి కనిపించలేదు. అయితే.. 2019, 2020 నాటి ట్రెండ్ ఈ ఏడాది ఇచ్చిన పేపర్‌లో కనిపించింది. మొత్తానికి ఇది సులువైన పేపరే అని విషయ నిపుణులు చెబుతున్నారు.

లోకం తీరు




## 52 ఏళ్ల మహిళ.. 12 రోజుల్లో వెయ్యి కిలోమీటర్ల పరుగు

» అల్ట్రామారథాన్ నటాలీడౌ ఘనత ఇది



న్యూఢిల్లీ, జూన్ 16: సింగపూర్‌కు చెందిన నటాలీడౌ(52) అనే మహిళ అనితర సాధ్యమైన ఓ సాహసాన్ని ఇటీవల విజయవంతంగా పూర్తి చేశారు. నటాలీ డౌ 12 రోజుల్లో వెయ్యి కిలోమీటర్ల దూరం పరుగెత్తారు. ఈ క్రమంలో ఏకంగా మూడు దేశాలను చుట్టేశారు. గత మే 25వ తేదీన థాయ్‌లాండ్‌లో పరుగును మొదలుపెట్టిన నటాలీ.. మలేషియా మీదుగా జూన్ 5న సింగపూర్ చేరుకుని ఈ అరుదైన ఫీట్ సాధించారు. మహిళలు, బాలికల ఆరోగ్యం అనే అంశంపై అవగాహన కల్పించడంతోపాటు విరాళాల సేకరణే లక్ష్యంగా 'ప్రాజెక్ట్ 1000' పేరిట ఆమె ఈ పరుగును ప్రారంభించారు. ఆరోగ్యాన్ని పెంపొందించుకునేందుకు తన 30వ ఏట పరుగును ప్రారంభించిన నటాలీడౌ.. ప్రాజెక్ట్ 1000లో భాగంగా రోజుకి 84.2 కిలోమీటర్లు చొప్పున పరుగెత్తారు. తాను నిర్దేశించుకున్న 1000 కిమీల లక్ష్యాన్ని 12 రోజుల్లో పూర్తి చేశారు. అంటే ప్రతీ రోజు రెండు మారథాన్‌లు పూర్తి చేశారు. ఈ క్రమంలో ఎండ, వానలు, తుంటి గాయం, అనారోగ్యాన్ని కూడా లెక్క చేయలేదు. ఎండల నుంచి తప్పించుకునేందుకు కొన్ని రోజులు అర్ధరాత్రి తర్వాత మొదలుపెట్టి తెల్లవారుజాము వరకు పరుగెత్తేవారు. ఏదేమైనా అనుకున్న లక్ష్యాన్ని సాధించిన నటాలీడౌ.. 'ఫాస్టెస్ట్1000 కిమీ థాయ్‌లాండ్- సింగపూర్ అల్ట్రామారథాన్' రికార్డును సొంతం చేసుకున్నారు. అంతేకాక, అత్యంత వేగంగా మలేషియాను కాలినడకన దాటిన వ్యక్తిగా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ నమోదు చేశారు. ఇక, తన పరుగుతో నటాలీడౌ క్రీడల ద్వారా మహిళలు, అమ్మాయిల్లో నాయకత్వ సామర్థ్యాన్ని పెంపొందించేందుకు కృషి చేసే ఓ సంస్థకు 50 వేల డాలర్లు(దాదాపు రూ.42లక్షలు) విరాళాలు సేకరించారు.

## ఆరెస్సెస్ చీఫ్ భాగవత్‌తో యోగి ఏకాంత చర్చలు

» ఒకే రోజున రెండు సార్లు.. యూపీలో బీజేపీ ఓటమిపైనేనా?



గోరఖ్‌పూర్, జూన్ 16: రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ అధినేత మోహన్ భాగవత్‌తో యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ ఏకాంతంగా చర్చలు జరపడం ప్రాధాన్యం సంతరించుకొంది. యోగి స్వస్థలమైన గోరఖ్‌పూర్‌లో శనివారం రెండుసార్లు ఈ భేటీలు జరిగాయి. తొలుత మధ్యాహ్నం కాంపెయిర్‌గంజ్‌లో ఆరెస్సెస్ కార్యకర్తల సమావేశం జరిగిన అనంతరం అక్కడి పాఠశాలలో ఇరువురు నేతలు అరగంట పాటు చర్చలు జరిపారు. రాత్రి 8.30 గంటల సమయంలో పక్కీబాగ్‌లోని సరస్వతి శిశు మందిర్‌లో మరో 30 నిమిషాల పాటు చర్చలు జరిపారు. ఉత్తరప్రదేశ్‌లో బీజేపీ బలంగా ఉందని అందరూ భావిస్తుండగా ఇటీవలి లోక్‌సభ ఎన్నికల్లో దారుణంగా ఓడిపోవడానికిగల కారణాలపై చర్చించినట్టు తెలుస్తోంది. కాగా కంటి ఆపరేషన్ నిమిత్తం రిషీకేష్ ఎయిమ్స్ ఆస్పత్రిలో చేరిన తన తల్లి గాయత్రి దేవిని ఆదివారం యోగి ఆదిత్యనాథ్ పరామర్శించారు. సుమారు మూడు గంటల పాటు ఆస్పత్రిలో ఉన్నారు.

## భారత్-శ్రీలంక మధ్య వారధి!

కొలంబో, జూన్ 16: భారత్-శ్రీలంక మధ్య ప్రతిపాదిత వారధి నిర్మాణంపై ఆ దేశ అధ్యక్షుడు రణిల్ విక్రమసింఘె కీలక ప్రకటన చేశారు. ఇరు దేశాల మధ్య భూ అనుసంధానానికి సంబంధించి సాధ్యాసాధ్యాల అధ్యయనం ప్రాథమిక దశ పూర్తయిందని.. తుది దశ త్వరలోనే పూర్తవుతుందని తెలిపారు. కృతయుగంలో సీత కోసం లంకకు బయల్దేరిన రాముడు తమిళనాడులోని ధనుష్కోటి నుంచి శ్రీలంకకు వారధి నిర్మాణాన్ని ప్రారంభించాలని హనుమంతుడిని ఆదేశించినట్టు రామాయణం చెబుతోంది. అలా వానరసైన్యం నిర్మించిన రామసేతు గుండా నడిచి వెళ్లి.. తలైమన్నార్ ప్రాంతంలో రాముడు శ్రీలంకలో అడుగుపెట్టాడని ఐతిహ్యం. 2023 జూలైలో శ్రీలంక అధ్యక్షుడి భారత పర్యటన నేపథ్యంలో.. ఈ రెండు ప్రదేశాలనూ కలుపుతూ 23 కిలోమీటర్ల మేర.. మామూలు వాహనాలు, రైళ్లు సైతం ప్రయాణించేలా భారీ వంతెన నిర్మించాలని భారత పర్యటన తర్వాత మన ప్రభుత్వం తలపెట్టింది. దీనికి సంబంధించిన సాధ్యాసాధ్యాల అధ్యయనం నిర్వహించాలని ఈ ఏడాది జనవరిలో నిర్ణయించింది. అనంతరం ఇరుదేశాలూ కలిసి సంయుక్తంగా అధ్యయనాన్ని మొదలుపెట్టినట్టు శ్రీలంకలో భారత హైకమిషనర్ సంతోష్ ఝా ఏప్రిల్‌లో తెలిపారు. ఈ బ్రిడ్జి నిర్మాణం విపరీతమైన ఖర్చుతో, సాంకేతిక సవాళ్లతో కూడుకున్న ప్రాజెక్టేగానీ.. దీన్ని నిర్మిస్తే భారత్-శ్రీలంక ద్వైపాక్షిక వాణిజ్యానికి ఎంతో ప్రయోజనం చేకూరుస్తుందని అంచనా. కాగా.. భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ జూన్ 20న కొలంబోకు రానున్నారని శ్రీలంక విదేశాంగ శాఖ శనివారం ప్రకటించింది. ఈ పర్యటన సందర్భంగా.. రెండు దేశాల మధ్య రోడ్డు మార్గంతో పాటు, పవర్ గ్రిడ్ అనుసంధానంపైనా ఆయనతో చర్చిస్తామని విక్రమసింఘె తెలిపారు. తమ దేశంలో అధికంగా ఉత్పత్తి అవుతున్న పునరుత్పాదక ఇంధనాన్ని భారత్‌కు విక్రయించే వాణిజ్య వెంచర్‌పైన కూడా చర్చించనున్నట్టు వెల్లడించారు. అలాగే.. మన్నార్‌లో అదానీ గ్రూపు పవన శక్తి ప్రాజెక్టు, ట్రింకోమలిలో పారిశ్రామిక జోన్ అభివృద్ధి సహా అన్ని భారతీయ ప్రాజెక్టులపైనా జైశంకర్ పర్యటనలో చర్చించనున్నట్టు శ్రీలంక అధికారులు తెలిపారు. అయితే జైశంకర్ శ్రీలంక పర్యటనపై మన విదేశాంగ శాఖ ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ఆయన పర్యటన ఖాయమైతే.. కొత్తగా ప్రభుత్వం ఏర్పాటై, రెండోసారి విదేశాంగ మంత్రిగా బాధ్యతలు చేపట్టాక ఆయన చేయబోయే తొలి అధికారిక విదేశీ పర్యటన ఇదే అవుతుంది.

## ట్రాన్స్‌జెండర్లకు 1% రిజర్వేషన్లు ఇవ్వండి

కోల్‌కతా, జూన్ 16: ప్రభుత్వ ఉద్యోగాల్లో ట్రాన్స్‌జెండర్లకు ఒక శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని పశ్చిమ బెంగాల్ ప్రభుత్వాన్ని కలకత్తా హైకోర్టు ఆదేశించింది. ట్రాన్స్‌జెండర్లను కూడా అందరితో సమానంగా చూస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించినా ఇంతవరకు రిజర్వేషన్లు కల్పించని విషయాన్ని గుర్తుచేసింది. అందువల్ల ఒక శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని న్యాయమూర్తి జస్టిస్ రాజశేఖర్ మంథా ప్రభుత్వ ప్రధాన కార్యదర్శిని ఆదేశించారు. 2014, 2022ల్లో రెండు సార్లు టీచర్స్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్)లో అర్హత సాధించినా తనను ఇంటర్వ్యూకు పిలవలేదని పేర్కొంటూ ఓ ట్రాన్స్‌జెండర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన న్యాయమూర్తి ఈ ఆదేశాలు ఇచ్చారు. ట్రాన్స్‌జెండర్లకు విద్య, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు ఇవ్వాలంటూ సుప్రీం కోర్టు ఆదేశించిన విషయాన్ని కూడా గుర్తు చేశారు.

# నీట్‌లో రెండుచోట్ల అవకతవకలు

**మొదటిసారి ఒప్పుకొన్న కేంద్ర మంత్రి ధర్మేంద్ర ప్రధాన్.. ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణిస్తోందని స్పష్టీకరణ**

» ఎన్‌టీఏ అధికారుల తప్పున్నట్టు తేలితే వదిలిపెట్టబోమని, వారు కఠిన శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరిక

» 'నీట్'పై మోదీ మౌనం మంచిది కాదు

» 'సుప్రీం' కమిటీతో దర్యాప్తు జరిపించాలి

» వైద్యవిద్యలో ప్రవేశాలపై అన్ని రాష్ట్రాలతో సంప్రదింపులు జరపాలి: కపిల్ సిబల్




న్యూఢిల్లీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): నీట్ నిర్వహణలో అక్రమాలు నిజమేనని కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా ఒప్పుకొంది. రెండుచోట్ల అవకతవకలు జరిగినట్టు వెలుగులోకి వచ్చింది.. ప్రభుత్వం దీన్ని తీవ్రంగా పరిగణిస్తోందని కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ఆదివారం పేర్కొన్నారు. ఈ వ్యవహారంలో ఎన్‌టీఏ అధికారులు.. వారు ఎంత ఉన్నతస్థాయిలో ఉన్నవారైనా గానీ.. దోషులుగా తేలితే వారిని వదిలిపెట్టబోమని, వారు కఠిన శిక్షను అనుభవించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ చాలా మెరుగుపడాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. మరోవైపు.. నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన అవకతవకలు, అక్రమాలు, పేపర్ లీక్‌పై ప్రధాని మోదీ మౌనంగా ఉండడం మంచిది కాదని కేంద్ర మాజీ మంత్రి కపిల్ సిబల్ అన్నారు. నీట్ అక్రమాలపై సుప్రీంకోర్టు నియమించిన నిపుణులతో దర్యాప్తు జరపాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ వ్యవహారంపై సీబీఐ దర్యాప్తు జరిపితే అధికార యంత్రాంగాన్ని ప్రభుత్వం కాపాడుతుందని.. కాబట్టి స్వతంత్ర సంస్థతో గానీ, సుప్రీంకోర్టు ఎంపిక చేసిన స్వతంత్ర అధికారులతో గానీ దర్యాప్తు జరిపించాలని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత ప్రభుత్వం (మోదీ సర్కారు) అన్నింటినీ కేంద్రీకృతం చేస్తోందని.. ఈ ప్రభుత్వం తీసుకునే ప్రతి నిర్ణయమూ ఢిల్లీలోని అధికారుల ఇష్టాయిష్టాలకు అనుగుణంగా ఉంటోందని ధ్వజమెత్తారు. మనది 140 కోట్ల మంది జనాభా.. సంక్లిష్టమైన సామాజిక వ్యవస్థ ఉన్న దేశం కాబట్టి భవిష్యత్తులో వైద్యవిద్యలో ప్రవేశాలకు సంబంధించి కేంద్రం అన్ని రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి ఏకాభిప్రాయానికి రావాలని ఆయన సూచించారు. అలాగే. ఇది దేశ యువత భవిష్యత్తుపై ప్రభావం చూపే అంశం కాబట్టి, వచ్చే పార్లమెంటు సమావేశాల్లో ఈ అంశాన్ని బలంగా లేవనెత్తాలని అన్ని రాజకీయ పార్టీలకూ ఆయన సలహా ఇచ్చారు. అవకాశం లభిస్తే తానే ఈ అంశాన్ని పార్లమెంటులో ప్రస్తావిస్తానని.. పీటీఐ వార్తా సంస్థకు ఇచ్చిన ఇంటర్వ్యూలో సిబల్ తెలిపారు. అయితే.. ఇది న్యాయస్థానంలో పెండింగ్‌లో ఉందనే సాకుతో కేంద్రం ఈ సమస్యను పార్లమెంటులో ప్రస్తావించేందుకు అంగీకరించకపోవచ్చని సందేహం వ్యక్తం చేశారు. జాతీయ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) దుర్వినియోగమైందని ఆందోళన వెలిబుచ్చిన ఆయన.. నీట్ పరీక్ష నిర్వహణకు సంబంధించి గుజరాత్‌లో జరిగిన కొన్ని సంఘనలు తనను కలవరపాటుకు గురిచేశాయని పేర్కొన్నారు. ఈ వ్యవహారానికి సంబంధించి చాలా సీరియస్ ప్రశ్నలకు ఎన్‌టీఏ సమాధానం చెప్పితీరాలని స్పష్టం చేశారు. ఇలా పరీక్షల్లో అక్రమాలకు పాల్పడి వైద్యులైనవారితో చికిత్స చేయించుకోవడం పేషెంట్లకు చాలా ప్రమాదమని ఆందోళన వెలిబుచ్చారు. సుప్రీంకోర్టు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణనలోకి తీసుకోవాలని అభిప్రాయపడ్డారు.

### అన్నీ యూపీఏపైనే..

ప్రస్తుత (మోదీ) సర్కారు హయాంలో ఇలాంటి వ్యవహారాలు బయటపడినప్పుడల్లా.. మూఢభక్తులు ముందుకొచ్చి ఈ పాపాలన్నింటికీ యూపీఏనే కారణమంటూ ఆరోపించడం మొదలుపెడతారని.. ఇది తనను చాలా ఆశ్చర్యానికి, తీవ్ర నిరాశకు గురిచేస్తుందని వాపోయారు. నీట్‌ను 2010లో భారత వైద్య మండలి (ఎంసీఐ) బోర్డ్ ఆఫ్ డైరెక్టర్స్ ప్రవేశపెట్టారని.. ఎంసీఐ కేంద్ర ఆరోగ్య శాఖ పరిధిలో ఉంటుంది తప్ప విద్యాశాఖ పరిధిలో కాదని ఆయన గుర్తుచేశారు. 2016 ఆగస్టు 4న బీజేపీ సర్కారు ఇండియన్ మెడికల్ కౌన్సిల్ చట్టంలో సెక్షన్ 10డిని చేర్చిందని.. అప్పటిదాకా అమల్లో ఉన్న ఇండియన్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్ 1956 స్థానంలో 2019 ఆగస్టు 8న నేషనల్ మెడికల్ కౌన్సిల్ యాక్ట్‌ను తెచ్చిందని వివరించారు. ఆ చట్టంలోని సెక్షన్ 14లో నీట్ పరీక్ష ప్రస్తావన ఉందని తెలిపారు. కాబట్టి ఈ చట్టానికి, యూపీఏకి ఎలాంటి సంబంధమూ లేదని ఆయన స్పష్టం చేశారు. నీట్ నిర్వహణలో ఎలాంటి అక్రమాలూ జరగలేదంటూ కేంద్ర విద్యా మంత్రి ధర్మేంద్రప్రధాన్ పదేపదే చెబుతుండడంపై సిబల్ ధ్వజమెత్తారు. "ఒక్కసారి ఆయన్ను సోషల్ మీడియాలో చూడమనండి. గుజరాత్‌లోనే ఈ వ్యవహారం ఎలా జరుగుతోందో తెలుస్తుంది. దేశంలోని పురోగామి రాష్ట్రాల్లో గుజరాత్ ఒకటి. బహుశా అవినీతిలో కూడా ఆ రాష్ట్రం ప్రగతిశీలంగా ఉన్నట్టు కనిపిస్తోంది" అని ఎద్దేవా చేశారు. ఆ ఒక్క రాష్ట్రంలోనే కాక.. దేశవ్యాప్తంగా కూడా ఈ పరీక్ష నిర్వహణలో అవినీతి జరిగిందని సిబల్ ఆరోపించారు. "67 మందికి అత్యధిక మార్కులు వచ్చి.. వారిలో కొందరు ఒకే సెంటర్‌లో పరీక్ష రాసినవారని తెలితే విద్యా శాఖ మంత్రి దాని గురించి ఆందోళన చెందాలి తప్ప అసలేమీ జరగలేదని చెప్పకూడదు." అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తప్పు జరిగినప్పుడు ఆ విషయాన్ని ఒప్పుకొనే మంత్రి ఒక్కరు కూడా ఈ ప్రభుత్వంలో లేరని దుయ్యబట్టారు.

## పాఠాల్లో అయోధ్య మాయం

» అల్లర్ల వివరాలు తీసేసిన ఎన్‌సీఈఆర్‌టీ

» బాబ్రీ మసీదు పేరు స్థానంలో 3 గుమ్మటాలు

» 12వ తరగతి రాజనీతిశాస్త్రంలో మార్పులు

న్యూఢిల్లీ, జూన్ 16: గుజరాత్ మత అల్లర్లు, బాబ్రీ మసీదు కూల్చివేత వంటి అంశాలతో కూడిన పాఠాలను సవరించడాన్ని ఎన్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ దినేశ్ ప్రసాద్ సక్లానీ సమర్థించుకున్నారు. మత అల్లర్లు ఉన్న పాఠ్య భాగాలను బోధించడం హింసను ప్రేరేపించి, పౌరులను కుంగుబాటుకు గురిచేసే ప్రమాదం ఉంటుందని భావించి.. వాటిని తీసివేశామని వివరణ ఇచ్చారు. ఎన్‌సీఈఆర్‌టీని (నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషనల్ రిసెర్చ్ అండ్ ట్రైనింగ్) కాషాయ సంస్థగా మార్చివేశారన్న ఆరోపణను దినేశ్ ప్రసాద్ తిరస్కరించారు. తాజాగా మార్కెట్‌లోకి వచ్చిన 12వ తరగతి రాజనీతి శాస్త్రంలో చాలా మార్పులు కనిపిస్తున్నాయి. బాబ్రీ మసీదు అని రాయాల్సి వచ్చిన చోట మూడు గుమ్మటాల కట్టడం అని పేర్కొన్నారు. 1528లో మీర్ బాబరు బాబ్రీ మసీదును నిర్మించారు అని పూర్వ పాఠంలో ఉండగా, శ్రీరాముని జన్మభూమిలో 1528లో ఇది నిర్మాణమైందంటూ సవరించారు. అయోధ్య గురించి గతంలో నాలుగు పేజీలు ఉన్న పాఠాన్ని రెండు పేజీలకు కుదించారు. హిందువుల పూజల కోసం మసీదు తలుపులు తెరవాలని 1986లో ఫైజాబాద్ జిల్లా కోర్టు ఇచ్చిన ఆదేశాలు మత హింసకు దారితీశాయని పూర్వ పాఠంలో ఉండగా, దాన్నంతా దాదాపుగా తొలగించారు. ఆలయ నిర్మాణానికి అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు పూర్తి పాఠాన్ని కొత్తగా చేర్చారు. ఇలా కత్తిరింపులు, కుదింపులు చేసి సవరించిన 12వ తరగతి రాజకీయ శాస్త్ర పాఠ్య పుస్తకం మార్కెట్‌లోకి రాగానే గగ్గోలు రేగింది. ఈ నేపథ్యంలో దినేశ్ ప్రసాద్ జాతీయ వార్తా సంస్థ పీటీఐ సంపాదకులతో మాట్లాడుతూ దీనిపై వివరణ ఇచ్చారు. "ఏడాదికోసారి పాఠ్య పుస్తకాలను సవరిస్తూ ఉంటాం. ఇది సాధారణ ప్రక్రియలో భాగం. దీని గురించి గగ్గోలు పడాల్సిన అవసరం లేదు. గుజరాత్ అల్లర్లు, బాబ్రీ మసీదు ధ్వంసం వంటి అంశాలు తొలగింపు సరైనదే. మత అల్లర్లు వంటి వాటి గురించి పెరిగి పెద్దయ్యాక పిల్లలు ఎలాగో తెలుసుకొంటారు. వాటి గురించి ఇప్పటినుంచే తరగతి గదిలో బోధించడం ఎందుకు?" అని ఆయన అన్నారు.

# ఈవీఎంలు వాడొద్దు..

**వాటిని హ్యాకింగ్ చేయడానికి అవకాశం ఉంది**

» టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ ట్వీట్

» ఇక్కడ ఈవీఎంలు పూర్తి సురక్షితమైనవి

» కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్



న్యూఢిల్లీ, జూన్ 16(ఆంధ్రజ్యోతి): సార్వత్రిక ఎన్నికల ప్రక్రియ ప్రారంభమైనప్పటి నుంచి ఈవీఎంల భద్రతపై చర్చ సాగుతోంది. ఎన్నికల ఫలితాల అనంతరం అది తారస్థాయికి చేరింది. ఈ నేపథ్యంలో ప్రపంచ కుబేరుడు, టెస్లా సీఈవో ఎలాన్ మస్క్ చేసిన ఆరోపణలతో ఈవీఎంల అంశం దేశవ్యాప్తంగా మరోసారి దుమారం రేగుతోంది. ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను కొంతమేరకు హ్యాక్ చేసే అవకాశాలున్నాయని, అందుకే వాటిని వాడకుండా పక్కన పెట్టాలని ఎక్స్ వేదికగా మస్క్ పోస్టు చేశారు. ప్యూర్టోరికో ఎన్నికల్లో అవకతవకలపై అమెరికా మాజీ అధ్యక్షుడు జాన్ ఎఫ్ కెన్నడీ మేనల్లుడు రాబర్ట్ ఎఫ్ కెన్నడీ జూనియర్ ఇటీవల చేసిన పోస్టుకు మస్క్ స్పందించారు. 'ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలను తొలగించాలి. మనుషులు లేదా ఏఐ ద్వారా వాటిని హ్యాకింగ్ చేసే ప్రమాదం ఉంది. ఇది చాలా తక్కువ స్థాయిలోనే ఉన్నప్పటికీ దీని పర్యవసానాలు మాత్రం భారీగా ఉంటాయి' అని మస్క్ ట్వీట్ చేశారు. ఈ వ్యాఖ్యలపై బీజేపీ నేత, కేంద్ర మాజీ మంత్రి రాజీవ్ చంద్రశేఖర్ ఘాటుగా స్పందించారు. 'మస్క్ వ్యాఖ్యలు అన్నింటినీ సాధారణీకరిస్తున్నట్లుగా ఉన్నాయి. ఇంటర్నెట్ కనెక్టెడ్ యంత్రాలను నిర్మించడానికి సాధారణ కంప్యూటర్ ప్లాట్‌ఫాంలు ఉపయోగించే అమెరికా, ఇతర దేశాలకు ఆయన చెప్పిన అంశాలను అన్వయించుకోవచ్చేమో గానీ భారతీయ ఈవీఎంలు పూర్తిగా సురక్షితమైనవి. ఏ నెట్‌వర్క్ లేదా మీడియాతో కనెక్ట్ కాని విధంగా వాటిని డిజైన్ చేశారు. వీటికి బ్లూటూత్, ఇంటర్నెట్, వైఫైతో ఎలాంటి కనెక్టివిటీకి అవకాశమే లేదు. పేపర్ బ్యాలెట్లతో పోలిస్తే ఇవి విశ్వసనీయమైన ఓటింగ్ పద్ధతిగా కొనసాగుతున్నాయి" అని రాజీవ్ స్పష్టం చేశారు. దీనిపై మస్క్ స్పందిస్తూ.. 'దేన్నయినా హ్యాక్ చేయవచ్చు' అంటూ మరో ట్వీట్ చేశారు.

### బ్లాక్ బాక్సులుగా ఈవీఎంలు: రాహుల్

ఈవీఎంల భద్రతపై మస్క్ చేసిన ట్వీట్‌ను విపక్ష పార్టీ నేతలు విస్తృతంగా షేర్ చేస్తున్నారు. ఈ విషయంలో కేంద్ర ఎన్నికల సంఘం మౌనం వహించడంపై నిలదీస్తున్నారు. మస్క్ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ ఆదివారం స్పందించారు. భారత్‌లో ఈవీఎంలు బ్లాక్‌బాక్సులుగా మారాయని, వాటిని పరిశీలించేందుకు ఎవరినీ అనుమతించడం లేదని ఎక్స్ వేదికగా పేర్కొన్నారు. దేశంలో ఎన్నికల ప్రక్రియ పారదర్శకతపై అనేక ఆందోళనలు వ్యక్తమవుతున్నాయని, వ్యవస్థల్లో జవాబుదారీతనం లోపించినప్పుడు ప్రజాస్వామ్యం ఓ బూటకంగానే మిగిలిపోతుందని రాహుల్ పేర్కొన్నారు. మస్క్ పోస్టుతో పాటు ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ స్థానంలో గెలిచిన రవీంద్ర వైకర్ బంధువులు ఈవీఎంలకు కనెక్ట్ చేసిన ఫోన్‌ను ఉపయోగిస్తున్నారంటూ వచ్చిన వార్తా కథనాన్ని ఆయన పంచుకున్నారు. మరోవైపు సమాజ్‌వాదీ పార్టీ చీఫ్ అఖిలేశ్ యాదవ్ సైతం మస్క్ పోస్టును షేర్ చేశారు. 'సాంకేతికత అనేది సమస్యలను తొలగించడానికి ఉపయోగపడాలి. అంతేకానీ అదే సమస్యలకు కారణమైతే... దాని వాడకాన్ని వెంటనే ఆపేయాలి' అని ఆయన పేర్కొన్నారు.

## ఈవీఎం హ్యాక్ చేశారు!

» మొబైల్ ఫోన్, ఓటీపీతో అన్‌లాక్

ముంబై, జూన్ 16: ఈవీఎంల భద్రతపై అనుమానాలు వ్యక్తమవుతున్న వేళ మరో సంచలన వార్త వెలుగు చూసింది. ఈవీఎంలకు అనుసంధానించిన మొబైల్ ఫోన్‌ను ఉపయోగించారనే ఆరోపణలపై ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ స్థానం నుంచి తాజాగా ఎన్నికైన ఎంపీ రవీంద్ర వైకర్, ఆయన బంధువులపై కేసు నమోదైంది. ఇటీవల జరిగిన లోక్‌సభ ఎన్నికల్లో శివసేనకు చెందిన రెండు వర్గాలు ఈ స్థానం నుంచి పోటీ చేయగా ఏక్‌నాథ్ షిండే వర్గానికి చెందిన రవీంద్ర 48 ఓట్ల స్వల్ప తేడాతో గెలిచారు. ఇప్పుడు ఆయన గెలుపుపై వివాదం నెలకొంది. జూన్ 4న ఇక్కడి నెస్కో పోలింగ్ కౌంటింగ్ కేంద్రంలోని ఈవీఎంను అన్‌లాక్ చేయడానికి రవీంద్ర బావమరిది మంగేశ్ పాండిల్కర్ మొబైల్ ఫోన్‌ను ఉపయోగించారని ఆరోపణలు వచ్చాయి. ఆ ఫోన్‌ను పోలీసులు స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబొరేటరీకి పంపించారు. మంగేశ్‌పై కేసు నమోదు చేశారు.

### అవకతవకలకు ఆస్కారం లేదు: ఆర్వో


ఈవీఎంలలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేదని, కట్టుదిట్టమైన రక్షణతో కూడిన స్వతంత్ర వ్యవస్థ వాటిలో ఉందని ముంబై ఎన్నికల అధికారులు ఆదివారం స్పష్టం చేశారు. జూన్ 4న ఓట్ల లెక్కింపు సందర్భంగా ఈవీఎంకు అనుసంధానమైన మొబైల్ ఫోన్‌ను ఉపయోగించి రవీంద్ర వాకర్ 48ఓట్ల స్వల్ప మెజారిటీతో గెలుపొందారంటూ కథనాలు రావడంపై ముంబై నార్త్ వెస్ట్ లోక్‌సభ స్థానం రిటర్నింగ్ అధికారి వందన సూర్యవంశీ స్పందించారు. 'ఈవీఎం ఒక స్టాండ్ అలోన్ వ్యవస్థ. దాన్ని అన్‌లాక్ చేయడానికి ఓటీపీ అవసరం లేదు. ఇది ప్రోగ్రామింగ్ చేసిన యంత్రం కాదు. అలాగే ఇది ఎలాంటి వైర్‌లెస్ కమ్యూనికేషన్ సామర్థ్యాలను కలిగి ఉండదు. తప్పుడు వార్తలు ప్రచారం చేసిన పత్రికకు నోటీసులు జారీ చేశాం' అని సూర్యవంశీ మీడియాకు వెల్లడించారు.

# ఉగ్రవాదులను అణచివేయండి

» పక్కా ప్రణాళికతో ముందుకెళ్లండి

» భద్రతా బలగాలకు అమిత్ షా ఆదేశం

» జమ్మూకశ్మీరులో భద్రతా పరిస్థితులపై సమీక్ష జరిపిన కేంద్ర హోం మంత్రి



న్యూఢిల్లీ, జూన్ 16: ఉగ్రవాదులపై ఉక్కుపాదం మోపాలని, జమ్మూ ప్రాంతంలో పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా భద్రతా బలగాలను ఆదేశించారు. ఉగ్రవాద ప్రాబల్యం ఉన్న ప్రాంతాల్లో పట్టు సాధించే విధానం ద్వారా కశ్మీరు లోయలో ఉగ్రవాదులను విజయవంతంగా అణచివేశారని.. అదే పద్ధతిని జమ్మూలోనూ అమలు చేయాలని సూచించారు. నవీన పద్ధతులను అనుసరించి ఉగ్రవాదంపై ఉక్కుపాదం మోపేందుకు నరేంద్ర మోదీ సర్కారు చిత్తశుద్ధితో పనిచేస్తుందని చెప్పారు. జమ్మూకశ్మీరులో భద్రతా పరిస్థితులపై ఆదివారం అమిత్ షా ఢిల్లీలో నిర్వహించిన ఉన్నతస్థాయి సమీక్షలో ఈ మేరకు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోభాల్, జమ్మూకశ్మీరు లెఫ్టినెంట్ గవర్నర్ మనోజ్ సిన్హా, సైన్యాధిపతి జనరల్ మనోజ్ పాండే తదితరులు పాల్గొన్నారు. కశ్మీరులో అవలంబించిన స్థానికంగా పైచేయి సాధించడం, జీరో టెర్రర్ ప్లాన్‌లను జమ్మూలోనూ అనుసరించాలని అమిత్ షా భద్రతా సంస్థలను ఆదేశించారు. అలాగే ఈ నెల 29 నుంచి ప్రారంభం కానున్న అమర్‌నాథ్ యాత్ర ఏర్పాట్లపైనా సమీక్షించారు. జమ్మూకశ్మీరులో ఉగ్రవాదుల అణచివేతకు ముమ్మర కార్యాచరణ సిద్ధం చేసినట్లు అధికారులు అమిత్ షాకు వివరించారు. కాగా, ఉగ్రవాదులకు మద్దతు తెలిపేవారి ఆస్తులను స్వాధీనం చేసుకోవాలని కేంద్రం నిర్ణయించినట్లు సమాచారం. అలాగే వారిపై పలు తీవ్రమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేయనున్నట్లు తెలిసింది. ఉగ్రవాదుల మద్దతుదారుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ ఉద్యోగాలు ఇవ్వరాదనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. కాగా, ఈ నెల 21న ప్రధాని మోదీ జమ్మూకశ్మీరులో పర్యటించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.


## స్పైన్ సర్జన్ నరేశ్ బాబుకు ఈజిల్స్ ప్రైజ్

» ఉత్తమ వైద్య పరిశోధనకు అంతర్జాతీయ అవార్డు



అవార్డు అందుకుంటున్న డాక్టర్ నరేశ్ బాబు

గుంటూరు (మెడికల్), జూన్ 16: తీవ్రమైన నడుం నొప్పికి కారణమయ్యే వెన్నుపూసలోని డిస్కుల అరుగుదలకు కారణం తెలుసుకొని వైద్య ప్రపంచానికి తొలిసారిగా వెల్లడించిన గుంటూరులోని మల్లిక స్పైన్ సెంటర్.. అంతర్జాతీయ ఆర్థోపెడిక్ వైద్య రంగంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా భావించే ఈజిల్స్ ప్రైజ్‌ను కైవశం చేసుకుంది. ప్రపంచవ్యాప్తంగా అందే పలు వైద్య పరిశోధన పత్రాలతో పోటీ పడి క్లినికల్, బయో ఇంజనీరింగ్ విభాగంలో అత్యుత్తమ పరిశోధనకు ఇచ్చే ఈ అవార్డును మల్లిక స్పైన్ సెంటర్ అధినేత డాక్టర్ జే నరేశ్ బాబు అందుకున్నారు. గత నెల 30న ఇటలీలోని మిలాన్ నగరంలో జరిగిన అంతర్జాతీయ లంబార్ స్పైన్ అధ్యయన సంస్థ (ఐఎస్ఎస్ఎల్ఎస్) 50వ వార్షిక సదస్సులో, ఆయన ఈజిల్స్ ప్రైజ్ అందుకున్నారు. ఆర్థోపెడిక్ వైద్య రంగంలో ఆస్కార్ అవార్డుగా భావించే ఈ పురస్కారాన్ని గత యాభై ఏళ్లల్లో ఒక భారతీయ వైద్యుడు సాధించడం ఇది రెండోసారి మాత్రమే. ఈ పురస్కారం కింద ధ్రువీకరణ పత్రంతో పాటు 20 వేల అమెరికన్ డాలర్ల నగదును సంస్థ అధ్యక్షుడు కజీరో చిబా, ప్రైజ్ కమిటీ చైర్ హెలీనా బ్రిస్బీ.. నరేశ్‌బాబుకు అందజేశారు.


బెడ్‌రూమ్


ఖరీదైన వస్తువులతో కిచెన్

## అంతా లక్షల్లోనే..

జగన్ వాడుకోవడానికి బిగించిన టాయ్‌లెట్ కమోడ్ ధర కేవలం రూ.13.5 లక్షలే. జగన్ ఆయన కుటుంబసభ్యులు మాత్రమే వాడుకునేందుకు వీలుగా ఇలాంటివి మూడు బిగించారు. ఒక్కో దాని ధర రూ.13.5 లక్షలు. కాగా, మిగతా బాత్‌రూముల్లో బిగించిన కమోడ్‌ల ధర ఒక్కోటి జస్ట్ రూ.6 లక్షలు అంతే.



# జగన్ జల్సా మహల్ ఇదిగో...


ప్యాలెస్‌లో సువిశాలమైన హాల్

## రుషికొండపై ఏడు బ్లాకులతో అట్టహాసంగా ప్యాలెస్..

### అందులో మూడు జగన్ ఫ్యామిలీకే.. భార్యాభర్తలకు ప్రెసిడెన్షియల్ సూట్.. కుమార్తెలకు చెరో విల్లా సూట్

### పర్యాటక రిసార్ట్స్ పేరిట అనుమతి 4 ఎకరాలకు... నిర్మాణం చేసింది దాదాపు పది ఎకరాల్లో.. ముందే చెప్పిన 'ఆంధ్రజ్యోతి'


రుషికొండను మింగే అనకొండ!
ప్రస్తుతానికైతే అక్కడ సీఎం కార్యాలయం, నివాసం
జనం సొమ్ముతో 'జల్సా ప్యాలెస్'

13-10-2023 సంచికలో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించిన కథనం

(విశాఖపట్నం, అమరావతి - ఆంధ్రజ్యోతి)

రుషికొండపై జనం సొమ్ముతో జగన్ కట్టుకున్న జల్సా మహల్ గుట్టును 'ఆంధ్రజ్యోతి' ఇప్పటికే బయటపెట్టింది. పర్యావరణానికి గండి కొట్టి, నిబంధనలకు మస్కా కొట్టి, కోర్టును ఏమార్చి, నిర్మాణం సాగిస్తున్న సమయంలోనే ఈ ప్యాలెస్‌లోని హంగులను 'జనం సొమ్ముతో జల్సా ప్యాలెస్' పేరిట 13-10-2023 సంచికలో 'ఆంధ్రజ్యోతి' ప్రచురించింది. నిర్మాణం పూర్తయిన ఈ ప్యాలెస్‌లోకి ఆదివారం అడుగుపెట్టినవారు విస్తుపోయేలా అత్యంత ఖరీదైన గృహ అలంకరణ వస్తువులు, తళుక్కుమనే ఫ్లోరింగ్, నిర్మాణాలు సర్వత్రా పరుచుకుని కనిపించాయి.




మూడో బ్లాక్ ప్రవేశ మార్గం


ప్యాలెస్ నుంచి సముద్రం వ్యూ పాయింట్

## ఇంటీరియర్స్‌కి రూ.19.5 కోట్లు

రాజసౌధంలో ఏ గోడకు ఏ చిత్రం అతికించాలి, ఏ మూలన ఏ కళాఖండం పెట్టాలనే ఇంటీరియర్స్‌ను ప్రత్యేకంగా డిజైన్ చేశారు. వీటికోసం రూ.19.5 కోట్లు ఖర్చు చేశారు. ఇదంతా జనాల సొమ్మే. రాష్ట్రంలో ఎక్కడ ఏ పరిశ్రమ పెట్టాలని ఐదేళ్లలో ఒక్కసారి కూడా ఆలోచించని జగన్, తన రాజసౌధానికి మాత్రం ఏ హంగూ తగ్గకుండా చూసుకున్నారు.



## ఒక్కో షాండ్లియర్ రూ.15 లక్షలు

రుషికొండ ప్యాలెస్‌లో ఎటుచూసినా ధగధగలే. వీటన్నింటిని తలదన్నేలా సీలింగ్ మిలామిలా మెరిసిపోతోంది. సీలింగ్ మొత్తం ఖరీదైన షాండ్లియర్లతో నిండిపోయింది. జగన్ నివాసం ఉండాలనుకున్న బ్లాక్‌లో మొత్తం 7 షాండ్లియర్లు ఉన్నాయి. ఒక్కో దాని ధర రూ.15 లక్షలు. ఇంకా భవనం మొత్తం వాడిన లైట్ల ఖర్చు వేరే ఉంది.


రుషికొండ ప్యాలెస్ వద్ద నిర్మించిన రెండు హెలీప్యాడ్‌లు



## కరెంటు, నీరు, డ్రైనేజీలకు రూ.28 కోట్లు

నీటిసరఫరా, కరెంటు, సీవరేజ్ సౌకర్యాల కోసం ఇప్పటివరకు చేసిన ఖర్చు రూ.28 కోట్లు. ఇదంతా ప్రభుత్వ ఖాతానే. పనిచేసింది కూడా ప్రభుత్వ ఉద్యోగులే. కూలీలకు కూడా ప్రభుత్వ ఖజానా నుంచే కూలి చెల్లింపులు జరిగాయి.


## కుర్చీలు, బల్లల కోసం రూ.14 కోట్లు

జగన్ ప్రజల సొమ్ముతో నిర్మించుకున్న జల్సా ప్యాలెస్‌లో సోఫాలు, బల్లలు, కుర్చీలు, టేబుళ్లు.....అంటే ఫర్నిచర్ కోసం చేసిన ఖర్చు అక్షరాలా రూ.14 కోట్లు. ఎన్నికల్లో ఓడిపోయాక అక్కచెల్లెమ్మలకు, అవ్వాతాతలకు డబ్బులు పంచినా వారంతా ఓట్లేయలేదంటూ వాపోయిన జగన్....జనాల జేబుల్లో నుంచి లాక్కుని చేసిన ఈ జల్సా ఖర్చుల గురించి జనాలకు తెలియదనుకుంటున్నారేమో!




ప్యాలెస్ పక్క భవనంలో అత్యంత ఖరీదైన సమావేశ మందిరం

## ఒక్కో ఫ్యాను రూ.3 లక్షలు



భవనమంతా సెంట్రలైజ్డ్ ఏసీ. కానీ, సీలింగ్ మొత్తం ఎక్కడ చూసినా ఫ్యాన్లే. ఏసీల పక్కన కూడా అద్భుతమైన ఫ్యాన్లు దర్శనమిస్తున్నాయి. ఒక్కో ఫ్యాన్ ధర తెలిస్తే కళ్లు బైర్లు కమ్ముతాయి. ఒక్కో ఫ్యాన్ ధరతో పేద కుటుంబం ఏడాదంతా బతుకుతుంది. తన జల్సా ప్యాలెస్ కోసం జగన్ రూ.3 లక్షలు పెట్టి ఒక్కో ఫ్యాను కొన్నారు. ఇలాంటి ఫ్యాన్లు మొత్తం పదుల సంఖ్యలో ఉన్నాయి.

## రాజకోట రహస్యం

## ఈ నిర్మాణంపై త్వరలో చంద్రబాబు నిర్ణయం: గంటా


రుషికొండలోని ప్యాలెస్ వద్ద ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు, టీడీపీ, బీజేపీ, జనసేన శ్రేణులు

విశాఖపట్నం, అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఉత్తరాంధ్ర ఉద్ధరణ పేరుతో విశాఖలో కాపురమంటూ సీఎంగా ఉండగా జగన్ ఆర్భాటం చేశారు. కానీ, ఇదేదో సాదాసీదా కాపురం కాదు.. రూ.500 కోట్లతో రుషికొండపై కట్టుకున్న ప్యాలెస్‌లో పెట్టాలనుకున్న అత్యంత ఖరీదైన కాపురం. ఫైవ్‌స్టార్ హోటల్, సీఎం క్యాంప్ ఆఫీస్, టూరిజం ప్రాజెక్ట్, ఫేజ్ 1, 2 అంటూ కాకమ్మ కథలు చెప్పారు. కానీ, చివరకు రాజ భవనాన్నే కట్టేసుకున్నారు. ప్రజలకు, పెత్తందారులకు మధ్య యుద్ధం అంటూ ఊదరగొట్టిన జగన్, ఆ ప్రజల సొమ్ముతో జల్సా మహల్‌ను ఏర్పాటుచేసుకున్నారు. పైగా ఆ ఛాయలకు కూడా ప్రజలను కానీయలేదు. కేసులు పెట్టించి జైల్లో వేయించారు. ఎన్నికల్లో జగన్ ఓడిపోవడంతో ఇప్పుడు ఈ విలాసవంతమైన భవనాలు ప్రభుత్వానికి మిగిలాయి. ఈ భవనంలో వాడిని టైల్స్ ఒక్కో చదరపు అడుగు ధర రూ.26,000గా చెప్తున్నారు. ఆదివారం మధ్యాహ్నం మీడియా ప్రతినిధులు, స్థానిక నాయకులతో కలిసి మాజీ మంత్రి, భీమిలీ టీడీపీ ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు.. విశాఖ రుషికొండపై నిర్మాణాలు పూర్తి చేసుకున్న 'జగన్' ప్యాలెస్ లోపల అడుగుపెట్టారు. అక్కడి విలాసం చూసి ఆయన, మీడియాలో ప్యాలెస్ హంగులు చూసి జనమూ అవాక్కయ్యారు. అనంతరం ప్యాలెస్‌లోని రెండో బ్లాక్‌లో గంటా మిగతా నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే...

### ప్రజాస్వామ్యంలో కూడని నిర్మాణాలివి..

"ప్రజాస్వామ్యంలో ఈ తరహా నిర్మాణాలు ఎక్కడా చూడలేదు. రూ.91 కోట్లతో ఫైవ్‌స్టార్ హోటల్ నిర్మిస్తామని చెప్పి.. ఏకంగా రాజ భవనాన్నే నిర్మించుకున్నారు. అప్పట్లో ప్రభుత్వం చెప్పినట్టు.. పర్యావరణ రిసార్ట్స్‌కు సంబంధించిన ఛాయలేవీ కనిపించడం లేదు. పర్యాటకుల కోసం దీనిని కడితే రాత్రికి వారు బస చేయడానికి గదులు ఉండాలి. అవి ఒక్కొక్కటి 300 నుంచి 500 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఉండాలి. ఆ సైజులో ఇక్కడి ప్యాలెస్‌లోని ఒక్క రూమ్ కూడా లేదు. బాత్రూమ్ కూడా బెడ్‌రూమ్ సైజులో ఉంది. ఫైవ్‌స్టార్ హోటల్‌ను మించిపోయే వసతులు ఉన్నాయి. రూ.500 కోట్లతో సాగించిన ఈ ప్యాలెస్‌లో ఒక్కో హాల్, మార్బుల్, ఫర్నిచర్ ఇరాక్ మాజీ అధ్యక్షుడు సద్దాం హుస్సేన్, కర్ణాటకకు చెందిన గనుల వ్యాపారి గాలి జనార్దన్‌రెడ్డి వంటి వారు నిర్మించిన భవనాలను తలదన్నేలా ఉన్నాయి. ఎంతో మోజుపడి కట్టించుకున్న భవనంలోకి అడుగుపెట్టకుండానే జగన్ అధికారం నుంచి దిగిపోవాల్సి వచ్చింది"

### నాడు విపక్ష నేతలను ప్యాలెస్‌లోకి పోనీయలేదు..

"నాడు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ను ప్యాలెస్ వద్దకు వెళ్లనీయకుండా గతంలో పోలీసులు అడ్డుకున్నారు. ఎంతో మందిపై కేసులు కూడా పెట్టారు. ఈ ప్యాలెస్‌ను అప్పటి పర్యాటకశాఖ మంత్రి రోజా ప్రారంభించి వెళ్లిపోయారు. సాధారణంగా ప్రభుత్వం ఏదైనానిర్మించినప్పుడు అది ఎందుకు కడుతున్నదీ డ్రాయింగ్స్‌తో సహా డిస్‌ప్లే చేస్తారు. కానీ, దానికిభిన్నంగా అత్యంతరహస్యంగా ఎందుకు చేపట్టా రు?"

### అనుయాయులకు నిర్మాణ పనులు....

"రుషికొండపై మొత్తం 61 ఎకరాలు ఉండగా, 9.8 ఎకరాల్లో నిర్మాణాలు సాగించారు. పాత భవనాల కూల్చివేతకు, ల్యాండ్ స్కేపింగ్‌కు టెండర్లు పిలుస్తారు. కానీ, అందుకు విరుద్ధంగా వైసీపీ నాయకులకు పనులు కట్టబెట్టారు. అంతకుముందు ఉన్న హరిత రిసార్ట్ వల్ల ఏడాదికి ఎనిమిది కోట్లు ఆదాయం వచ్చేది. దానిని కూల్చివేయడం వల్ల ప్రభుత్వానికి ఆ ఆదాయం పోయింది. 20 అడుగుల ఎత్తులో బారికేడ్లు పెట్టి మరీ భవన నిర్మాణాన్ని పూర్తి చేశారు. ఈ నిర్మాణాన్ని ఏం చేయాలన్న దానిపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకుంటారు." అని గంటా వివరించారు. ప్రజాతీర్పును అపహాస్యం చేసేలా జగన్ ఐదేళ్ల పాలన సాగించారని ఆయన ధ్వజమెత్తారు.

## ఏ బ్లాక్‌లో ఏమున్నాయంటే..

**వేంగి 1(ఏ), 2(బి) :** ఇవి రెండు బ్లాక్‌లు. ఒకదానిలో సెక్యూరిటీ, బ్యాక్ ఆఫీస్. రెండోదానిలో అతిథి గదులు, సమావేశ మందిరాలు.

**కళింగ :** రిసెప్షన్, వెయిటింగ్ ఏరియా, సమావేశ మందిరాలు

**గజపతి :** హౌస్ కీపింగ్, కేఫ్ టేరియా, బిజినెస్ సెంటర్

**విజయనగర 1,2,3:** ఇవి మూడు బ్లాక్‌లు. ఒకటి జగన్, భారతిల కోసం. మిగిలిన రెండు కుమార్తెలకు చెరొకటి

## నాడు పర్యాటకశాఖ మంత్రి అవాస్తవాలు

ఈ ఏడాది ఫిబ్రవరిలో నాటి పర్యాటక శాఖ మంత్రి రోజా రుషికొండపై భవనాన్ని ప్రారంభించి, అనేక అవాస్తవాలు మాట్లాడారు. ఇది పర్యాటకుల కోసమే నిర్మించామని అబద్ధం ఆడేశారు. విశాఖలో సీఎం క్యాంపు కార్యాలయం ఏర్పాటు చేయాలని నిర్ణయించినందున, దానికి అవసరమైన భవనాల ఎంపిక కోసం ఏర్పాటైన త్రిసభ్య కమిటీ రుషికొండ భవనాన్ని సందర్శించిందని, ఇది జగన్‌కు బాగుంటుందని సూచించిందని చెప్పుకొచ్చారు. జగన్ అంగీకరిస్తే క్యాంపు కార్యాలయంగా ఇచ్చేస్తామని సెలవిచ్చారు. అయితే ఆ భవనాన్ని ఆయన నివసించడానికి వీలుగా విలాసవంతంగా నిర్మించుకున్నారని ప్రపంచమంతటికీ తెలుసు. కానీ అలాచేస్తే విమర్శలు వస్తాయని జగన్ అండ్ కోకూ తెలుసు. అందువల్లే కమిటీ చెప్పిందని వంకలు చూపి, అందులో ప్రవేశించాలని ప్రయత్నించారు. అయితే దేవుడు స్క్రిప్ట్ వేరేలా రాశారని విశాఖ ప్రజలు ఛలోక్తులు విసురుతున్నారు.


జగన్ కోసం నిర్మించిన ప్యాలస్ నుంచి మరో ప్యాలెస్‌లోకి వెళ్లేందుకు మార్గం

## ట్రీట్‌మెంట్ ప్లాంటు...

నీటి సరఫరా కోసం వంద కిలోలీటర్ల డొమెస్టిక్ సంప్, మరో 150 కిలోలీటర్లతో ఫైర్ సంప్, వ్యర్థ జలాల శుద్ధికి 100 కేఎల్‌డీ సూయిజ్ ట్రీట్‌మెంట్ ప్లాంటు నిర్మించారు. విద్యుత్ సరఫరా కోసం కంటెయినర్ సబ్‌స్టేషన్, ప్రత్యేకంగా అండర్ గ్రౌండ్ కేబుల్ వ్యవస్థ, వెయ్యి కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లు, 1010 కేవీఏ సామర్థ్యం కలిగిన మూడు జనరేటర్లు ఏర్పాటు చేశారు.



## గార్డెన్ కోసం రూ.22 కోట్లు

ఇంటికి ఏ వైపున ఏ చెట్లు ఉండాలి, ఎక్కడెక్కడ ఎంత ఖరీదైన లైట్లు పెట్టాలి, ఖరీదైన మొక్కలు నాటి గార్డెన్‌ను ఎలా విలాసవంతంగా తీర్చిదిద్దాలని ఆలోచించి చేసిన ఖర్చు ఏకంగా రూ.22 కోట్లు.

## ఏపీ టెక్నీషియన్ లక్ష్మీ సుభద్రకు అరుదైన చాన్స్

**» అంతర్జాతీయ కోర్ గ్రూప్‌లో పని చేసే అవకాశం**



అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సెంట్రల్ మలేరియా ల్యాబ్ టెక్నీషియన్ ఎంపీ లక్ష్మీసుభద్రకు అరుదైన అవకాశం దక్కింది. ప్రపంచవ్యాప్తంగా వివిధ దేశాల్లో దోమల ద్వారా వ్యాపించే వ్యాధులపై అధ్యయనం చేయడానికి అత్యంత ప్రతిష్ఠాత్మక అంతర్జాతీయ కోర్ గ్రూప్ (ఐసీజీ)లో పనిచేసే అవకాశం దక్కించుకున్నారు. ప్రస్తుతం సెంట్రల్ మలేరియా ల్యాబ్ టెక్నీషియన్‌గా విధులు నిర్వహిస్తున్న ఆమె ఐసీజీకి ఎంపిక కావడంపై రాష్ట్ర ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు ఆనందం వ్యక్తం చేశారు. ఐసీజీలో ఆమె మలేరియా వ్యాధి నివారణ, నియంత్రణపై అధ్యయనం చేయనున్నారు. ఢిల్లీలోని నేషనల్ సెంటర్ ఫర్ వెక్టర్ బోర్న్ డిసీజ్ కంట్రోల్ ప్రధాన కార్యాలయంలో శుక్రవారం ముగిసిన మలేరియా మైక్రోస్కోపిస్టుల పరీక్షలో లక్ష్మీ సుభద్ర లెవల్-1ను అధిగమించారు. భారత్‌లోని 12 రాష్ట్రాల నుంచి మొత్తం 22 మంది టెక్నీషియన్లు దీనికోసం పోటీపడగా సుభద్ర సహా ముగ్గురు మాత్రమే లెవల్-1ను అధిగమించారు.

## నెల్లూరులో జనసేన విజయోత్సవ ర్యాలీ



నెల్లూరు ర్యాలీలో జనసేన జాతీయ మీడియా అధికార ప్రతినిధి అజయ్‌కుమార్, జిల్లా నాయకులు

నెల్లూరు (స్టోన్‌హౌస్ పేట), జూన్ 16: నెల్లూరు నగరంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన జనసేన విజయోత్సవ ర్యాలీకి విశేష స్పందన లభించింది. పార్టీ జాతీయ మీడియా అధికార ప్రతినిధి వేములపాటి అజయ్‌కుమార్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ర్యాలీకి వేలాది మంది జనసేన నాయకులు, జనసైనికులు, అభిమానులు తరలి వచ్చారు. ఈ సందర్భంగా అజయ్‌కుమార్ మాట్లాడుతూ జనసేన పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా పోటీ చేసిన అన్నిస్థానాల్లో భారీ విజయాన్ని సాధించడంతో పాటు జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ఉపముఖ్యమంత్రి కావడంతో ఆ ఆనందాన్ని నెల్లూరు జిల్లాప్రజలతో కలిసి పంచుకోవడానికే ఈ విజయోత్సవ ర్యాలీ చేపట్టామన్నారు.

## రబీ కరువు ప్రాంతాలకు కేంద్ర బృందాలు

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ముగిసిన రబీ సీజన్‌లో ఏర్పడిన కరువు పరిస్థితిని అంచనా వేయడానికి కేంద్ర బృందం ఈ నెల 18 నుంచి నాలుగు రోజుల పాటు రాష్ట్రంలో పర్యటించనుంది. కేంద్ర ఉన్నతాధికారి రితీష్ చౌహాన్ నేతృత్వంలోని పది మంది సభ్యులు మూడు బృందాలుగా ఏర్పడి, కరువు ప్రభావిత ప్రాంతాలను సందర్శించనున్నారు. క్షేత్రస్థాయిలో రైతులతో మాట్లాడి, కరువు పరిస్థితిని విశ్లేషించనున్నారు. అనంతపురం, శ్రీసత్యసాయి జిల్లాల్లో ఒక బృందం, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో రెండో బృందం, నెల్లూరు, ప్రకాశం జిల్లాల్లో మూడో బృందం పర్యటిస్తుందని విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ ఆదివారం తెలిపారు.

## ఉద్యోగాల భర్తీపై సిట్‌తో విచారణ చేయించాలి

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): వైసీపీ ప్రభుత్వంలో ఏపీపీఎస్సీ భర్తీ చేసిన ఉద్యోగాలపై సిట్ విచారణ జరిపించాలని నిరుద్యోగ జేఏసీ రాష్ట్ర కన్వీనర్ షేక్ సిద్ధిక్ డిమాండ్ చేశారు. ఏపీపీఎస్సీని వైఎస్ఆర్‌పీఎస్సీగా మార్చారని ఆరోపించారు. గ్రూప్1 ఉద్యోగాల భర్తీలో అక్రమాలు జరిగినట్లు హైకోర్టులో నిర్ధారణ జరిగిందన్నారు. దీనిపై ప్రతిపక్ష నేత హోదాలో చంద్రబాబు నాయుడు అధికారంలోకి వచ్చాక విచారణ చేస్తామని ప్రకటించారని గుర్తుచేశారు. ఏపీపీఎస్సీని ప్రక్షాళన చేసి రాజ్యాంగబద్ధ సంస్థను పరిరక్షించాలన్నారు.

# సమస్యలు వింటూ.. పరిష్కారాలు చూపుతూ!

**» రెండో రోజూ మంత్రి లోకేశ్ ప్రజాదర్బార్**



మంత్రి లోకేశ్‌కు సమస్యలు విన్నవిస్తున్న ప్రజలు

తాడేపల్లి, జూన్ 16: మంగళగిరి నియోజకవర్గ ప్రజలకు అన్ని రకాలుగా అండగా ఉంటానని భరోసా ఇస్తూ విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహిస్తున్న 'ప్రజాదర్బార్' 2వ రోజు ఆదివారం కూడా కొనసాగింది. ఉదయం 7 గంటలకు ప్రారంభమైన ప్రజాదర్బార్‌కు ప్రజలు బారులుతీరి లోకేశ్‌ను కలిసి తమ సమస్యలను విన్నవించారు. స్థానికులు, వివిధ సంఘాల ఉద్యోగులు, పేరెంట్స్, పలువురు వ్యాధిగ్రస్తులు, దివ్యాంగులు, ఉద్యోగాల కోసం వచ్చిన వారు ఇలా అనేక వర్గాల ప్రజలు లోకేశ్‌ను కలిసి సమస్యలు విన్నవించారు.

- డీఎస్సీ-2008, జీవో 39 ప్రకారం ఎంటీఎస్ కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న 2,193 మందిని రెగ్యులర్ చేయాలని ఏపీ వెలుగు టీచర్స్ ఫెడరేషన్ నేతలు విన్నవించారు.
- గత ప్రభుత్వం ఫీజు రీయింబర్స్‌మెంట్ సక్రమంగా చెల్లించనందున తన పాలిటెక్నిక్ సర్టిఫికెట్లను నూజివీడు కాలేజి నుంచి ఇప్పించాలని జగదీశ్ అనే విద్యార్థి కోరారు.




- నాగార్జున యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధనేతర సిబ్బంది సేవలను 62 ఏళ్ల వరకు కొనసాగించాలని సిబ్బంది కోరారు.
- నులకపేట ఎంపీయూపీ ఉర్దూ ప్రభుత్వ పాఠశాలలో 9వ తరగతి విద్యా బోధనకు అనుమతి ఇవ్వాలని పాఠశాల పేరెంట్స్ కమిటీ కోరింది.
- అరుదైన వ్యాధితో బాధపడుతున్న 5 నెలల తన మేనల్లుడికి వైద్యసాయం అందించాలని మంగళగిరికి చెందిన షేక్ నజీనా కోరారు.
- డిగ్రీ ఎంబీఏ పూర్తిచేసిన తమ సోదరికి, తనకు ఉద్యోగం కల్పించాలని తాడేపల్లికి చెందిన కిరణ్‌బాబు, మౌనిక విజ్ఞప్తి చేశారు.
- దివ్యాంగుడినైన తనకు 40 ఏళ్లు వచ్చినా ఉద్యోగం రాలేదని గత ప్రభుత్వంలో నష్టపోయానని జీవనోపాధి కల్పించాలని తాడేపల్లికి చెందిన శ్రీనివాసరావు విజ్ఞప్తి చేశారు.
- అంగన్‌వాడీ హెల్పర్‌గా పనిచేస్తున్న తనకు ధర్నా చేశామన్న నెపంతో గతప్రభుత్వం ప్రమోషన్ ఆపేసిందని, ఇప్పించాలని కొలనుకొండకు చెందిన రాజేశ్వరి విన్నవించారు. అందరి సమస్యలు విన్న లోకేశ్ పరిష్కారానికి కృషిచేస్తానని హామీ ఇచ్చారు.

## బొత్స, సజ్జల డబ్బులడిగారు

**» కేజీబీవీల్లో తొలగించిన టీచర్ల ఆరోపణ**

**» న్యాయం చేయాలని లోకేశ్‌కు వినతి**

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): ఉద్యోగాలు కావాలంటే డబ్బులివ్వాలని విద్యాశాఖ మాజీ మంత్రి బొత్స సత్యనారాయణ, మాజీ సలహాదారు సజ్జల రామకృష్ణారెడ్డి తమను అడిగారని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయా (కేజీబీవీ)ల్లో ఉద్యోగాలు కోల్పోయిన టీచర్లు ఆరోపించారు. తమను విధుల్లోకి తీసుకోవాలని వేడుకోగా 'ఒట్టి చేతుల్తో కాదు.. పెట్టెలతో రావాలి' అన్నారని వాపోయారు. చివరికి కోర్టు తమను విధుల్లోకి తీసుకోవాలని ఆదేశించినా సమగ్రశిక్ష ఎస్పీడీ బి.శ్రీనివాసరావు ఆ ఆదేశాలను అమలుచేయకపోగా నోటికొచ్చినట్లు మాట్లాడారని ఆవేదన వ్యక్తంచేశారు. అన్యాయంగా ఉద్యోగాలు కోల్పోయిన తమను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని కోరుతూ.. ఆదివారం ఉండవల్లిలో మానవ వనరుల అభివృద్ధి శాఖ మంత్రి నారా లోకేశ్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ... 2018-19లో ప్రభుత్వ నోటిఫికేషన్ ద్వారా కలెక్టర్లు కేజీబీవీల్లో ఇంటర్ బోధనకు పోస్ట్ గ్రాడ్యుయేట్ టీచర్లను భర్తీ చేశారన్నారు. 2023లో రేషనలైజేషన్ పేరుతో సమగ్రశిక్ష అధికారులు తెలుగు, ఇంగ్లీషు టీచర్లను తొలగించారన్నారు. దీనిపై తాము హైకోర్టును ఆశ్రయించగా ఉద్యోగాల్లోకి తీసుకోవాలని ఆదేశాలు వచ్చాయని, కానీ.. ఎస్పీడీ అమలుచేయలేదని అన్నారు.

## పెట్టుబడులపై బాబు ఆరా!

**» కంపెనీలు, విస్తరణ తన దృష్టికి తేవాలని ఆదేశాలు**

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఓవైపు అధికార వ్యవస్థల ప్రక్షాళన, మరోవైపు టీడీపీ కార్యకర్తలు, నేతలకు సమయం ఇవ్వడం.. ఇంకోవైపు రాష్ట్రాభివృద్ధికి అవసరమైన ప్రణాళికల రూపకల్పనలో సీఎం చంద్రబాబు బిజీగా గడుపుతున్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు పెట్టుబడులు, అభివృద్ధి కార్యక్రమాలు పెద్దఎత్తున చేసేందుకు ప్రయత్నాలు చేపట్టారు. ముఖ్యంగా దేశంలో పెట్టుబడులకు సంబంధించి జరిగే పరిణామాలను ఎప్పటికప్పుడు తెలుసుకోవాలనుకుంటున్నారు. ఆదివారం సీఎంవోలో జరిగిన ఓ సమావేశంలో.. రూ.వేల కోట్ల టర్నోవర్ కలిగిన కంపెనీలు, సంస్థలు.. వాటి వ్యాపార విస్తరణకు సంబంధించిన వార్తలన్నీ నిత్యం తనకు చేరేలా చూడాలని అధికారులను ఆదేశించారు. ఏయే విదేశీ సంస్థలు పెట్టుబడుల కోసం భారత్ వైపు చూస్తున్నాయి.. కార్పొరేట్, బిజినెస్ రంగాల్లో పరిణామాలేమిటో ఎప్పటికప్పుడు తన దృష్టికి తేవాలన్నారు. వీటితో పాటు ముంబై, ఢిల్లీ కేంద్రంగా వెలువడే ఫైనాన్షియల్, బిజినెస్, ఇన్వెస్ట్‌మెంట్ వ్యవహారాలను రిపోర్ట్ చేసే జాతీయ వార్తాపత్రికలను కూడా ఉదయమే తన డ్యాష్‌బోర్డులో పెట్టాలని సూచించారు. ఏదైనా పెద్ద సంస్థ తన విస్తరణ కోసం ప్రణాళికలు రచిస్తుంటే ఈ పత్రికల్లో ఆ వార్తలు వచ్చే అవకాశం ఉంటుంది. తద్వారా వెంటనే రంగంలోకి దిగి వారితో మాట్లాడి రాష్ట్రానికి పెట్టుబడులు తీసుకురావచ్చనేది ఆయన వ్యూహంగా తెలుస్తోంది. పెట్టుబడులకు ఆంధ్ర అనువైన కేంద్రమని ముందుగానే కార్పొరేట్ రంగానికి తెలియజేయడం ద్వారా పెద్దఎత్తున పెట్టుబడులు సాధించవచ్చని చంద్రబాబు భావిస్తున్నారు. ఈ విషయంలో ఏ చిన్న అవకాశాన్ని కూడా వదులుకోవడానికి ఆయన సిద్ధంగా లేరు.

## త్యాగనిరతికి ప్రతీక బక్రీద్

**» ముస్లింలకు చంద్రబాబు శుభాకాంక్షలు**

అమరావతి, జూన్ 16(ఆంధ్రజ్యోతి): స్వార్థం, అసూయ, రాగద్వేషాలను విడిచిపెట్టి మానవుల్లో త్యాగనిరతిని వ్యాపింపచేయడమే బక్రీద్ పండుగ ముఖ్య ఉద్దేశమని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. హజ్రత్ ఇబ్రహీం త్యాగనిరతిని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను భక్తి శ్రద్ధలతో జరుపుకొంటున్న ముస్లిం సోదర సోదరీమణులకు సీఎం శుభాకాంక్షలు తెలిపారు. అన్ని గుణాల కన్నా దానగుణమే ఉత్తమమన్నది బక్రీద్ సారాంశమని, ఖుర్బానీ ద్వారా పేదలకు ఆహారం వితరణగా ఇస్తారని వివరించారు. బక్రీద్ స్ఫూర్తిగా సమైక్యతను, సమానత్వాన్ని సాధిద్దామని పిలుపునిచ్చారు.

ఐపీఎస్ బిందుమాధవ్‌పై

## సస్పెన్షన్ ఎత్తివేత

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల పోలింగ్ సమయంలో పల్నాడు జిల్లాలో గొడవలను నియంత్రించడంలో విఫలమైన ఎస్పీ జి.బిందుమాధవ్‌పై విధించిన సస్పెన్షన్ ప్రభుత్వం ఎత్తివేసింది. ఈ మేరకు ఆయన సస్పెన్షన్‌ను ఎత్తివేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ఆదివారం ఉత్తర్వులు జారీచేశారు. ఆ రోజు జరిగిన సంఘటనపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఆయన పూర్తి స్థాయిలో వివరణ ఇచ్చారని, దానిపై సంతృప్తి చెందిన కేంద్ర ఎన్నికల సంఘం ఆయనపై సస్పెన్షన్‌ను తొలగించాలని ఏపీ ప్రభుత్వానికి సూచించింది. ఈసీ ఆదేశాల మేరకు ఏపీ ప్రభుత్వం ఆయనపై సస్పెన్షన్ ఎత్తి వేసింది. ఆయనపై విచారణ మాత్రం కొనసాగించనుంది.

# భక్తులకు గుర్తుండిపోయేలా శ్రీవారి దర్శనం

**» టీటీడీ నూతన ఈవో శ్యామలరావు**



టీటీడీ ఈవోగా బాధ్యతలు స్వీకరిస్తున్న శ్యామలరావు

తిరుమల, జూన్ 16(ఆంధ్రజ్యోతి): భక్తులకు శ్రీవారి దర్శనం జీవితాంతం గుర్తుండిపోయేలా పరిపాలన అందిస్తామని టీటీడీ నూతన ఈవో శ్యామలరావు అన్నారు. శ్రీవారి ఆలయ అభివృద్ధిపై సీఎం చంద్రబాబుకు ప్రత్యేక విజన్ ఉందని, దానికి అనుగుణంగా పనిచేస్తామని చెప్పారు. శ్యామలరావు ఆదివారం మధ్యాహ్నం తిరుమల శ్రీవారి ఆలయంలో ధర్మారెడ్డి నుంచి బాధ్యతలు స్వీకరించారు. అనంతరం పద్మావతి గెస్ట్‌హౌస్‌లో మీడియాతో మాట్లాడారు. టీటీడీకి సంబంధించిన అన్ని విషయాలనూ పరిశీలన చేస్తామని, నిధులను సక్రమంగా వినియోగించుకోవాల్సిన అవసరముందని చెప్పారు. ఎక్కడైనా దుర్వినియోగం జరిగుంటే పరిశీలన చేస్తామని ఓ ప్రశ్నకు బదులిచ్చారు. జవాబుదారీతనం, పారదర్శకతతో పరిపాలన చేస్తానన్నారు. కాగా, ఈవోగా బాధ్యతలు తీసుకున్న తొలిరోజే రద్దీ ఎక్కువగా ఉండటంతో భక్తుల క్యూలైన్లను పరిశీలించారు.

### ఈవో బాధ్యతలను అదృష్టంగా భావిస్తున్నా..

'దేవుడి ఆశీస్సులు ఉంటే కానీ ఇక్కడ ఈవోగా పని చేసే అవకాశం రాదు. సీఎం చంద్రబాబు నాపై ఎంతో నమ్మకంతో టీటీడీ ఈవోగా అవకాశం కల్పించడం ఎంతో అదృష్టంగా భావిస్తున్నా' అని శ్యామలరావు సంతోషం వ్యక్తం చేశారు. సీఎం చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు కావాల్సిన సౌకర్యాలపై దృష్టిపెడతామని చెప్పారు. ఇంకా ఏమన్నారంటే.. 'దర్శనం, అన్నప్రసాదాలు, రవాణా, వసతిపై దృష్టిసారించి మెరుగైన సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకుంటాం. శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులకు ప్రత్యేక అనుభూతి కలిగించేలా చేయడంతోపాటు తిరుమల నుంచి వెళ్లిన తర్వాత కూడా జీవితాంతం ఆ అనుభూతి గుర్తుండేలా చర్యలు తీసుకుంటాం' అని చెప్పారు. కాగా, బోర్డులో తీసుకున్న నిర్ణయాలను భక్తులకు తెలియజేయాల్సిన అవసరం ఉందని, ఎందుకు తెలియజేయడం లేదో తెలీదని ఈవో పేర్కొన్నారు. పరిశీలన చేసి అందులోనూ పారదర్శకత ఉండేలా చూస్తాం. శ్రీవాణి ట్రస్టుపై వచ్చే ఆరోపణలను కూడా పరిశీలిస్తాం' అని వివరించారు.

# సత్యనారాయణ ఎస్కేప్

**» గప్‌చుప్‌గా మళ్లీ మాతృశాఖ రైల్వేస్‌కు**

**» జగన్ హయాంలో ఆర్థిక శాఖలో విధులు**

**» అన్ని అవకతవకల్లో భాగస్వామి**

**» అడ్డగోలు అప్పుల ఆలోచనలూ ఆయనవే**

అమరావతి, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను సర్వనాశనం చేసిన ఐఆర్ఏఎస్ అధికారి కేవీవీ సత్యనారాయణ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే చల్లగా జారుకున్నారు. తన మాతృశాఖ రైల్వేస్‌కు వెళ్లిపోయారు. నార్త్ ఈస్టర్న్ రైల్వేలో జాయిన్ కావాల్సిందిగా ఈ నెల 13వ తేదీన రైల్వే బోర్డు ఆయనకు ఆదేశాలిచ్చింది. ఈ నెల 18వ తేదీతో రాష్ట్రంలో ఆయన డిప్యుటేషన్ ముగియనుంది. 2017 నుంచి రాష్ట్ర ఆర్థిక శాఖలో సెక్రటరీగా విధులు నిర్వహించారు. 2019లో వైసీపీ అధికారంలోకి వచ్చాక అత్యంత కీలకమైన నిధుల చెల్లింపు విధులను జగన్ ఈ అధికారి చేతిలో పెట్టారు. ఐదేళ్ల పాటు ఫిఫో ఉల్లంఘిస్తూ జగన్ అస్మదీయులకు మాత్రమే బిల్లులు చెల్లించారు. కేవలం పెండింగ్ బిల్లుల కోసమే హైకోర్టులో 4 లక్షల పిటిషన్లు పడ్డాయి. వీరెవరినీ ఖాతరు చేయకుండా కేవలం జగన్ అస్మదీయులకు బిల్లులు చెల్లిస్తూ స్వామిభక్తిని చాటుకున్నారు. ఎన్నికలు ఫలితాలు వచ్చాక, సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజు కూడా జగన్ లాయర్లకు, అమరావతికి వ్యతిరేకంగా వాదించిన లాయర్లకు బిల్లులు చెల్లించారు. గత ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం తెచ్చిన రాజ్యాంగ విరుద్ధ, అడ్డగోలు అప్పుల ఆలోచనలన్నీ సత్యనారాయణవే. వైజాగ్‌లో ప్రభుత్వ భూములు, కార్యాలయాలు, కాలేజీలు, పార్కులు, పోర్టు భూముల నుంచి రాష్ట్ర సచివాలయం తాకట్టు వెనుక ఈ అధికారిదే హస్తం. ఏపీసీఎఫ్ఎస్ఎస్ పేరుతో శాఖల వద్ద ఉన్న నిధులన్నీ డిపాజిట్ల రూపంలో ఊడ్చేసిన మహా ఘనుడు. ఏపీఎస్‌డీసీ పేరుతో ఖజానాకు రావాల్సిన ఆదాయాన్ని మళ్లించి బ్యాంకుల నుంచి రూ.25,000 కోట్ల అప్పు రాజ్యాంగ విరుద్ధంగా తెచ్చారు. ఖజానాకు జమ కావాల్సిన మద్యం వ్యాట్ ఆదాయాన్ని స్పెషల్ మార్జిన్ పేరుతో బేవరేజెస్ కార్పొరేషన్‌కు మళ్లించి అడ్డగోలుగా రూ.22,500 కోట్ల అప్పులు చేశారు. ఏపీఎండీసీ వాటాలు అమ్మకానికి పెట్టి మార్కెట్ నుంచి రూ.7,000 కోట్లు అప్పులు తీసుకొచ్చారు. ఇలాంటి ఘోరమైన అప్పులకు సత్యనారాయణే కారకులు. దేశంలోనే అత్యుత్తమ చెల్లింపుల వ్యవస్థగా అవార్డులు అందుకున్న సీఎఫ్ఎంఎస్‌ను సర్వనాశనం చేసి, ప్రభుత్వ ఆర్థిక లావాదేవీలను గందరగోళం చేశారు. రాష్ట్రానికి ఇంత ద్రోహం చేసిన ఈ అధికారి గప్‌చుప్‌గా రాష్ట్రం నుంచి జారుకున్నారు. గత ఐదేళ్ల పాటు ఆర్థిక శాఖలో జరిగిన అన్ని అవకతవకల్లోనూ ఈ అధికారి భాగస్వామి. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే గత ఐదేళ్లలో వ్యవస్థలను తుంగలో తొక్కి వైసీపీకి ఏకపక్షంగా వ్యవహరించిన అధికారులను రిలీవ్ చేయకూడదని ఆదేశాలిచ్చారు. అయినప్పటికీ సత్యనారాయణ తప్పించుకుని వెళ్లిపోయారు.

## కరికాల వలవన్ రాజీనామా

గత ప్రభుత్వం కొంత మంది అఖిల భారత సర్వీస్ అధికారులకు రిటైర్డ్ అయిన తర్వాత కూడా సర్వీస్ కొనసాగించింది. నిబంధనలకు విరుద్ధంగా వారిని కీలక పోస్టుల్లో నియమించింది. కొత్త ప్రభుత్వం రావడంతో ఆ అధికారులందరూ తప్పుకోవాలని సాధారణ పరిపాలన శాఖ ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు దేవదాయ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కరికాల వలవన్ రాజీనామా చేశారు. ఆయన ఎక్స్‌టెన్షన్ ఈ ఏడాది ఆగస్టు నెలతో గడువు ముగుస్తుంది. రెండు నెలల ముందే ఆయన రాజీనామా చేశారు. ఆయనతో పాటు మరో ఐదుగురు అధికారులు రాజీనామా చేయాల్సి ఉంది.

# జగన్‌పై క్రిమినల్ చర్యలు తీసుకోండి

**» గుంటూరులో బ్రాహ్మణ వేదిక నేత ఫిర్యాదు**



గుంటూరులో సీసీఎస్ అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేస్తున్న బ్రాహ్మణ చైతన్య వేదిక అధ్యక్షుడు శిరిపురపు శ్రీధర్ శర్మ తదితరులు

అమరావతి (ఆంధ్రజ్యోతి), గుంటూరు, సాలూరు, జూన్ 16: క్యాంపు కార్యాలయం ముసుగులో ప్రజాధనం దోపిడీ చేయడమే కాకుండా ఓటమి అనంతరం ప్రభుత్వానికి అప్పగించాల్సిన కోట్ల ఖరీదైన సామగ్రిని తన ఇంట్లో అక్రమంగా ఉంచుకుని వాడుకుంటున్న మాజీ సీఎం జగన్, ఆయనకు సహకరించిన అధికారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని టీడీపీ నాయకుడు, బ్రాహ్మణ చైతన్య వేదిక రాష్ట్ర అధ్యక్షుడు శిరిపురపు శ్రీధర్ శర్మ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఆదివారం తెలుగు యువత, బ్రాహ్మణ చైతన్య వేదిక నాయకులతో కలసి గుంటూరు ఎస్పీ కార్యాలయంలో సీసీఎస్ అదనపు ఎస్పీ శ్రీనివాసరావుకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు అందించారు. జగన్ తాడేపల్లిలోని తన సొంత ఇంటికి సుమారు రూ.45.54 కోట్ల విలువైన ప్రజాధనం వెచ్చించి హంగు ఆర్భాటాలతో విలాసవంతమైన మౌలిక సదుపాయాలు కల్పించుకున్నారని పేర్కొన్నారు. శ్రీధర్ మీడియాతో మాట్లాడుతూ.. మాజీ స్పీకర్ డాక్టర్ కోడెల శివప్రసాదరావు విషయంలో గతంలో జగన్ ప్రభుత్వం ఏవిధంగా వ్యవహరించిందో, ఇప్పుడు జగన్ విషయంలో కూడా కొత్త ప్రభుత్వం అదేవిధంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. అప్పట్లో కోడెల ముందుగానే ఫర్నీచర్ విషయాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చారని, ఇప్పుడు జగన్ మాత్రం మీడియా బయట పెట్టేవరకూ గుట్టుగా ఉంచారన్నారు. కోడెల మీద పెట్టిన కేసులోని సెక్షన్‌ల కంటే జగన్‌పై అదనపు సెక్షన్‌ల కింద కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు.

### జగన్ ఫర్నిచర్ దొంగ: అనగాని

జగన్ ఇంట్లో ఉన్న ప్రభుత్వ ఫర్నిచర్‌ను సరెండర్ చేయకుండా వాడుకుంటూ వైసీపీ నేతలు నీతులు చెప్పడం సిగ్గుచేటని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ విమర్శించారు. గతంలో ఫర్నిచర్ విషయంలో మాజీ స్పీకర్ కోడెల శివప్రసాద్‌పై అసత్య ఆరోపణలు చేసిన వైసీపీ నేతలు ఇప్పుడు ఏం సమాధానం చెప్తారని ప్రశ్నించారు. జగన్‌కు ఏ మాత్రం నైతిక విలువలున్నా ప్రభుత్వ సొమ్ముతో తన ఇంట్లోకి కొనుగోలు చేసిన ఫర్నిచర్‌ని ప్రభుత్వానికి అప్పగించాలని అనగాని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేసిన తర్వాత కూడా ప్రభుత్వ ఆస్తులను వాడుకుంటున్న జగన్‌కు నిబంధనలు పట్టవా? అని రాష్ట్ర మంత్రి గుమ్మిడి సంధ్యారాణి ప్రశ్నించారు. ఆదివారం పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో ఆమె మాట్లాడుతూ.. లక్షలాది రూపాయలు విలువ చేసే ఫర్నిచర్ అప్పగించలేదని నాడు మాజీ స్పీకర్ కోడెల శివప్రసాదరావుపై వైసీపీ ప్రభుత్వం నిందలు మోపిందన్నారు.

## ఖరీదెందో చెబితే చెల్లిస్తాం!

**» లేళ్ల అప్పిరెడ్డి స్పందన**

మాజీ సీఎం జగన్ క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫర్నిచర్, ఇతర వివరాలు అందిస్తే వాటి ఖరీదు చెల్లించేందుకు తాము సిద్ధంగా ఉన్నట్లు వైసీపీ ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి అన్నారు. జగన్మోహన్‌రెడ్డి సొంత ఇంట్లో ప్రభుత్వ ఖర్చుతో ఏర్పాటు చేసిన వాటి ఖరీదెంతో చెబితే చెల్లించేందుకు తాము సిద్ధమంటూ వైసీపీ తన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి ద్వారా ప్రకటన ఇప్పించింది.



Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.

ఆంధ్రజ్యోతి III
నవ్య
కుటుంబ కదంబం
సోమవారం ● 17 జూన్ 2024



వారసత్వంగా కొందరు... సేవా దృక్పథంతో మరి కొందరు... ఇటీవలి కాలంలో యువత రాజకీయాల్లో భాగస్వాములవుతున్నారు. ముఖ్యంగా మహిళలు నేరుగా ప్రజా క్షేత్రంలోకి దూకి... సవాలు విసురుతున్నారు. అలాంటి నవతరం నాయికలే హిందీ రాష్ట్రాలకు చెందిన శాంభవి చౌదరి, ప్రియా సరోజ్, సంజనా జాటవ్. పాతికేళ్ల ప్రాయంలో తొలిసారి పార్లమెంట్‌లో అడుగుపెడుతున్న ఈ ముగ్గురి నేపథ్యం ఇది...

# నవతరం నాయికలు

## పీహెచ్‌డీ విద్యార్థి

(శాంభవి చౌదరి, సమస్తీపూర్)

'కాలేజీలో చదివే రోజుల్లో ఒకసారి పార్లమెంటు చూడడానికి వెళ్లాను. నేడు ఎన్నికైన ఒక పార్లమెంటు సభ్యురాలిగా సభలోకి అడుగు పెడుతున్నాను. తలుచుకొంటేనే మహాద్భుతంగా అనిపిస్తోంది. ఎంతో ఉత్సుకతగా ఉంది. ఎన్నికలకు ముందు నా నియోజకవర్గానికి వెళ్లినప్పుడు నేనొక సాధారణ పౌరురాలిని. ఎంపీగా తిరిగి అక్కడకు వెళ్లినప్పుడు ఎంతో భావోద్వేగానికి లోనయ్యాను' అంటూ తన సంతోషాన్ని పంచుకున్నారు శాంభవి చౌదరి. ఆమె వయసు పాతికేళ్లు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో 'లోక్ జనశక్తి పార్టీ' (రామ్‌విలాస్) అభ్యర్థిగా బిహార్‌లోని సమస్తీపూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి గెలుపొందారు. 'మగధ్ విశ్వవిద్యాలయం'లో 'రోల్ ఆఫ్ ఉమెన్ ఇన్ ఎలక్టోరల్ పాలిటిక్స్ ఇన్ బిహార్' అంశంపై ప్రస్తుతం ఆమె పీహెచ్‌డీ చేస్తున్నారు.

అయితే శాంభవికి రాజకీయాలు కొత్తేమీ కాదు. ఆమె తాతయ్య మహావీర్ చౌధరి చాలా కాలం కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. తండ్రి అశోక్ చౌధరి నితీష్‌కుమార్ ప్రభుత్వంలో మంత్రి. వాస్తవానికి శాంభవి సమస్తీపూర్ నివాసితులు కాదు. ఎన్నికల ప్రచారంలో ఈ అంశాన్ని ఒక అస్త్రంగా ఉపయోగించుకోవాలని అనుకున్నారు ఆమె ప్రత్యర్థులు. బయటి వ్యక్తి అంటూ హోరెత్తించారు. 'నా ఇల్లు ఇక్కడ ఉందా లేదా అన్నది ఓటర్లకు అవసరం లేదు. వాళ్లకు కావల్సింది... తమ తరఫున నిలబడి మాట్లాడగలిగే బలమైన నాయకులు. వారి సమస్యలను పరిష్కరించగలిగే సమర్థులు' అంటూ విమర్శలను తిప్పికొట్టారు శాంభవి. 'ఇంత చిన్న వయసులో మీరేం చేయగలరు' అని కూడా ఆమెను ప్రజలు ప్రశ్నించారు. 'నిజమే... నాతో పోటీపడుతున్న రాజకీయ నాయకులతో పోలిస్తే నేను చాలా చిన్నదాన్ని. కానీ నియోజకవర్గ సమస్యలపై పూర్తి అవగాహన ఉన్నదాన్ని. వాటి పరిష్కారానికి కృషి చేయాలన్న దృఢ సంకల్పంతో రాజకీయాల్లోకి వచ్చాను' అని బదులిచ్చి ప్రజల నమ్మకాన్ని గెలుచుకున్నారు. 'చిన్నప్పటి నుంచి రాజకీయాలు చూస్తూ పెరిగాను. కానీ ప్రజాక్షేత్రంలో నిలబడి వాళ్ల నమ్మకాన్ని పొందాలంటే ఎన్నో సమస్యలు, సవాళ్లు ఎదురవుతాయి. వాటన్నిటినీ నేను అధిగమించాను' అంటారామె. విశేషమేమంటే... సమస్తీపూర్ నియోజకవర్గం నుంచి పార్లమెంటుకు వెళుతున్న తొలి మహిళా ప్రతినిధి శాంభవి.

'అణగారిన వర్గాల అభ్యున్నతికి పాటుపడతా. యువత, మహిళల సాధికారత కోసం కృషి చేస్తానని విజయానంతరం నియోజకవర్గ ప్రజలకు మాటిచ్చాను. అలాగే రవాణా సౌకర్యాలను మెరుగు పరిచి, మా రాష్ట్రానికి మరిన్ని పెట్టుబడులు తెచ్చేందుకు ప్రయత్నిస్తా. తరచూ నా నియోజకవర్గాన్ని సందర్శించి, ప్రజలకు అందుబాటులో ఉంటా' అంటున్నారు ఈ యువ నాయకి.

## వారి ప్రతినిధిగా...

(ప్రియా సరోజ్, మఛలీషహర్)

ఉత్తరప్రదేశ్ మఛలీషహర్ నియోజకవర్గం నుంచి గెలుపొందిన మరో పాతికేళ్ల యువతి ప్రియా సరోజ్. 'సమాజ్‌వాదీ పార్టీ' తరుపున పోటీ చేసిన ఈమెదీ రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబమే. ఆమె తండ్రి తూఫానీ సరోజ్ మూడుసార్లు ఎంపీ. ప్రస్తుతం కేరాకత్ నియోజకవర్గ ఎమ్మెల్యే. 'చిన్నప్పుడు నాన్నతో కలిసి చాలాసార్లు పార్లమెంటు భవనం చూశాను. కానీ ఈసారి ఎంతో ప్రత్యేకం. ఎన్నికల్లో పోటీ చేయడం, గెలవడం, ఒక సభ్యురాలిగా పార్లమెంటులో కూర్చోవడం... ఎంతో గర్వంగా ఉంది'... అంటారు ప్రియ. ఎన్నికల ప్రచారం వెనుకబడిన, అణగారిన వర్గాలు, మైనార్టీల గొంతుకగా తనను తాను అభివర్ణించుకున్న ప్రియ... అదే నినాదంతో పోటీకి దిగారు. రాజకీయాల్లోకి రాకముందే తన నియోజకవర్గం గురించి పూర్తి అవగాహన ఉంది. 2022 ఎన్నికల్లో తండ్రి కోసం ఆమె ఇంటింటికీ తిరిగి ప్రచారం చేశారు. 'ఢిల్లీ విశ్వవిద్యాలయం' నుంచి బీఏ పట్టా పొందిన ప్రియ... నోయిడా 'అమిటీ యూనివర్సిటీ'లో ఎల్ఎల్‌బీ చదివారు. ఎన్నికల బరిలోకి దిగే ముందు సుప్రీంకోర్టులో కేసులు వాదించారు. లా అండ్ ఆర్డర్, ఇతర సామాజిక అంశాలపై అవగాహన కల్పించడం ద్వారా మహిళా సాధికారత సాధించాలనేది ఆమె ఆశయం. అలాగే కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) అందించి, రైతులకు అండగా నిలుస్తాననీ, ఉద్యోగ అవకాశాలు పెంచే దిశగా కృషి చేస్తాననీ హామీ ఇచ్చారు.



విన్నర్

## కానిస్టేబుల్ సతీమణి...

(సంజనా జాటవ్, భరత్‌పూర్)

కింది స్థాయి నుంచి ఎదిగిన యువ నాయకురాలు సంజనా జాటవ్. రాజస్తాన్‌లోని భరత్‌పూర్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ పార్టీ తరుపున బరిలోకి దిగారు. బీజేపీ సిటింగ్ ఎంపీ రామ్‌స్వరూప్‌పై భారీ మెజారిటీతో విజయం సాధించారు. ఇది ముఖ్యమంత్రి భజన్‌లాల్ శర్మ స్వస్థలం. అందుకే సంజనను ఓడించడానికి ప్రత్యర్థులు సర్వశక్తులూ ఒడ్డారు. నియోజకవర్గం మీద పట్టున్న ఆమె, తన వాగ్ధాటితో వాటన్నిటినీ తిప్పి కొట్టారు.

రాష్ట్ర కాంగ్రెస్‌లో కార్యకర్త స్థాయి నుంచి ఎంపీ వరకు అత్యంత వేగంగా ఎదిగిన నాయకురాలు సంజన. 'నియోజకవర్గంలో పెచ్చుమీరుతున్న నేరాలు, నిరుద్యోగం, నీటి కొరత, విద్యుత్ అంతరాయాలు, అధ్వానమైన రోడ్లు, రైతులకు కనీస మద్దతు ధర లేకపోవడం, ఎరువులు, విత్తనాల కొరత... ఇలా అడుగడుగునా సమస్యలే. అన్నింటా మా ప్రాంతం వెనకబడిపోయింది. ఈ సమస్యలనే ప్రచార అస్త్రాలుగా ఉపయోగించాను. దానికి తోడు మొదటి నుంచీ నాకు ఇక్కడి ప్రజల స్థితిగతులపై పూర్తి అవగాహన ఉంది. నన్ను నమ్మి గెలిపించిన ప్రజలకు అండగా నిలబడతాను' అంటున్న సంజన బీఏ చదివారు. 'లడకీ హూ... లడ్‌సక్తీ హూ' అనే నినాదంతో, స్త్రీసాధికారత లక్ష్యంగా జనంలోకి వెళ్లారు. గత ఏడాది జరిగిన రాజస్తాన్ అసెంబ్లీ ఎన్నికల్లో కతుమార్ (ఎస్‌సీ) స్థానం నుంచి పోటీ చేసి 409 ఓట్ల స్వల్ప తేడాతో ఓడిపోయారు. వార్డు మెంబర్‌గా గెలిచి తన రాజకీయ ప్రస్థానం మొదలుపెట్టిన 26 ఏళ్ల సంజన... నిత్యం జనం మధ్యే ఉంటూ, వారితో మమేకమయ్యారు.

సంజన భర్త కప్తాన్ సింగ్ పోలీస్ కానిస్టేబుల్. వారికి ఇద్దరు పిల్లలు. స్థానిక 'గాంధీ జ్యోతీ కాలేజీ'లో బీఏ చదివిన ఆమె... 'లార్డ్స్ యూనివర్సిటీ' నుంచి ఎల్ఎల్‌బీ పట్టా పొందారు. అణగారిన వర్గాలు, మహిళల పక్షాన నిలిచి, వారి అభ్యున్నతికి పాటు పడుతున్నారు. అవే సంజన విజయానికి బాటలు వేశాయి.



# ఎకో విలేజ్ లేడీ...

"సామాన్యుల బతుకులు మారితేనే సమాజంలో పురోగతి సాధ్యమవుతుంది. ఆ పురోగతికి మార్గం మహిళా సాధికారతే" అంటారు నేహా ఉపాధ్యాయ్. పర్యాటకురాలుగా లద్దాఖ్ సందర్శించిన ఆమె... అక్కడ పరిస్థితులను చూసి ఆవేదన చెందారు. తాను ఆశించిన మార్పునకు స్వయంగా శ్రీకారం చుట్టి... వేలాది జీవితాల్లో వెలుగులు నింపుతున్నారు. 'భారతదేశపు ఎకో విలేజ్ లేడీ'గా ప్రసిద్ధి చెందిన నేహా... తన పదేళ్ల సేవా ప్రస్థానం గురించి ఏం చెబుతున్నారంటే...

"కొత్త ప్రదేశాల్ని సందర్శించడం, అక్కడి ప్రజల జీవన విధానాన్ని గమనించడం నాకు ఇష్టం. దేశంలో ఎన్నో ప్రాంతాలకు వెళ్లాను. కానీ 2010లో... లద్దాఖ్‌లోని లేహ్‌లో పర్యటనను నా జీవితంలో మరచిపోలేను. సముద్ర మట్టానికి దాదాపు 11 వేల అడుగుల ఎత్తున ఉండే ఆ ప్రదేశంలో వాతావరణం విలక్షణంగా ఉంటుంది. మామూలుగా వర్షపాతం చాలా తక్కువ. కానీ హఠాత్తుగా భారీ వర్షాలు కురిస్తే... అల్లకల్లోలం తప్పదు. ఎందుకంటే... వర్షాలను తట్టుకోవడానికి తగిన ఏర్పాట్లు అక్కడ లేవు. అక్కడికి నేను వెళ్ళిన సమయంలోనే... కుండపోత వర్షాలు పడి, వరదలు ముంచుకొచ్చాయి. అందులో ఆరు వందల మందికి పైగా ప్రాణాలు కోల్పోయారు. లద్దాఖ్ పరిధిలో ఎనభై శాతం మౌలిక సదుపాయాలు పూర్తిగానో, పాక్షికంగానో ధ్వంసమయ్యాయి. అరవైకి పైగా గ్రామాలు నాశనమయ్యాయి. బతికి బయటపడ్డవాళ్ళు కట్టుబట్టలతో మిగిలారు. కొన్ని రోజులపాటు నేను అక్కడే చిక్కుకుపోయాను. అప్పుడే అక్కడి ప్రజల కష్టాలను కళ్లారా చూశాను. వాళ్ళ బతుకులు బాగుపడడానికి ఏదైనా చెయ్యాలనుకున్నాను.



### విడ్డూరంగా చూశారు...

నేను పుట్టింది, పెరిగింది ఢిల్లీలో. లండన్‌లోని కింగ్స్ కాలేజీలో గ్రాడ్యుయేషన్ చేశాను. ఇంగ్లండ్‌లోని విద్యా సంస్థల్లో ఉద్యోగాలు చేశాను. కొన్నాళ్ళ తరువాత మన దేశానికి వచ్చేశాను. అదే సమయంలో... లద్దాఖ్‌కు వెళ్ళినప్పుడు... అక్కడ కళ్ళారా చూసిన విధ్వంసం నన్ను కదిలించింది. భీకరమైన వరద నుంచి ఆ ప్రాంతం కాస్త కోలుకున్నాక... మళ్ళీ అక్కడికి వెళ్ళి, పరిస్థితుల మీద అధ్యయనం చేశాను. ఒక లీటర్ నూనె కోసం కొన్ని గ్రామాల ప్రజలు 35 కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని విని... మొదట నమ్మలేకపోయాను. ఆ సమస్య పరిష్కారం కోసం అధికారుల చుట్టూ కొన్నాళ్ళు తిరిగి, ఆ గ్రామాల్లో నూనె తీసే యంత్రాలను ఏర్పాటు చేయించాను. ఇక అక్కడి మహిళల బాధలు వర్ణనాతీతం. ఒక హెక్టార్ పొలంలో ఏడాదికి సగటున 1,212 గంటలపాటు పురుషులు పనిచేస్తే... మహిళలు 3,485 పని చేయాల్సి వస్తోంది. ఇంటి పనులు, వంట పనులు, పిల్లల పెంపకం, అత్తమామల సంరక్షణ... ఇలాంటి పనులు మామూలే. వారికి ఆర్థిక స్వావలంబన కల్పించడమే లక్ష్యంగా... 'విశ్వదీప్ ట్రస్ట్'ను... దానికి అనుబంధంగా 'గుణ ఆర్గానిక్స్' అనే సంస్థను ప్రారంభించాను. కొంత పొలాన్ని తీసుకొని... సేంద్రియ వ్యవసాయానికి ప్రణాళికలు రూపొందించాను. మహిళలతో సమావేశాలు ఏర్పాటు చేసి... రసాయనాల వాడకం వల్ల ఖర్చు ఎక్కువ కావడంతోపాటు పర్యావరణానికి హాని కలుగుతుందని వివరించాను. ఇది విని వాళ్ళు విడ్డూరంగా చూశారు. ఎందుకంటే... ఖరీదైన రసాయన ఎరువులు ఉపయోగిస్తేనే... పంటలు బాగా పండుతాయనే భావన వారిలో నాటుకుపోయింది. ఇంకా వ్యవసాయం విషయంలో వారికి ఎన్నో అపోహలు ఉన్నాయి. వాటన్నిటినీ క్రమంగా తొలగించాను. నా పొలంలో పనులన్నిటికీ మహిళలనే కుదుర్చుకున్నాను. ఒక పంట చేతికి వచ్చాక... వారిలో విశ్వాసం పెరిగింది. ఆ తరువాత ఇతర రైతులు కూడా అనుసరించడం మొదలుపెట్టారు.

### ఎకో మోడల్ విలేజ్‌లు...

గత పదేళ్ళ కాలంలో... మూడువేల మందికి పైగా రైతులకు మా ట్రస్ట్ ఆర్థిక స్వావలంబన కల్పించింది. గ్రామీణుల జీవన పరిస్థితుల్ని మెరుగుపరచడం, మరిన్ని ఉపాధి అవకాశాలను కల్పించడం ప్రధాన లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. అలాగే పంటలను ఎండబెట్టడానికి... సోలార్ డ్రైయింగ్ పద్ధతులను కూడా పరిచయం చేశాం. అన్ని దశల్లోనూ సౌరశక్తినే వినియోగిస్తూ, సేంద్రియంగా సాగు చేయడం కోసం ప్రయోగాత్మకంగా తక్‌మచిక్ గ్రామాన్ని ఎంచుకున్నాం. దాన్ని మొదటి ఎకో మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దాం. ఇది మాకు మంచి పేరు తెచ్చిపెట్టింది. ఇప్పటివరకూ ఎనిమిది గ్రామీణ ప్రాంతాలను ఎకో విలేజ్‌లుగా మార్చాం. సౌరశక్తితో ఎండబెట్టిన ఉత్పత్తుల మార్కెటింగ్ ద్వారా మహిళలు మంచి ఆదాయం పొందుతున్నారు. మరోవైపు స్థానికంగా సామాజికాభివృద్ధి కార్యక్రమాలను కూడా మా ట్రస్ట్ విరివిగా చేపడుతోంది. ఎప్పటికప్పుడు ఆధునిక వ్యవసాయ పద్ధతుల్లో, ఉత్పత్తుల మార్కెటింగ్‌లో శిక్షణ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. ఇళ్ళలో టాయిలెట్ల ఏర్పాటుకు సహాయం అందిస్తున్నాం. కోవిడ్ సమయంలోనూ, అలాగే వరదలు, ఇతర సంక్షోభాలు వచ్చిన సమయంలో సహాయ, పునరావాస చర్యలు చేపట్టాం. ఇప్పుడు ఢిల్లీ, సిక్కింలకు కూడా మా ప్రాజెక్టులను విస్తరించాం. సుస్థిరమైన పర్యావరణ పరిరక్షణ ఆవశ్యకతపై పాఠశాలలు, కర్మాగారాలు, కార్పొరేట్ సంస్థల్లో ప్రచారం చేస్తున్నాం. 'బీట్ ది ప్లాస్టిక్ పొల్యూషన్' ఉద్యమం ద్వారా... మేము కార్యకలాపాలు చేపట్టిన గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా మార్చాం. గత పదేళ్ళలో ఎన్నో సంస్థలు నాకూ, మా ట్రస్ట్‌కూ పురస్కారాలు అందజేశాయి. బ్రిటిష్ కౌన్సిల్ నుంచి 'సోషల్ ఇంపాక్ట్ ఇండియా అవార్డు, ఐఐటి ఢిల్లీ నుంచి 'ఎంటర్‌ప్రెన్యూర్ ఎక్సలెన్స్' అవార్డు, 'ఎర్త్‌డే నెట్‌వర్క్ స్టార్' అవార్డు వీటిలో ముఖ్యమైనవి. 'భారతదేశపు ఎకో విలేజ్ లేడీ' అనే గుర్తింపు నా బాధ్యతను మరింత పెంచుతోంది. దేశంలోని గ్రామాలన్నీ ఎకో విలేజ్‌లుగా మారాలన్నది నా కల. యువతలో మునుపటికన్నా పర్యావరణ స్పృహ బాగా పెరుగుతోంది కాబట్టి... భవిష్యత్తులో ఆ కల నిజమవుతుందనే నమ్మకం నాకుంది."



# నవ్య | చిత్రజ్యోతి




కళావేదిక, రాఘవి మీడియా సంస్థల ఆధ్వర్యంలో 'కళావేదిక ఎన్టీఆర్ ఫిల్మ్ అవార్డ్స్' ప్రధానోత్సవ కార్యక్రమం ఈ నెల 29న హైదరాబాద్‌లోని దసపల్లా హోటల్‌లో జరుగనుంది. ఈ కార్యక్రమం పోస్టర్‌ను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదివారం ఆవిష్కరించి, నిర్వాహకులను అభినందించారు.

## ట్రెండ్ సెట్ చేసే రారాజు



సినిమా టైటిల్ కార్డ్స్ నుంచి శుభం కార్డుపడేవరకూ తెరపై ఎన్నో పాత్రలు వచ్చి పోతుంటాయి. అలాంటిది సినిమా ఆద్యంతం పాత్రధారుల ముఖాలు కనిపించకుండా తెరకెక్కించి ప్రేక్షకులను మెప్పించడం సాధ్యమేనా? అంటే ఆ పనిని తాము విజయవంతంగా పూర్తి చేశామంటున్నారు దర్శక నిర్మాత బి. శివ ప్రసాద్. ఆయన రూపొందించిన 'రారాజు' చిత్రంలోని 24 మంది పాత్రధారుల ముఖాలు కనిపించవు. బిగి సడలని కథనం బోర్ కొట్టకుండా ప్రేక్షకులను కథలో లీనమయ్యేలా చేస్తుందని శివ ప్రసాద్ అన్నారు. శనివారం ఈ చిత్రం టీజర్‌ను హీరో అల్లరి నరేశ్ ఆవిష్కరించారు. 'ముఖాలు కనిపించకుండా సినిమా ఎలా తీయగలిగారు? అనే ఒక్క కారణం కోసమైనా 'రారాజు' చిత్రాన్ని చూడాలనిపిస్తోంది. ఈ సినిమా కచ్చితంగా ట్రెండ్ సెట్ చేస్తుంద'ని అల్లరి నరేశ్ చెప్పారు. త్వరలో విడుదల తేదీని ప్రకటిస్తామని నిర్మాత తెలిపారు. సుగి విజయ్, మౌనిక మగులూరీ హీరో హీరోయిన్లుగా నటించారు. శేఖర్ చంద్ర మ్యూజిక్ అందిస్తున్నారు. సినిమాటోగ్రఫీ: రాహుల్ శ్రీ వాత్సవ్.

## మామయ్యకు ప్రేమతో...




ఎన్నికల్లో గెలిచి ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రిగా ప్రమాణం స్వీకారం చేసిన పవన్‌కల్యాణ్‌కు ఆయన కుటుంబ సభ్యుల నుంచి వరుస బహుమతులు పలకరిస్తున్నాయి. ఇటీవలే వదిన సురేఖ నుంచి ఖరీదైన మాంట్ బ్లాంక్ పెన్నును అందుకున్న పవన్, తాజాగా తన మేనల్లుడు సాయి దుర్గాతేజ్ నుంచి మరో బహుమతి అందుకున్నారు. ఆదివారం సాయి దుర్గాతేజ్ పవన్‌కు హాలీవుడ్ సూపర్ హిట్ సినిమా సిరీస్ 'స్టార్‌వార్స్' ఫ్రాంచైజీకి చెందిన 'స్టార్‌వార్స్ లెగో మిలీనియమ్ ఫాల్కన్' కిట్‌ను అందించారు. దాదాపు 1.20 లక్షల విలువ చేసే ఈ బహుమతిలో 'స్టార్‌వార్స్' సినిమాలోని ప్రధాన పాత్రధారుల బొమ్మలు, వారి ఆయుధాలు, వాహనాలు ఉంటాయి. "నా బాల్యంలో నాకు 'స్టార్‌వార్స్'ను, లెగో టాయ్స్‌ను పరిచయం చేసిన నా జేడీ మాస్టర్ (గురువు), ఉప ముఖ్యమంత్రికి ఇది నా కానుక. మళ్లీ ఇన్నేళ్లకు మీలోని బాలుడికి ఈ బహుమతిని ఇవ్వడం ద్వారా నా చిన్నప్పటి రోజులను గుర్తు చేసుకునే అవకాశం దక్కింది" అని ఎక్స్‌లో పేర్కొన్నారు.

## 'సెట్టవుతుందా పెయిరు'



రాజ్‌తరుణ్, మనీషా కంద్కూర్ జంటగా నటిస్తున్న చిత్రం 'భలే ఉన్నాడే'. జె.శివసాయి దర్శకత్వం వహిస్తుండగా, డైరెక్టర్ మారుతి సమర్పణలో, ఎన్వీ.కిరణ్‌కుమార్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన టీజర్ అందరినీ అలరించింది. శనివారం ఈ సినిమా నుంచి సెకండ్ సింగిల్ 'సెట్టవుతుందా పెయిరు' పాటను విడుదల చేశారు. కృష్ణకాంత్ రాసిన ఈ పాటను కపిల్ కపిలన్ ఆలపించారు. శేఖర్ చంద్ర సంగీతం అందించారు. ఈ చిత్రానికి ఎడిటర్: శ్రీకాంత్ పట్నాయక్ ఆర్, డీఓపీ: నగేశ్ బానెల్లా.

## మాస్టారు కథతో...

శ్యామ్ సెల్వన్ హీరోగా పరిచయమవుతున్న చిత్రం 'నిమ్మకూరు మాస్టారు'. రాజేంద్రప్రసాద్ ఇందులో కీలక పాత్ర పోషిస్తున్నారు. ఆముదేశ్వర్ దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని జె.ఎమ్.ప్రదీప్‌రెడ్డి నిర్మిస్తున్నారు. ఆదివారం ఈ చిత్రాన్ని తెలంగాణ రవాణ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ క్లాప్ కొట్టి ప్రారంభించారు. ఈ సందర్భంగా సంగీత దర్శకులు మాధవపెద్ది సురేశ్‌చంద్ర మాట్లాడుతూ "నా మనవడు శ్యామ్ ఇటువంటి మంచి కథతో సినిమా కెరీర్‌ను ఆరంభిస్తున్నందుకు ఆనందంగా ఉంది" అని అన్నారు. "మొదటి సినిమాలోనే రాజేంద్రప్రసాద్ వంటి లెజెండ్‌తో స్క్రీన్ పంచుకోవడం ఆనందంగా ఉంది" అని హీరో శ్యామ్ సెల్వన్ చెప్పారు. ఈ చిత్రానికి ఎడిటర్: ఎ.ఆర్.శివరాజ్, సినిమాటోగ్రాఫర్: ఎ.డి. కరుణ్, సంగీతం: మాధవపెద్ది సురేశ్‌చంద్ర.



## పత్రిక భాషను ప్రజల భాషగా మార్చేశారు

- తెలుగును ప్రేమించి, అభిమానించి, పోషించిన వ్యక్తి రామోజీరావు
- 'పాత్రికేయ శిఖరం రామోజీరావుకు అక్షరాంజలి'లో వక్తలు



పంజాగుట్ట/హైదరాబాద్ సిటీ, జూన్ 16 (ఆంధ్రజ్యోతి): తెలుగు జర్నలిజానికి జాతీయ స్థాయిలో పేరుప్రఖ్యాతులు రావడానికి కృషి చేసిన వ్యక్తి రామోజీరావు అని వక్తలు కొనియాడారు. ఆయన నికార్సయిన జర్నలిస్టు అన్నారు. క్రమశిక్షణ, సమయపాలనకు పెట్టింది పేరని.. తెలుగును ప్రేమించి, అభిమానించి, పోషించిన వ్యక్తి అని ప్రశంసించారు. ప్రెస్‌క్లబ్ ఆఫ్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ఆదివారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో 'పాత్రికేయ శిఖరం రామోజీరావుకు అక్షరాంజలి' పేరుతో ఈనాడు సంస్థల చైర్మన్ రామోజీరావు సంతాప సభ జరిగింది. రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ కె.శ్రీనివాస్‌రెడ్డి, విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు, సీనియర్ పాత్రికేయులు కె.రామచంద్రమూర్తి, అల్లం నారాయణ, వీఎస్ఆర్ శాస్త్రి, డీఎస్ ప్రసాద్, ఎం.నాగేశ్వరరావు, టి.కృష్ణమూర్తి, కార్టూనిస్ట్ శ్రీధర్, జైపాల్‌రెడ్డి, ప్రెస్ క్లబ్ అధ్యక్షుడు వేణుగోపాల్ నాయుడు, సీనియర్ పాత్రికేయులు.. రామోజీరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు తమ అనుభవాలను పంచుకున్నారు. తెలుగు జర్నలిజానికి పేరు రావడానికి ఆద్యుడు రామోజీరావు అని కె.శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ఆయన నిత్య కృషీవలుడు అని చెప్పారు. రామోజీరావు తెలుగు జర్నలిజాన్ని మారుమూల ప్రాంతాలకు తీసుకెళ్లారని.. పత్రిక భాషను ప్రజల వాడుక భాషగా మార్చారని అల్లం నారాయణ అన్నారు. ఈనాడులో పరీక్ష రాస్తే ఎంపిక కాలేదని.. అయినా రోజూ కార్యాలయానికి వెళ్లే వాడినని, చివరికి స్ట్రింగర్‌గా చేరి రామోజీరావు చేతుల మీదుగా అవార్డు తీసుకున్నానని విజయనగరం ఎంపీ కె.అప్పలనాయుడు చెప్పారు. రామోజీరావు బహుముఖ ప్రజ్ఞాశాలి అని కె.రామచంద్రమూర్తి కొనియాడారు. తెల్లవారుజామున 4 గంటలకే ఆయన దినచర్య ప్రారంభమమై రాత్రి పది గంటల వరకు నిర్విరామంగా కొనసాగేదని, రామోజీ జీవితంలో కొన్ని నేర్చుకుని, పాటించినా మంచి విజయాలు సాధించవచ్చని ఎం.నాగేశ్వరరావు అన్నారు.

## అడ్మిషన్ రద్దు చేసుకుంటే పూర్తి ఫీజు వాపసు

న్యూఢిల్లీ, జూన్ 16: విద్యార్థులు నిర్దిత గడువులోగా ఉన్నత విద్యాసంస్థల్లో తమ అడ్మిషను రద్దు చేసుకుంటే వారికి పూర్తి ఫీజును వాపసు ఇవ్వాలని విశ్వవిద్యాలయాలను యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్(యూజీసీ) ఆదేశించింది. అడ్మిషన్ల చివరి తేదీకి 15 రోజులు, అంత కన్నా ముందే అడ్మిషన్‌ను రద్దు చేసుకుంటే 100 శాతం ఫీజు రిఫండ్ ఇచ్చేలా కొత్త నిబంధనలు జారీ చేసింది. 2024-25 విద్యాసంవత్సరం నుంచే ఈ కొత్త ఫీజు రిఫండ్ పాలసీని అమలు చేయాలని వర్సిటీలను ఆదేశించింది.

## కోటాలో మరో విద్యార్థి ఆత్మహత్య

జైపూర్, జూన్ 16: రాజస్థాన్‌లోని కోటాలో మరో విద్యార్థి బలవన్మరణానికి పాల్పడ్డాడు. బిహార్‌లోని మోతీహరి ప్రాంతానికి చెందిన 17 ఏళ్ల ఆయుశ్ జైస్వాల్.. స్థానిక సామ్రాట్ చౌక్‌లో అద్దెకుంటూ ఐఐటీ- జేఈఈ శిక్షణ తీసుకుంటున్నాడు. శనివారం రాత్రి దాకా గది నుంచి బయటకు రాకపోవడంతో అనుమానం వచ్చి స్నేహితులు వెళ్లి చూడగా.. ఆయుశ్ తన గదిలో ఉరివేసుకొని కనిపించాడు. ఆస్పత్రికి తీసుకువెళ్లగా అప్పటికే అతను మరణించాడని వైద్యులు ధ్రువీకరించారు.

## ఇందిరను మదర్ ఆఫ్ కాంగ్రెస్ అని చెప్పా

- వివరణ ఇచ్చిన కేంద్రమంత్రి సురేష్ గోపి

తిరువనంతపురం, జూన్ 16 : దివంగత మాజీ ప్రధాని ఇందిరాగాంధీని 'మదర్ ఆఫ్ ఇండియా'గా అభివర్ణించడం సంచలనం కావడంతో కేంద్ర మంత్రి సురేష్ గోపి ఆదివారం వివరణ ఇచ్చారు. తిరువనంతపురంలో మీడియాతో మాట్లాడుతూ.. తాను ఇందిరను 'మదర్ ఆఫ్ ది కాంగ్రెస్ పార్టీ' అన్నానని.. మీడియా దాన్ని వక్రీకరించిందని చెప్పుకొచ్చారు. "ఎవరికి ఇష్టం ఉన్నా లేకపోయినా.. కాంగ్రెస్‌కు సంబంధించినంత వరకు కేరళలో కె. కరుణాకరన్ తండ్రి వంటివారు.. దేశంలో ఇందిరాగాంధీ తల్లి.. ఇదే నేను అన్నాను." అని ఆయన చెప్పుకొచ్చారు.

# అయితే కమీషన్.. లేదంటే వాటా!

- గనుల లీజు ఎల్‌ఓఐల జారీలో కొత్త దందా
- ఈమెయిల్‌కు బదులు భౌతిక ఫైళ్లు పంపిన అధికారి
- సాంకేతికంగా పట్టుబడకుండా అతి జాగ్రత్తలు
- తవ్వినకొద్దీ బయటికొస్తున్న అక్రమాలు

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

గనుల శాఖ అవినీతిలో ఇదో కొత్తకోణం. మేజర్, మైనర్ మినరల్స్ తవ్వకాలకు లీజులకు అనుమతులు ఇచ్చే విషయంలో కొందరు అధికారులు సాధారణంగా కమీషన్, ముడుపుల రూపంలో డబ్బులు తీసుకుంటారు. అయితే, గనులదందాలో ఆరితేరిన ఓ అధికారి కమీషన్‌తోపాటు ఆయా కంపెనీల్లో వాటాలు కూడా పొందినట్లు తెలిసింది. కలిసొచ్చిన చోట కమీషన్‌లు, బాగా ప్రీమియం క్వారీల పరిధిలో 20 నుంచి 35 శాతం వాటాలు తీసుకున్నట్లు తాజాగా బయటకొచ్చింది. లెటర్ ఆఫ్ ఇంటెంట్(ఎల్‌ఓఐ)ల జారీలో వాటాల దందా ప్రముఖంగా సాగినట్లు విశ్వసనీయంగా తెలిసింది. ఉమ్మడి గుంటూరు, ప్రకాశం, నెల్లూరు, చిత్తూరు, కృష్ణా, విశాఖ తదితర జిల్లాల్లో ప్రీమియం మినరల్స్ ఉన్న క్వారీలకు ఎల్‌ఓఐలు ఇచ్చేందుకు బదులుగా వాటాలు తీసుకున్నారని సమాచారం. వీటికి సంబంధించిన ఫైళ్లను జిల్లాల డిప్యూటీ డైరెక్టర్, అసిస్టెంట్ డైరెక్టర్ కార్యాలయాలకు ఈమెయిల్ రూపంలో కాకుండా భౌతికంగానే పంపించినట్లు తెలిసింది. ఈమెయిల్స్‌తో బండారం బయటపడకుండా ప్రత్యేకంగా మనుషులను పెట్టి జిల్లాలకు భౌతికంగానే ఆ ఫైళ్లు పంపించినట్లు సమాచారం. ఎన్నికల కోడ్ అమల్లో ఉండగానే 190, ఫలితాలు వచ్చిన మరుసటి రోజు మరో 90 గనుల లీజులకు అనుమతులు మంజూరు చేస్తూ ఎల్‌ఓఐలు ఇచ్చిన విషయాన్ని తాజాగా 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకొచ్చిన సంగతి తెలిసిందే. ఈ సందర్భంగా ఎల్‌ఓఐల జారీలో కొత్తగా ఎలాంటి ఘోరాలు చేశారో గనుల శాఖలోనే కొందరు అధికారులు వివరించారు. ఉమ్మడి ప్రకాశం, గుంటూరు, నెల్లూరు, చిత్తూరు జిల్లాల పరిధిలో గ్రానైట్, క్వార్ట్జ్ లీజుల విషయంలో వాటాల దందా నడిపినట్లు తెలిసింది. ప్రకాశం జిల్లాలో 9 మంది లీజుదారులను బెదిరించి కమీషన్ సొమ్ముకు బదులుగా క్వారీల్లో 35 శాతం మేర వాటాలు గనుల శాఖ కీలక అధికారి సూచించిన వారికి ఇచ్చేలా బలవంతపు ఒప్పందాలు రాయించినట్లు తెలిసింది. ఆ తర్వాతే వాటికి ఎల్‌ఓఐలు ఇచ్చినట్లు చెబుతున్నారు. తనను తీవ్రంగా బెదిరించారని, వాటా ఇవ్వకపోతే ఎల్‌ఓఐ రాదని, పెనాల్టీలు వేస్తామని గనుల శాఖ పెద్ద వద్ద పనిచేసిన శశితోపాటు ఓఎస్‌డీ, కీలక అధికారి బెదిరించారని ఓ లీజుదారుడు 'ఆంధ్రజ్యోతి'కి చెప్పారు. తన క్వారీ నుంచి 20 శాతం వాటా రాయించుకున్నారని ఆరోపించారు. గనుల శాఖలో కీలక అధికారి వద్ద పని చేస్తోన్న ఓ సహాయకుడు రాజమండ్రికి చెందిన ఓ గనుల అధికారి ద్వారా డబ్బు వసూలు చేశారని చెప్పారు. ఓ మాజీ మంత్రి సమీప బంధువుల నుంచి కమీషన్‌తోపాటు వాటాలు లాక్కున్నారని తెలిపారు. నాలుగు జిల్లాల పరిధిలో 22 మంది నుంచి బలవంతంగా వాటాలు రాయించుకున్నారని తెలిసింది. కమీషన్ వసూళ్లు, బలవంతపు వాటాల ఉదంతంలో చర్చలన్నీ వాట్సప్‌ద్వారానే జరిగినట్టు తెలిసింది.

# ఆర్‌డబ్ల్యూఎస్‌లో పైరవీలు

- కీలక ఈఎన్‌సీ పోస్టు కోసం వైసీపీ విధేయుల డబుల్ గేమ్
- టీడీపీ నేతలకు విన్నపాలు
- కోర్టులో కేసు నడుస్తున్నా పైరవీలు
- గతంలో అన్నీ అవినీతి ఆరోపణలే

(విజయవాడ-ఆంధ్రజ్యోతి)

గ్రామీణ నీటి సరఫరా విభాగం(ఆర్‌డబ్ల్యూఎస్)లోని కీలక ఈఎన్‌సీ పోస్టు కోసం గత ప్రభుత్వంలో చక్రం తిప్పిన ఇద్దరు అధికారులు పోటీ పడుతున్నారు. వైసీపీ ప్రభుత్వంలో పెద్దలకు వీర విధేయులుగా పని చేసిన ఈ ఇద్దరు ప్రస్తుతం టీడీపీ ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతున్నారు. గత ప్రభుత్వంలో వీరిద్దరూ వ్యవహరించిన తీరు తెలిసి ఎవరూ వీరికి అభయం ఇవ్వట్లేదు. వచ్చే నెలలో ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కృష్ణారెడ్డి పదవీ విరమణ నేపథ్యంలో ఈ ఇద్దరూ ఎలాగైనా ఆ పదవిని సాధించాలన్న పట్టుదలతో ఉన్నారు.

### పట్టిందల్లా బంగారమే..

ఆర్‌డబ్ల్యూఎస్‌లో పదోన్నతుల చుట్టూ వివాదం అలముకుంది. అక్రమంగా పదోన్నతులు ఇవ్వటంపై కోర్టులో కేసు కూడా నడుస్తోంది. దీనిపై ఏడుగురు ఐఏఎస్ అధికారులతో కమిటీ కూడా ఏర్పడింది. ఈ కమిటీ కోర్టుకు ఇంకా నివేదిక ఇవ్వకుండానే, వివాదాస్పద రీతిలో పదోన్నతి పొందిన అధికారులు ఈఎన్‌సీ పోస్టు కోసం ఆరాట పడుతున్నారు. వైసీపీ హయాంలో ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం నిధులను ఆర్‌డబ్ల్యూఎస్ ఉన్నతాధికారులు సొంతం చేసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. రూ.30 కోట్లకు పైగా కార్ల ఆయిల్ బిల్లులు, అద్దె బిల్లులను దోచేశారు. ఈ డబ్బులన్నీ సొంత ఖాతాలకు మళ్లించుకున్నట్టు పెద్ద ఎత్తున ఆరోపణలు వచ్చాయి. మరో రూ.11 కోట్ల మేర ఎస్‌డబ్ల్యూఎస్‌ఎం నిధులు డ్రా చేయకుండా ఉన్నాయని తెలుస్తోంది. అడ్డగోలుగా, నిబంధనలకు విరుద్ధంగా పదోన్నతులు ఇవ్వటంలో రూ.కోట్లు చేతులు మారినట్టు ఆరోపణలు వచ్చాయి. నిబంధనలకు విరుద్ధంగా ఎడాపెడా డిప్యుటేషన్లు ఇవ్వటం ద్వారా భారీగా డబ్బు సంపాదించిన ఉదంతాలున్నాయి. కింది స్థాయిలో అవినీతి కేసులు కూడా ఈఎన్‌సీ కార్యాలయ ఉన్నతాధికారులకు కాసులు తెచ్చిపెట్టాయి. తమపై చర్యలు తీసుకోకుండా ఉండటానికి ఉన్నతాధికారులకు ఉద్యోగులు భారీ ఎత్తున డబ్బు సమర్పించుకున్నారు. క్వాలిటీ కంట్రోల్ పేరుతో వేధింపులకు పాల్పడి కాసులు పిండుకోవటం, జల్ జీవన్ మిషన్(జేజేఎం) పథకంలో భాగంగా తాము చెప్పిన కంపెనీల దగ్గరే పైపులు, ట్యాపులు, ఇతర సామగ్రి కొనుగోలు చేయాలని కాంట్రాక్టర్లకు నిర్దేశించడం ద్వారా భారీ ఎత్తున అక్రమార్జన చేశారు. వీరి వ్యవహారం గురించి బాగా తెలిసిన సీనియర్లు ముఖ్యమంత్రి చంద్రబాబుకు ఫిర్యాదు చేయాలని భావిస్తున్నారు.

### అడ్డగోలుగా పదోన్నతులు

వైసీపీ హయాంలోనే పదోన్నతుల వివాదం అలముకుంది. వైసీపీ హయాంలో 2019 నుంచి సీనియారిటీ జాబితాను సవరించారు. దీనివల్ల అంతకుముందు వరకు సీనియారిటీలో ఉన్నవారికి అన్యాయం జరిగింది. అనర్హులు రెండు, మూడుసార్లు పదోన్నతులు పొందారు. మొదటి నుంచి సీనియారిటీ ఉన్నవారంతా పదోన్నతులు పొందలేకపోయారు. ఎస్సీ, ఎస్టీలకు పదోన్నతులు కల్పించే విషయంలో అనుసరించిన పద్ధతి వల్ల ఆ కేటగిరీలోనే అర్హులైన వారికి అన్యాయం జరిగింది. ఈ విషయంలో గతంలో సుప్రీంకోర్టు ఇచ్చిన మార్గదర్శకాలను కూడా పాటించలేదు. డీఈలు ఇప్పటికీ డీఈలుగానే ఉండగా, ఎస్సీ, ఎస్టీ కోటా పేరుతో ఇష్టానుసారం డీఈఈలను ఈఈలుగా, ఈఈలను ఎస్ఈలుగా, ఎస్ఈలను సీఈలుగా పదోన్నతి కల్పించారు. వాస్తవానికి ఎస్సీ, ఎస్టీల్లో సీనియారిటీ ఉన్న వారికి అన్యాయమే జరిగింది. ఇలాంటి వారంతా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఎన్‌సీ కార్యాలయానికి వెళ్లి నిలదీశారు. ఇది తమ పరిధిలో జరిగింది కాదని, పంచాయతీరాజ్ శాఖకు వెళ్లి అడగాలని ఉచిత సలహాలు ఇచ్చేవారు. పంచాయతీరాజ్ శాఖ కార్యాలయానికి వెళ్లగా, తాము సరిగ్గానే ఇచ్చామని, మీ దగ్గరే సీనియారిటీ లిస్టు మారిందని, అక్కడే తేల్చుకోవాలని చెప్పేవారు. మళ్లీ ఆర్‌డబ్ల్యూఎస్‌కు వచ్చి అడిగితే మాకేమీ సంబంధం లేదని చెప్పేవారు. తమకు అర్హతలు ఉండీ పదోన్నతులు రాకపోవటానికి కారణమేమిటని జోన్-3కి చెందిన ఇద్దరు మహిళా అధికారులు ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులను ప్రశ్నించగా, ఎక్కువ మంది ఎస్సీలు ఉండటం వల్ల మీకు పదోన్నతి ఇవ్వటం సాధ్యపడలేదని ఒకరికి చెప్పారు. ఈ సమాధానం ఇచ్చిన అధికారిణి ముందు వరసలో ఉండటం వల్ల పదోన్నతి ఇవ్వటం వీలు పడలేదని మరొకరికి లిఖితపూర్వక సమాధానం ఇచ్చారు.

### అడ్డదారిలో..

ఈఎన్‌సీ పోస్టుకు అర్హత సాధించే క్రమంలో కూడా వీరిద్దరూ అడ్డదారిలోనే గ్రేడ్ సాధించారు. ఈ క్రమంలో వీరికంటే సీనియారిటీ లిస్టులో ముందు వరసలో ఉన్న పలువురు ఎస్ఈలు కోర్టును ఆశ్రయించారు. ఈ క్రమంలో కోర్టు సమగ్ర రిపోర్టును కోరింది.

## గల్ఫ్ దేశాల్లో బక్రీద్

- మక్కాలో చివరి అంకానికి హజ్ యాత్ర
- 10 వేల మందికి పైగా తెలుగు యాత్రికులు

(ఆంధ్రజ్యోతి గల్ఫ్ ప్రతినిధి)

గల్ఫ్ దేశాల్లో ఆదివారం ఈద్ అద్హా (బక్రీద్) జరిగింది. మక్కా హజ్ యాత్రలో కీలకమైన దెయ్యానికి రాళ్లు కొట్టే రమ్మీ కార్యక్రమం మొదలై హజ్ తుది అంకానికి చేరుకుంది. దెయ్యానికి రాళ్లు కొట్టే ఈ కార్యక్రమం మూడు రోజుల పాటు జరుగుతుంది. హజ్ యాత్రలో అత్యంత కీలకమైన ఈ ఘట్టంలో తొక్కిసలాట జరుగకుండా భారీ ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నారు. ప్రపంచ వ్యాప్తంగా 1.80 కోట్ల మందికి పైగా హజ్ యాత్రలో పాల్గొంటున్నట్లుగా సౌదీ అరేబియా అధికారులు వెల్లడించారు. కృత్రిమ మేధస్సు డ్రోన్ల సాయంతో హజ్‌లో అక్రమాలు జరుగకుండా అధికారులు చర్యలు చేపట్టారు. ఈ ఏడాది హజ్ యాత్రలో భారతదేశం నుంచి 1.75 లక్షల మంది యాత్రికులు పాల్గొంటుండగా ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి 10,819 మంది ఉన్నారు. కాగా, మక్కాలోని క్యాంపుల్లో సరైన సదుపాయాలు లేవని పలువురు యాత్రికులు అధికారులకు ఫిర్యాదు చేశారు. బస్సు ఎక్కే యత్నంలో హైదరాబాద్ నగరానికి చెందిన ఓ యాత్రికుడు ప్రమాదంలో మరణించగా మహబూబ్‌నగర్, నిజామాబాద్ జిల్లాలకు చెందిన మరో ఇద్దరు ఎండల బారిన పడి వడదెబ్బతో చనిపోయారు. కాగా, తమ జీవిత కలపు కోరిక అయిన హజ్ యాత్ర చేయడం అమితానందాన్ని కలిగిస్తోందని తెలంగాణకు చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు మోహమ్మద్ సమీయోద్దీన్ పేర్కొన్నారు.

## నేపాల్‌లో పట్టుబడిన 173 టన్నుల ఎర్రచందనం

- తిరుపతికి తెచ్చేందుకు సిద్ధమైన అటవీ శాఖ అధికారులు
- విదేశాల్లో పట్టుబడ్డ సరుకు దేశానికి తరలించడం ఇదే తొలిసారి

మంగళం, జూన్ 16: అత్యంత విలువైన ఎర్రచందనాన్ని వివిధ మార్గాల్లో దేశం సరిహద్దులు దాటిస్తున్న స్మగ్లర్లు తాజాగా నేపాల్‌లో ఊహించని విధంగా అక్కడి అధికారులకు పట్టుబడ్డారు. దాదాపు 173 టన్నుల ఎర్రచందనం దుంగలను అక్కడి అధికారులు పట్టుకున్నారు. దాన్ని తిరుపతికి తీసుకొచ్చేందుకు అధికారులు సిద్ధమయ్యారు. అనుమతులు లేకుండా తరలిస్తున్న ఈ ఎర్రచందనం దుంగలను తొలుత నేపాల్ పోలీసులు సాధారణ కలపగా భావించి స్వాధీనం చేసుకున్నారు. అయితే విచారణలో ఇది కోట్ల రూపాయల విలువ చేసే ఎర్రచదనంగా గుర్తించారు. భారత్‌తో నేపాల్‌కు ఉన్న సత్సంబంధాల కారణంగా దీనిపై కేంద్ర ప్రభుత్వానికి సమాచారం అందించారు. దీన్ని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వ అధికారులు ఎర్రచందనం నిర్ధారణకు నేపాల్ వెళ్లేందుకు ఏపీ ఏసీసీఎఫ్ (ప్రొడక్షన్) ఖజురియాకు ఆదేశాలిచ్చారు. నేపాల్‌కు వెళ్లిన ఆయన అక్కడి అధికారులు స్వాధీనం చేసుకుంది ఎర్రచందనమేనని నిర్ధారించారు. దీంతో మే నెల నుంచి 90 రోజుల్లో నేపాల్‌లో ఉన్న ఎర్రచందనం దుంగలను భారత్‌కు తరలించడానికి ఆ ప్రభుత్వం అనుమతులు కూడా ఇచ్చింది. ఈ నేపథ్యంలో ఈ నెల 20న తొమ్మిది మంది ఏపీ అటవీ శాఖ అధికారుల బృందం నేపాల్‌కు వెళ్లడానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. ఈ నెల 30వ తేదీలోగా ఈ బృందం నేపాల్‌లో ఉన్న 173 టన్నుల ఎర్రచందనాన్ని తిరుపతిలోని తిమ్మినాయుడుపాళెం వద్ద ఉన్న సెంట్రల్ గోడౌన్‌కు తీసుకొచ్చి భద్రపరచనున్నారు. ఇతర దేశాల్లో పట్టుబడిన ఎర్రచందనాన్ని మన దేశానికి తరలించడం ఇదే తొలిసారి.

## వీఎంసీ కమిషనర్, మేయర్ బక్రీద్ శుభాకాంక్షలు

వన్‌టౌన్, జూన్ 16: ఈద్-ఉల్-అదా (బక్రీద్) సందర్భంగా ముస్లిం సోదరసోదరీమణులకు మేయర్ రాయన భాగ్యలక్ష్మి, వీఎంసీ కమిషనర్ స్వప్నిల్ దినకర్ సంయుక్తంగా శుభాకాంక్షలు తెలిపారు. ధనిక, పేద తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా ముస్లిం సోదరులందరూ ఈ పండుగను భక్తిశ్రద్ధలతో నిర్వహించుకుంటారన్నారు. ఎటువంటి అవాంతరాలు లేకుండా ముస్లిం సోదరులు నమాజ్ చేసుకునేందుకు ఈద్గాల్లో అన్ని ఏర్పాట్లు చేసినట్టు వారు తెలిపారు.

## కురుబ కులానికి ప్రాధాన్యత ఇచ్చిన చంద్రబాబుకు ధన్యవాదాలు

- రాష్ట్ర కురుబ సంఘం నేతలు

ధర్నాచౌక్, జూన్ 16: రాష్ట్రంలో జరిగిన ఎన్నికల్లో టీడీపీ అధినేత చంద్రబాబు కురుబ సామాజికవర్గానికి తగిన ప్రాధాన్యత కల్పించడంపై రాష్ట్ర కురుబ సంఘం నేతలు హర్షం వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. కురుబ కులాన్ని గుర్తించి హిందూపురం పార్లమెంట్ స్థానాన్ని బీకే పార్థసారథి, కర్నూల్ పార్లమెంట్ స్థానాన్ని పంచలింగాల నాగరాజు, పెనుగొండ శాసనసభ స్థానాన్ని సవితకు కేటాయించడం, రాష్ట్ర క్యాబినేట్‌లో సవితకు స్థానం కల్పించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల సందర్భంగా కురుబ సామాజికవర్గానికి ఇచ్చిన హామీలను అమలు చేయాలని కోరారు. సంఘం నేతలు ఆంజనేయులు, ఈశ్వరయ్య, మురళీ మనోహర్‌రెడ్డి, ప్రసాద్, శ్రీనివాసరావు, ఆవులరెడ్డి శేఖర్, శ్రీనివాసులు పాల్గొన్నారు.

## టీఎస్ కానిస్టేబుల్‌ను బెదిరించి ఫోన్, నగదు అపహరణ

వన్‌టౌన్, జూన్ 16: దుర్గమ్మ దర్శనార్థం వచ్చిన తెలంగాణ రాష్ట్రానికి చెందిన కానిస్టేబుల్ టేకుమట్ల శ్రీను (31)ను ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు బెదిరించి నగదు, ఫోన్ అపహరించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఆదివారం కృష్ణలంక పోలీసులు కేసు నమోదు చేశారు. తెలంగాణ రాష్ట్రం హనుమకొండ ధర్మసాగర్ మండలం ఉనికిచర్ల గ్రామానికి చెందిన టేకుమట్ల శ్రీను భూపల్‌పల్లి తెలంగాణ హెడ్‌క్వార్టర్స్‌లో కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఇతడు అమ్మవారి దర్శనం నిమిత్తం ఈ నెల 15న రాత్రి తన గ్రామం నుంచి బయలుదేరాడు. ఆదివారం తెల్లవారుజామున 3.30 గంటలకు బస్టాండ్‌లో బస్సుదిగి బయటకు వచ్చి టీస్టాల్ వద్ద టీ తాగాడు. అక్కడ నిలబడి ఉండగా ఓ వ్యక్తి వచ్చి తన స్నేహితుడికి ఫోన్ చేయాలని బాధితుడు శ్రీను వద్ద ఫోన్ తీసుకుని తన స్నేహితుడితో మాట్లాడాడు. కొద్దిసేపటికి బైకుపై మరో వ్యక్తి వచ్చి ఫోన్‌లో మాట్లాడిన వ్యక్తి ఇద్దరు కలిసి బాధితుడు శ్రీను ఎక్కడకు వెళుతున్నాడని అడగ్గా దుర్గగుడికి అని బాధితుడు బదులిచ్చాడు. దీంతో వారు తాము కూడా దుర్గగుడికి వెళుతున్నామని శ్రీనుని బైక్‌పై ఎక్కించుకుని వారధి కింద కృష్ణానది వైపునకు తీసుకుని వెళ్లి బెదిరించి అతడి వద్ద ఉన్న ఫోన్, రూ.1000 నగదు లాక్కుని పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

## కేశినేని శివనాథ్ దంపతులకు రాములవారి చిత్రపటం బహూకరణ



ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) దంపతులను హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో వారి వివాహ దినోత్సవం సందర్భంగా ఆదివారం టీడీపీ మైనారిటీ నేత మహమ్మద్ ఫతావుల్లా, షేక్ ఆశా కలిశారు. ఈ సందర్భంగా చిన్ని దంపతుల వివాహ దినోత్సవాన్ని పురస్కరించుకుని శుభాకాంక్షలు అందజేస్తూ రాములవారి చిత్రపటాన్ని బహూకరించారు. అనంతరం చిన్ని దంపతులను శాలువాతో సత్కరించారు. - వన్‌టౌన్

# దుర్గగుడిలో సదుపాయాల కల్పనకు చర్యలు

- ఎమ్మెల్యే సుజనా చౌదరి



ఎమ్మెల్యే సుజనా చౌదరికి దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న మంత్రి రవీంద్ర, ఈవో రామారావు

వన్‌టౌన్, జూన్ 16: దుర్గగుడిలో భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని అభివృద్ధి చేసి విస్తృతమైన సదుపాయాలు అందించేందుకు ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు స్థానిక ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. ఆదివారం ఆయన ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆయన్ను మంత్రి కొల్లు రవీంద్ర, ఈవో కేఎస్ రామారావు మర్యాదపూర్వకంగా కలిశారు. సుజనా చౌదరికి వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అనంతరం సుజనా చౌదరి మాట్లాడుతూ అమ్మవారి భక్తుడిగా ఆలయంలో భక్తులకు సేవ చేసే భాగ్యం కలిగినందుకు అదృష్టంగా భావిస్తున్నానన్నారు. ఆలయాన్ని మరింతగా అభివృద్ధి చేసి దేశంలోనే ప్రసిద్ధ దివ్యక్షేత్రంగా తీర్చిదిద్దేందుకు ప్రత్యేక ప్రణాళికలను రూపొందించామన్నారు. సాంకేతిక పరిజ్ఞానంతో అభివృద్ధి పనులు చేపట్టి మరిన్ని మౌలిక సదుపాయాలు కలుగజేస్తామన్నారు. సీఎం చంద్రబాబు, దేవదాయశాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డితో సమన్వయపరచుకుని ఆలయాభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా ఆయనకు దుర్గమ్మ చిత్రపటం, శేషవస్త్రం, ప్రసాదం ఈవో, మంత్రి కొల్లు రవీంద్ర అందజేశారు.

### నగరాల అమ్మవారి దేవస్థాన ప్రతినిధుల అభినందనలు

నగరాల సీతారామస్వామి మహాలక్ష్మి అమ్మవార్ల దేవస్థానం అధ్యక్ష, కార్యదర్శులు లింగిపిల్లి అప్పారావు, మరుపిళ్ల హనుమంతరావు, మరుపిళ్ల వెంకట అప్పారావు, మన్నెం పోతరాజు ఆదివారం కానూరులోని ఎమ్మెల్యే సుజనా చౌదరి ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలిశారు. శాలువా కప్పి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలిపారు.

# అధికార పార్టీ నేతల ఇంటికి జంప్ జిలానీల క్యూ

- ఫలితాలు వచ్చిన తెల్లవారే అధికార పార్టీ పేరుతో బ్యానర్లు
- సొంత పార్టీ వాళ్లను తప్పితే వేరే పార్టీల వారిని రానివ్వని నేతలు

మధురానగర్, జూన్ 16: నిన్న మొన్నటి దాకా వైకాపాలో దర్జా వెలగబెట్టిన చోటామోటా నేతలంతా నేడు అధికార పార్టీలో చేరడానికి గెలిచిన ఎమ్మెల్యేల వద్దకు పూలబొకేలు, శాలువాలతో ఉదయాన్నే క్యూ కడుతున్నారు. ఫలితాలు వచ్చిన తర్వాత రోజు నుంచే వీరి తాకిడి మొదలైంది. నగరంలో తూర్పు, సెంట్రల్‌లో గెలిచిన గద్దె రామ్మోహన్, బొండా ఉమామహేశ్వరావు కార్యాలయాల వద్ద ప్రతిరోజు ఉదయాన్నే వస్తున్న టీడీపీ నేతలతో పాటు వీరు కూడా తయారవుతున్నారు. మొదటి రెండు రోజులు పెద్దగా పట్టించుకోని ఎమ్మెల్యేల కార్యాలయాల ఇన్‌చార్జులు తరువాత వీరిరాకను గుర్తించి తమ నేత చెవిలో వేస్తున్నారు. ఇటీవల ఎన్నికల ప్రచారంలో టీడీపీ అభ్యర్థి కుటుంబ సభ్యులు ప్రచారానికి వెళ్లినపుడు వారితో అనుచితంగా ప్రవర్తించిన వైకాపా డివిజన్ నేతలు ఉదయాన్నే సదరు టీడీపీ ఎమ్మెల్యేను అభినందించడానికి వెళ్లారు. అక్కడ వీరిని గుర్తించిన సిబ్బంది వారి రాకను ఎమ్మెల్యే చెవిలో వేయడంతో వారిని పిలిపించి తగిన సత్కారం చేసి పంపారు. వైకాపా అధికారంలోకి రాగానే పార్టీ మారిన కార్పొరేటర్ తరువాత వైకాపాలో రూరల్‌లో ఎమ్మెల్యే టికెట్‌కు గట్టిగా ప్రయత్నించాడు. కాని పనవ్వలేదు. తీరా ఊహించని విధంగా టీడీపీ అధికారంలోకి రావడంతో మళ్లీ పాతగూటికి రావడానికి తన వంతు ప్రయత్నాలు చేస్తున్నా ఫలించడం లేదు. కొన్ని ట్రేడ్ యూనియన్లు, కార్మిక సంఘాల నేతల కూడా ఇదే వరసలో ఉన్నారు. ఎన్నికల సమయంలో వైకాపా గెలుపు కోసం తీవ్రంగా శ్రమించిన కొందరు నేతలు ఇపుడు తమ వ్యాపారాలను కాపాడుకోవడానికి అధికార పార్టీ పంచన చేరడానికి సిద్ధమవుతున్నారు. సెంట్రల్‌లో వీరి పప్పులుడకడం లేదు. దీంతో వారు దిక్కు తోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. ఇలాంటి వారి విషయంలో బొండా ఉమామహేశ్వరరావు కార్యాలయం బాధ్యులు వచ్చిన వారి పూర్తివివరాలు సేకరించి నిర్ధారించుకున్న తరవాత ఎమ్మెల్యే వద్దకు పంపుతున్నారు. తూర్పులోని ఒక డివిజన్‌లో వైకాపాలో ఉండి, జిల్లాస్థాయి పదవులు వెలగబెట్టినవారు, కమ్యూనిటీ హాళ్లను వశం చేసుకోవడానికి ప్రయత్నించిన కొందరు ఫలితాలు వచ్చిన మరునాడే పార్టీ మార్చేశారు. చంద్రబాబు ప్రమాణ స్వీకారాన్ని పురస్కరించుకుని చంద్రబాబును పొగుడుతూ బ్యానర్లు కూడా కట్టేశారు. ఐదేళ్లు తమను, పార్టీని నమ్ముకుని ఉన్న వారిని, నిజంగా ఏదన్నా అవసరం కోసం వచ్చిన ప్రజలను మాత్రమే ఎమ్మెల్యే కలుస్తున్నారు. వారు వచ్చిన పని తెలుసుకుని సాయం చేస్తున్నారు.



మంత్రి కొల్లు రవీంద్రకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న టీఎన్‌టీయూసీ నేతలు

## మంత్రి కొల్లు రవీంద్రకు టీఎన్‌టీయూసీ నేతల శుభాకాంక్షలు

పాయకాపురం, జూన్ 16: రాష్ట్ర గనులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్రను టీఎన్‌టీయూసీ నేతలు ఆదివారం మర్యాదపూర్వకంగా కలిశారు. మచిలీపట్నంలోని మంత్రి కార్యాలయంలో రవీంద్రను కలిసిన నేతలు శాలువా కప్పి పుష్పగుచ్ఛాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా టీఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గొట్టుముక్కల రఘురామరాజు మాట్లాడుతూ రాష్ట్రం బాగుపడాలంటే సమర్థవంతమైన సీఎం కావాలని అందుకే రాష్ట్ర ప్రజలు తిరుగులేని తీర్పుతో మళ్లీ చంద్రబాబును ముఖ్యమంత్రిని చేశారన్నారు. మంత్రి కొల్లు రవీంద్రను కలిసిన వారిలో పరుచూరి ప్రసాద్, చరణ్ సాయి యాదవ్, సూర్యప్రకాష్, శ్యామ్ ఉన్నారు.



'అందరికీ శ్రీ హరే అంతరాత్మ' పుస్తకావిష్కరణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సుధాస్వామి, విజయశంకర స్వామి

## బహుళత్వం, ఏకత్వభావన హిందూమత జీవనాడి

- అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి

గవర్నర్‌పేట, జూన్ 16: బహుళత్వం, ఏకత్వభావన హిందూమతానికి జీవనాడి అనే భావనను పరిరక్షించేందుకు విద్వేషం, అసమానతలపై స్వామీజీలతో హిందూమత సమ్మేళనం నిర్వహిస్తున్నట్టు అన్నమయ్య కళాక్షేత్ర పీఠాధిపతి విజయశంకర స్వామి అన్నారు. ఈనెల 19న హైదరాబాద్‌లో జరిగే హిందూమతం సమ్మేళనంలో జైభారత్ పబ్లికేషన్స్ ప్రచురించిన 'అందరికీ శ్రీహరే అంతరాత్మ' పుస్తకావిష్కరణకు సంబంధించిన పోస్టర్ ఆవిష్కరణ ఆదివారం లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీషిర్డినాగసాయి బాబా మందిరంలో జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో విశాల భావన కలిగిన హిందూమతాన్ని ఒక సంకుచిత చట్రంలో ఇరికించేందుకు కొన్ని మతోన్మాద సంస్థలు, వ్యక్తులు నిరంతరం ప్రయత్నిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. నాగసాయిబాబా మందిరం వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి హిందూ మతం వివిధ విశ్వాసాలు, జీవన విధానాల సహజీవనంతో కూడిన ఒక విశాలమైన వ్యవస్థ అన్నారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో జైభారత్ జాతీయ అధికార ప్రతినిధి ఖదిజ్ఞాసి యోధ మల్లిఖార్జున, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు ఖదిజ్ఞాసి యోధ సత్యనారాయణ పాల్గొన్నారు.